# నన్నెచోడుని కళావిలాసము: కొన్ని చర్చనీయాంశాలు

## ఏల్చూరి మురళీధరరావు

నన్నెచోడుని కుమారసంభవ కావ్యాన్ని తొలిసారి ప్రకటించిన మానవల్లి రామకృష్ణకవిగారు 1909 నాటి ప్రథమభాగం పీఠికలో ఈ విధంగా వ్రాశారు:

*"ఇతఁడు కలావిలాస మను మఱియొక్క కావ్యమును గూడరచించెను. అది నాకు లభింపకున్నను దానిలోని పద్యములు కవిసంజీవని, రత్నాకరము, అథర్వణచ్ఛందము, గణపవరపు వేంకటకవి లక్షణశిరోమణిలో నుదాహరింపఁబడినవి. ఆపద్యములలోఁ గొన్నింటి నిందుదాహరించినయెడల సుముఖులెవ్వరైనఁ దద్గ్రంథమును వెదకి దానినన్వర్థమగు మరణమువలనఁ దప్పింతురను నాస గలుగుచున్నది.*

***సీ. పృథుల విశ్వంభరారథమున కెదురుగాఁ బూన్పించె నెవ్వాఁడు పువ్వుఁదేరు***
***కాంచనాచల కార్ముకమునకు సాటిగాఁ జేపట్టె నెవ్వాఁడు చెఱకువిల్లు***
***నవిరళ పాశుపతాస్త్రమునకు వాఁడి మిగిలించె నెవ్వాఁడు చిగురుఁదూపు***
***నతులితామర దానవాదిబలంబుల గెలిపించె నెవ్వఁడయ్యళిబలంబు***

***నట్టి జగజెట్టి మన్మథుం డఖిలలోక***
***ములకు వెఱగొంగ జీవుల మూలకండ***
***యతనియిలుఁ జొచ్చి వెడలనియతఁడు గలఁడె***
***యతనియమ్ములఁ బడకున్న యదియుఁ గలదె.***

***క. తలపోయఁగ రుచులాఱును***
***గలుగును వాతంబుఁ గ్రిమియుఁ గఫముంజెడు నా***
***కలివుట్టు దగయుఁ జెడుఁ ద***
***మ్ములము పదార్థంబు రాగమూలము ధరణిన్.***

***చ. తొడవులు వెట్టు సంభ్రమముతోఁ దిలకించు మడుంగుగట్టు పైఁ***
***బడఁ దడవోప దింపెఱిఁగి పట్టుదు నేర్పులు గట్టిపెట్టుఁ బ***
***ల్కెడునెడఁ దొట్రుపాటొదవుఁ గింకకు చేగిలుమన్ సమర్పఁగాఁ (?)***
***జిడుముడిఁ బొందుఁగాంత పతిచేరిన గూరిమిగల్గెనేనియున్.***

***చ. లలనలు కొందఱాత్మపతులం దగఁగూడినచెయ్వులన్నియుం***

*దలఁచి సఖీజనంబులకుఁ దప్పకచెప్పెడు వారు పుణ్యజీ*
*వులు చెలి యామినీశుని కవుంగిలి డాయుటె కాక తాల్మికీ*
*ల్దొలఁగిన తీరుగీరు నటదోపవు నాకు రతిప్రయోగముల్.*

*క్షేమేంద్రుఁడను నొకానొక కశ్మీరమహాకవి కలావిలాసమని సంస్కృతమున నొకగ్రంథము వ్రాసియున్నాఁడు. తెనుఁగుబద్యముల నన్నియుఁ గూర్చి పోల్చిచూడఁగా నద్దాని కిది తెనుఁగుగాదనియు నిందుఁ గద్యభాగముకూడఁ గలదనియు సంస్కృతమున దానిలోఁ గద్యాంశములు లేకుండుటయుఁ జూడఁగా రెంటికిని నామమాత్రసాదృశ్యము గలదని తేలినది."*

- *(మానవల్లికవి రచనలు: పుటలు. 1,2)*

సుప్రమాతమైన ఈ నిర్ధారితాంశాన్ని పురస్కరించికొని చరిత్రకారులు, విమర్శకులు నన్నెచోడుని రచనమైన 'కళావిలాసము' అన్న ఆంధ్రకృతి - సంస్కృతవ్యాఖ్యాతృశిరోమణి శ్రీమదభినవగుప్తాచార్యులవారి శిష్యుడు, క్రీస్తుశకం 1029-1064ల నడుమ కాశ్మీరదేశాన్ని పరిపాలించిన అనంత నరేంద్రుని ఆస్థానకవి, మహాలాక్షణికుడు, మహాకవి అయిన క్షేమేంద్రుని 'కలావిలాస' కావ్యానికి అనువాదం కాదని, నామసాదృశ్యం తప్పించి దానితో ఎటువంటి సంబంధమూ లేని స్వతంత్రకావ్యమని నిశ్చయించారు. నన్నెచోడుని కాలం, కుమారసంభవ కర్తృత్వం తెలుగు సాహిత్యచరిత్రలో వివాదాస్పదం అయిన తర్వాత కూడా మానవల్లి వారి ఈ నిర్ధారణ విషయం క్షోదక్షమంగా మళ్ళీ పరీక్షకు గురికాలేదు. అందువల్ల ఈ వ్యాసంలో తెలుగు *కళావిలాసము*ను గురించిన కొన్ని చర్చనీయాంశాలు చర్చింపబడుతున్నాయి.

సాధ్యనిర్దేశానికి ఉపక్రమణిక ఇది: క్షేమేంద్రుని కలావిలాసానికి తెలుగు *కళావిలాసము* నిజంగా అనువాదం అవునా? కాదా? అన్నది ప్రధాన సమస్య. పై ఉదాహరణలో మానవల్లి వారు ఏయే గ్రంథాలలో ఈ *కళావిలాసము*లోని పద్యాలు ఉదాహరింపబడి ఉన్నాయని సూచించారో – ఆ గ్రంథాల పూర్వాపరచరిత్ర తెలిస్తే కాని ఈ సమస్య స్వరూపం, అందుకు పరిష్కారం అర్థం కావు. ఆ తర్వాత పెదపాటి జగన్నాథకవి, గణపవరపు వేంకటకవి *కళావిలాసము* నుంచి ఉదాహరించిన పద్యాలను సమీకరించి, వాటి స్థితగతిచింతన చేయాలి. క్షేమేంద్రుని కలావిలాసంలోని కథాంశాన్ని, కవితాంశాన్ని పరిశీలిస్తే, తెలుగు కవులపై ఆ కృతి ప్రభావం, నన్నెచోడుడు దానిని తెలుగు చేయటంలోని ఔచిత్యం స్పష్టపడతాయి. *కళావిలాసము* నుంచి లభిస్తున్న ఒక్కొక్క పద్యాన్ని జాగ్రత్తగా అనుశీలిస్తే నన్నెచోడుని ఆంధ్రీకరణవిశేషాలు, కావ్యానువాదం జరిగిన కాలాన్ని నిర్ణయించటానికి మరికొన్ని ఆధారాలు దొరుకుతాయి. *కళావిలాసము* కర్త నన్నెచోడుడు గాక బద్దె భూపాలుడని, ఆ బద్దె భూపాలుడికి నన్నిచోడుడు అనే బిరుదున్నదని, అసలు *కళావిలాసము* కావ్యమే కాదని, అదొక కామశాస్త్రమని పరిపరివిధాల విమర్శకులు ఊహించిన విషయాల తథ్యమిథ్యావివేచన అవసరం. గణపవరపు వేంకటకవి ఆంధ్ర ప్రయోగరత్నాకరములో ఉదాహరించిన పద్యాలు కూటసృష్టిపద్యాలని ఉన్న విమర్శకూడా ఆలోచింపదగినదే. ప్రబంధరత్నాకరములో ఉదాహృతుడైన నన్నెచోడుడు,

ప్రయోగరత్నాకరములో ఉదాహృతుడైన నన్నెచోడుడు ఒకరేనా? ఇద్దరు వేర్వేరు వ్యక్తులా? అన్న ప్రశ్న ఒకటున్నది. వస్తుతత్త్వావధారణతో వీటికి సమాధానాలను ప్రతిపాదించటం ఈ వ్యాసరచనోద్దేశం.

తెలుగు కళావిలాసము భౌతికస్వరూపావస్థను నిర్ణయించి, అది క్షేమేంద్రుని ప్రసిద్ధకావ్యానికి అనువాదమే అన్న నిశ్చయానికి వచ్చిన తర్వాత దాని కాలనిర్ణయం చేయబూనటం మేలు. అందుకు ఈ పరిశీలన దోహదం కాగలదన్న ఆకాంక్షతో ఈ విషయజాతం ప్రతిపాదింపబడుతున్నది.

⌖ 2 ⌖

## ‘కళావిలాసము’ కావ్యంలోని పద్యాల ప్రాకరనిరూపణం

నన్నెచోడుని ‘కళావిలాసము’ లభింపకపోయినప్పటికీ, అందులోని పద్యాలు – 1) కవిసంజీవని, 2) రత్నాకరము, 3) అథర్వణచ్ఛందము, 4) గణపవరపు వేంకటకవి లక్షణశిరోమణి అన్న నాలుగు లక్షణగ్రంథాలలో లభించాయని రామకృష్ణకవిగారు చేసిన ప్రమాణీకరణం ఇప్పుడు పరిశీలింపబడుతున్నది.

నిజానికి ‘కవిసంజీవని’ అన్న పేరుతో మనకు ఏ లక్షణగ్రంథమూ ఈనాటి వరకు లభింపలేదు. ఆ పేరుతో ఏ గ్రంథాన్నీ పూర్వకవులు, లాక్షణికులు ఉదాహరింపలేదు. మనకు తెలిసినదల్లా ముద్దరాజు రామన (1580-1650) రచించిన ‘కవిజనసంజీవని’ ఒక్కటే. అందులో నాలుగు తరంగాలు మాత్రమే లభించాయి. ఆ ‘కవిజనసంజీవని’కి ‘కవిసంజీవని’ అన్న పర్యాయనామం లేదు. అది లక్షణగ్రంథమే కాని అందులో చెప్పబడిన లక్షణాలకు ఉదాహరణలుగా పూర్వకవిప్రయోగాలు లేవు. ముద్దరాజు రామన ‘కవిజనసంజీవని’లో తాను చెప్పిన లక్షణాలకు ప్రసంగవశాన తానై ఉదాహృతులను చూపటమే తప్ప ఏ లక్షణానికీ ఏ గ్రంథంలోనుంచీ దేనికీ ఏ సందర్భంలోనూ సిద్ధలక్ష్యాలను చూపలేదు. అందువల్ల నన్నెచోడుని ‘కళావిలాసము’లో నుంచి లక్ష్యభూతమైన ఏ పద్యాన్నీ ముద్దరాజు రామన ‘కవిజనసంజీవని’లో ప్రదర్శించి ఉండటం సంభవం కాదు. ‘కవిజనసంజీవని’కి వావిళ్ళ వారు అచ్చువేసిన మూలప్రతికంటె అదనంగా కొన్ని పద్యాలున్న ప్రతి ఒకటి చాగంటి శేషయ్య గారికి దొరికినట్లు ‘ఆంధ్రకవితరంగిణి’లోని వారి నిర్దేశాన్ని బట్టి తెలుస్తున్నది కాని, అందులోనూ పూర్వకవుల లక్ష్యపద్యాలు ఉన్నట్లు లేవు. ‘కవిసంజీవని’ అంటే రామకృష్ణకవిగారి ఉద్దేశం ముద్దరాజు రామన ‘కవిజనసంజీవని’యే కావచ్చునన్న ఊహకు అవకాశం కల్పిస్తూ రామకృష్ణకవిగారే రెండు మూడు చోట్ల ఆ అర్థం వచ్చే మాటలను వ్రాశారు. 1914 నాటి ‘కుమారసంభవము’ రెండవ భాగము పీఠికలో వారే,

“కుమారసంభవ కలావిలాసముల మొదట నథర్వణుఁ డుదాహరించెను. పెద్దన, రామన, గణపవరపు వేంకటకవియు నీగ్రంథములలోనిపద్యము లుదాహరించిరి.”

- (మానవల్లికవి రచనలు: పుట. 35)

అని వ్రాశారు. ఈ లేఖనాన్ని బట్టి ఇందులో ప్రసక్తుడైన "రామన" - 'కవిజనసంజీవని' కర్త ముద్దరాజు రామన అని, అదే కవిగారు ఉద్దేశించిన 'కవిసంజీవని' అని ఊహించటానికి వికల్పం ఉండకూడదు. అయితే వారే తమ ఇతరవ్యాసాలలో రెండు మూడు చోట్ల అందుకు విరుద్ధంగా –

"కవిసంజీవని యనియు, సర్వలక్షణసారమనియు, బాలబోధ మనియు సందిగ్ధనామములు గల యొకానొక లక్షణగ్రంథమున ..."

అనికూడా వ్రాశారు. దానిని బట్టి 'కవిసంజీవని' అంటే మనకు తెలిసిన ముద్దరాజు రామన 'కవిజనసంజీవని' కాదని; అది వేరొక 'కవిసంజీవని' కావచ్చునని; 'కవిసంజీవని' అనాలో, 'సర్వలక్షణసారము' అనాలో, లేక 'బాలబోధము' అనాలో సందిగ్ధత ఉన్న ఆ వేరొక లక్షణగ్రంథాన్ని రామకృష్ణకవిగారు చూశారని; పైని పేర్కొన్న నన్నెచోడుని 'కళావిలాసము'లోని ఉదాహరణపద్యాలు అందులో ఉండి ఉంటాయని మనము ఊహింపవలసి వస్తున్నది. అసలొక పుస్తకానికి ఇన్ని సందిగ్ధనామాలు ఉండటం కూడా ఒక విచిత్రసన్నివేశమే.

కవిగారు చెప్పిన పేర్లు గల పుస్తకాలకోసం గాలించినప్పుడు తెలిసివచ్చిన వివరాలివి: 'సర్వలక్షణసారము' అన్న పేరుతో తంజావూరు మహారాజా సర్ఫోజీ సరస్వతీమహల్ గ్రంథాలయంలో D. 714 సంఖ్య గల తాళపత్ర ప్రతి ఒకటున్నది. గ్రంథంలో ఎక్కడా కవి పేరు లేదు. గ్రంథనామం లేదు. తాళపత్రాల కట్ట ముఖబంధం మీద మాత్రమే "సర్వలక్షణసారము (రంగయ)" అని ఉన్నది. గ్రంథారంభానికి మునుపు "శుభమస్తు, సర్వలక్షణసారం" అని ఉన్నది. ముఖపత్రంలో "ఛందస్సు – సకలలక్షణసారం సాహిత్యలక్షణం" అని ఉన్నది. దీనిని బట్టి 'సర్వలక్షణసారము' అన్నది ఒకప్పుడు తాళపత్రాల పట్టికను రూపొందించినవారు పెట్టిన సంకేతనామం అనుకోవటానికి కూడా వీలున్నది. రావూరి దొరసామిశర్మ గారు ఇది కస్తూరి రంగకవి కృతమని భావించారు (చూ. 'తెలుగు భాషలో ఛందోరీతులు' – పు.401). ఈ తాళపత్ర ప్రతి తుదను "నన్నెచోడ కుమారసంభవము" అన్న శీర్షిక క్రింద "నెటి గలుగు నాఁడునాటికి" అన్న నన్నెచోడుని 'కుమారసంభవం' అష్టమాశ్వాసంలోని 7-వ పద్యం ఉన్నది. నన్నెచోడుని 'కళావిలాసము'లోని పద్యాలు ఇందులో లేవు.

ఇదిగాక రామకృష్ణకవిగారు చెప్పిన 'సర్వలక్షణసారము' అన్న పేరుతో వేరొక గ్రంథం లేదు. నన్నయ పేరిటిదిగా వెలసిన 'లక్షణసారము' ఒకటున్నది. అది ఆదికవి నన్నయ కృతి కాకపోయినా, 'ఆంధ్రశబ్దచింతామణి'ని రచించిన మరొక (అభినవ) నన్నయ కృతి కావచ్చునని ఒక విశ్వాసం. కస్తూరి రంగకవి 'ఆనందరంగరాట్ఛందము'లో ఇచ్చిన ఉదాహరణలను బట్టి ఆ 'లక్షణసారము' కర్త మహావిద్వాంసుడైన 'ఆంధ్రశబ్దచింతామణి' కర్త కాకపోవచ్చుననిపిస్తుంది. వేరొక నన్నయ కృతి కావచ్చునేమో చెప్పలేము. ఏది ఏమైనా అందులో నన్నెచోడుని 'కళావిలాసము'లోని పద్యాలు లేవు.

ఇంతకు మునుపు రామకృష్ణకవిగారు కుమారసంభవము ద్వితీయముద్రణ పీఠికలో *"కుమారసంభవ కళావిలాసముల మొదట నథర్వణుఁ డుదాహరించెను. పెద్దన, రామన, గణపవరపు వేంకటకవియు నీగ్రంథములలోనిపద్యము*

*లుదాహరించిరి"* అని 'మానవల్లికవి రచనలు' సంపుటంలోని 35-వ పుటలో వ్రాసిన వాక్యాన్ని ఉదాహరించాను. ఆ వాక్యంలోని పెద్దన లాక్షణికాగ్రేసరుడైన చిత్రకవి పెద్దన అనుకొంటే, ఆ పెద్దన కృతి 'లక్షణసారసంగ్రహము' ఉన్నది. దానికీ 'సర్వలక్షణసారము' అన్న నామాంతరం లేదు. ఆ చిత్రకవి పెద్దన కృతిలోనూ లక్ష్యాలుగా ఏ ఇతరకృతులలోని ఉదాహరణలూ లేవు. నన్నెచోడుని 'కళావిలాసము'లోని పద్యాలు లేవు.

ఇంకా - రత్నాకరం గోపాలకవి 'సకల లక్షణసారసంగ్రహము', ఉప్పులూరి వేంకటరెడ్డి 'సకల లక్షణసారసంగ్రహచింతామణి', అడిదము బాలభాస్కరకవి 'లక్షణసారము', కూచిమంచి తిమ్మన 'సకల లక్షణసారసంగ్రహము', ఓరుగంటి రామకవి 'కవితాలక్షణసారము', పాపినేని వేంకటసామి నాయని 'ఛందశ్శాస్త్రలక్షణసారసంగ్రహము', దంతిని అప్పకవి 'లక్షణసారసంగ్రహము', అడ్డనూరి రామదాసు 'సకల లక్షణసారము' మొదలైన లక్షణకృతులలో నన్నెచోడుని 'కళావిలాసము'లోని పద్యాలు లేవు.

కాగా, కవిగారు పేర్కొన్న 'బాలబోధచ్ఛందస్సు' అన్న పేరుతో తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ ప్రాచ్య పరిశోధనసంస్థలో R. 1212 గల ప్రతి ఒకటున్నది. రామకృష్ణకవిగారు తమ వ్యాసాలలో పెక్కు సందర్భాలలో ఉదాహరించిన పూర్వకవుల గ్రంథాలలోని పద్యాలలో కొన్ని కేవలం ఆ ఒక్కదానిలో మాత్రమే ఉన్నాయి. వారిచ్చిన ఆ పద్యాలు అందులో తప్ప వేరెక్కడా లేవు. అందువల్ల వారంటున్న 'బాలబోధచ్ఛందస్సు' తిరుపతిలో మనకిప్పుడు ఉపలభ్యంగా ఉన్న 'బాలబోధచ్ఛందస్సు' ప్రతే అన్నమాట స్పష్టం. అది తెనాలి రామకృష్ణకవి అల్లుడు లింగమగుంట తిమ్మన కృతి అని కౌలూరి ఆంజనేయకవి 'సుకవికర్ణామృతము'లో చెప్పాడు. 'సుకవికర్ణామృతము' క్రీస్తుశకం 1600 నాటి సంధానం అయితే, 'బాలబోధచ్ఛందస్సు' దానికి మునుపు, అంటే, 16-వ శతాబ్ది ఉత్తరార్ధంలో వెలసి ఉండాలి. అందులో నన్నెచోడుని 'కళావిలాసము'లోని పద్యాలు లేవు.

1923లో మడికి సింగన 'సకలనీతిసమ్మతము'ను ప్రకటించినప్పుడు రామకృష్ణకవిగారు పీఠికలో -

"బాలబోధమనియు గవిసంజీవని యనియు సందిగ్ధనామములు గల యొక్క ఛందోగ్రంథమున ముద్రామాత్య నీతిభూషణ పురుషార్థసారముల నుండి పద్యము లుదాహృతము లయ్యె"

- (మానవల్లికవి రచనలు: పు.104)

అని అక్కడ మరొకవిధంగా వ్రాశారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ ప్రాచ్య పరిశోధనసంస్థలో ఉన్న 'బాలబోధచ్ఛందస్సు'కు 'కవిసంజీవని' అన్న నామాంతరం లేదు. ఆ ప్రతిలో వారు పేర్కొన్న ఎన్నో అపూర్వమైన కావ్యాలలోని పద్యాలున్నాయి కాని, ముద్రామాత్య నీతిభూషణ పురుషార్థసారాలలోని పద్యాలు మాత్రం లేవు. ఆ ముద్రామాత్యాది పద్యోదాహరణలు కలిగిన ప్రతి వేరొకటి ఆంధ్రవిశ్వకళాపరిషత్తు వారి గ్రంథాలయంలో D. 705 (M. 326) సంఖ్యతో 'ఛందోగ్రంథము' అన్న పేరిట ఉన్నది. రామకృష్ణకవిగారు 'ముద్రామాత్యము' లోనిది అని ఉదాహరించిన పద్యమే అందులో 'ముద్రారాక్షసము' లోనిదిగా ఉదాహృతమై ఉన్నది. అందులో తప్ప ఆ పద్యం మరెక్కడా లేదు. 'ముద్రారాక్షసము', 'ముద్రామాత్యము' అన్న పేర్లలో అంతగా వ్యత్యాసమేమీ లేదు కాబట్టి, పాఠభేదం లేని ఆ

పద్యోదాహరణను బట్టి, ‘ఛందోగ్రంథము’లో ‘ముద్రారాక్షసము’ అని ఉదాహృతమైన శీర్షికనే రామకృష్ణకవిగారు ‘ముద్రామాత్యము’ అని పేర్కొన్నారని ఊహింపవచ్చును. అయితే, ఆ ‘ఛందోగ్రంథము’ అన్న పుస్తకానికి ‘బాలబోధచ్ఛందస్సు’ అన్న పేరు లేదు. దానికి ‘సర్వలక్షణసారము’ అన్న నామాంతరం లేదు. పోనీ, దానినే రామకృష్ణకవిగారు ‘బాలబోధచ్ఛందస్సు’ అని వ్యవహరించారనుకొంటే, అందులోనూ నన్నెచోడుని ‘కళావిలాసము’ నుంచి పద్యాలు లేవు.

మొత్తానికి ‘కవిసంజీవని’, ‘సర్వలక్షణసారము’, ‘బాలబోధచ్ఛందస్సు’ ఒకటైనా కాకపోయినా, నన్నెచోడుని ‘కళావిలాసము’లోని పద్యాలున్న ప్రతి మాత్రం ఇంతవరకు వెల్లడికాలేదన్నమాట.

మరొక విచిత్రసన్నివేశాన్ని కూడా గుర్తుంచుకోవాలి. ‘కుమారసంభవము’ ద్వితీయభాగం తుదను రామకృష్ణకవిగారు తమ లఘుటీకలో ఉదాహరింపబడిన లక్షణగ్రంథాల పట్టికను పేర్కొన్నారు. ఆ పేర్లివి:

“అథర్వణచ్ఛందము, కవివాగ్బంధనము, కవిలోకసంజీవని, లక్షణసారసంగ్రహము (పెద్దన), లక్షణశిరోమణి (వేంకటకవి), అప్పకవీయము, కవిజనాశ్రయము (గోకర్ణుఁడు) మొదలగునవి.”

- (మానవల్లికవి రచనలు: పుట. 64)

ఇందులో ‘కవిసంజీవని’ లేదు. ఆ స్థానంలోకి సరికొత్తగా ‘కవిలోకసంజీవని’ వచ్చి చేరింది. దీనిని గురించి కవిగారు వ్రాయలేదు. మనకిప్పుడు వివరాలు తెలియవు. వెల్లంకి తాతంభట్టు ‘కవిచింతామణి’ని రామకృష్ణకవిగారు కొన్నిచోట్ల ‘కవిలోకచింతామణి’ అని వ్యవహరించారు. అయితే ఆ ‘కవిలోకచింతామణి’లోనూ ‘కళావిలాసము’లోని పద్యాలు లేవు. ‘కవిలోకసంజీవని’ అన్నది ‘కవిసంజీవని’కి మారుగానో ‘కవిజనసంజీవని’కి మారుగానో పొరపాటున ఉదాహరించినదై ఉంటుంది. పై గ్రంథనామాలు ‘కళావిలాసము’ విమర్శ సందర్భంలో ఉదాహరించినవి కాకపోయినా, ఆ ‘కవివాగ్బంధనము’, ‘అప్పకవీయము’, ‘కవిజనాశ్రయము’ గ్రంథాలలో కూడా ‘కళావిలాసము’ లోని పద్యాలు లేవు.

పైని వాక్యంలో ‘కవిజనాశ్రయము (గోకర్ణుఁడు)’ అన్నది ముద్రణదోషమై ఉంటుంది. ‘కవిజనాశ్రయము’, ‘గోకర్ణచ్ఛందస్సు’ అన్నవి రెండూ వేర్వేరు లక్షణగ్రంథాలు. ‘కవిజనాశ్రయము’లో నన్నెచోడుని ‘కళావిలాసము’లోని పద్యాలు లేవు. ‘గోకర్ణచ్ఛందస్సు’లోనూ ఇప్పటి వరకు లభించిన పద్యాలలో నన్నెచోడుని ‘కళావిలాసము’ లోని పద్యాలు లేవు.

నన్నెచోడుని పద్యాలకు రామకృష్ణకవి గారు ప్రమాణీకరించిన రెండవ పుస్తకం ‘రత్నాకరము’ అన్నది. ఆ పేరుతో కావ్యచ్ఛందోవ్యాకరణాది లక్షణగ్రంథమేదీ తెలుగులో లేదు. ‘రత్నాకరము’ అన్న నామాంశం కలిగినవి గణపవరపు వేంకటకవి ‘ఆంధ్ర ప్రయోగరత్నాకరము’ ఒకటి, వెల్లటూరి లింగన ‘సరసాంధ్రవృత్తరత్నాకరము’ ఒకటి – ప్రసిద్ధమైనవి రెండు ఉన్నాయి. గణపవరపు వేంకటకవి ‘ఆంధ్ర ప్రయోగరత్నాకరము’ అంటే - పైని రామకృష్ణకవి గారు చెప్పిన ‘సర్వలక్షణశిరోమణి’లోని ఒక భాగమే కాని, అదొక స్వతంత్రకృతి కాదు. ఆ ‘ఆంధ్ర ప్రయోగరత్నాకరము’లోని పద్యాల

విషయాన్ని తర్వాత వివరిస్తాను. వెల్లటూరి లింగన కృతి వృత్తయతిప్రాసల లక్షణసంగ్రహం. అందులో నన్నెచోడుని 'కళావిలాసము' నుంచి ఉదాహరణలు లేవు.

గొప్ప పండితుడు, చిత్రబంధకవి అయిన త్యాగరాజ మొదలి రచించిన 'ఛందోరత్నాకరము' ఉన్నది కాని, 19-వ శతాబ్ది తుదికాలంలో వెలసిన ఆ రచన ఇక్కడ చర్చనీయం కాదు. ఆ మాటకు వస్తే అందులోనూ నన్నెచోడుని 'కళావిలాసము' నుంచి ఉదాహరణలు లేవు.

అందువల్ల రామకృష్ణకవి గారి దృష్టిలో 'రత్నాకరము' అంటే, తంజావూరు మహారాజా సర్ఫోజీ సరస్వతీమహల్ గ్రంథాలయంలో ఉన్న పెదపాటి జగన్నాథకవి 'ప్రబంధరత్నాకరము' అనే అనుకోవాలి. అది మూడాశ్వాసాల గొప్ప సంధానగ్రంథం. అందులో 'కళావిలాసము' నుంచి పద్యాలున్నాయి. ఆ పద్యాలకు జగన్నాథకవి "నన్నెచోడుఁడు - కళావిలాసము" అని కవి పేరును ముందుంచి పేర్కొనవలసినదే కాని, ఎందుకనో 'కళావిలాసము' అని ఇచ్చి ఊరుకొన్నాడు. "నన్నెచోడుఁడు - కళావిలాసము" అని కవి పేరును పేర్కొనలేదు. అయినా, ఆయన ఇచ్చిన 'కళావిలాసము'లోని పద్యాలను నన్నెచోడుని పద్యాలుగానే రామకృష్ణకవిగారు పరిగ్రహించారు. పెదపాటి జగన్నాథకవి అని సంధాత పేరును గాని, పెదపాటి జగన్నాథకవి సంధానించిన 'ప్రబంధరత్నాకరము' అన్న పేరును గాని ఆయన ఎందుకో పేర్కొనలేదు. నిజానికి కుమారసంభవ పీఠికలోనూ, ఇతరానేకవ్యాసాలలోనూ వారు ఉదాహరించిన కనీ వినీ ఎరుగని అపూర్వమైన కావ్యాలలోని ఎన్నెన్నో పద్యాలు పెదపాటి జగన్నాథకవి 'ప్రబంధరత్నాకరము'లో ఉన్నప్పటికీ అవి 'ప్రబంధరత్నాకరము' లోనివేనని వారెన్నడూ చెప్పలేదు. ఇప్పటికీ రామకృష్ణకవిగారు ఉదాహరించిన ఆ పద్యాలలో అనేకం పెదపాటి జగన్నాథకవి 'ప్రబంధరత్నాకరము'లో తప్ప మరెక్కడా కనబడవు. అందువల్ల కవిగారి దృష్టిలో 'రత్నాకరము' అంటే, వారు చెప్పకపోయినా - 'కళావిలాసము' పద్యాలున్నాయి కనుక పెదపాటి జగన్నాథకవి సంధానించిన 'ప్రబంధరత్నాకరము' అని నిర్ధారింపవచ్చు. అందులోని ఉదాహరణలను అధికరించి తర్వాతి అధ్యాయాలలో మళ్ళీ విపులంగా వ్రాస్తాను.

ఇక, రామకృష్ణకవిగారు పైని పేర్కొన్న 'అథర్వణచ్ఛందము' మరీ జటిలమైన సమస్య. దానిపై వచ్చిన తర్జనభర్జనలను, వాటి ఔగాములను నేనిక్కడ సమీక్షించటం లేదు. పార్యంతికసారసంగ్రహం మాత్రం ఇది: అథర్వణుడు నన్నెచోడుని 'కళావిలాసము' నుంచి పద్యాలను అందులో ఉదాహరించినట్లు ఆధారాలు లేవు. మానవల్లి రామకృష్ణకవిగారు తమ సంచయంలో ఉన్నదని పలుమార్లు చెప్పిన ఆ ఆథర్వణీయాన్ని ఎవరూ చూచి యెరుగరు. 'అథర్వణ భారతము' లోనివని వివిధసందర్భాలలో వారిచ్చిన పద్యోదాహరణలలో ఏ పద్యాన్ని ఏ పుస్తకంలోనుంచి తీసుకొన్నదీ వారు చెప్పకపోయినా, అవి చాలా వరకు నలుగురికీ తెలిసిన పుస్తకాలలోనివే. వాటిలో ఒకానొక పద్యాన్ని గురించిన విమర్శను మీకెప్పుడయినా వీలయితే http://www.siliconandhra.org/nextgen/sujanaranjani/feb12/vanmayacharitralo.html చూడండి. 'అథర్వణచ్ఛందము'లో నుంచి కుమారసంభవ కర్త నన్నెచోడుని ప్రసక్తి కలిగినదని వారిచ్చిన పద్యం ఉదాహరణ ఈనాటికీ వివాదాస్పదంగానే ఉన్నది. పుస్తకస్థంగా దానిని చూచినవారు ఒక్కరూ లేరు. ఆ 'అథర్వణచ్ఛందము'

మాటెలా ఉన్నా అందులో 'కళావిలాసము'లోని పద్యాలలో దేనిని అథర్వణుడు ఎక్కడ ఏయే సందర్భాలలో ప్రస్తావించాడో రామకృష్ణకవిగారు చెప్పలేదు.

ఇక, గణపవరపు వేంకటకవి 'సర్వలక్షణశిరోమణి' విషయం మిగిలింది. తంజావూరు మహారాజా సర్ఫోజీ సరస్వతీమహల్ గ్రంథాలయంలో దీనిలోని భాగమైన 'ఆంధ్ర ప్రయోగరత్నాకరము' వ్రాతప్రతులు రెండు D. 695-696 వరుస సంఖ్యలతో ఉన్నాయి. ఇది సాహిత్యచరిత్రకారులు, పరిశోధకులు ఊహించినట్లు ఒక ప్రత్యేకగ్రంథం కాదు. గణపవరపు వేంకటకవి రచించిన 'సర్వలక్షణశిరోమణి' అన్న పేరు గల ఒక బృహల్లక్షణగ్రంథంలోని ఆరవ ఉల్లాసం. ఆ అభిజ్ఞాతవిశేషాలను నేను 'గణపవరపు వేంకటకవి ప్రబంధరాజ వేంకటేశ్వర విజయవిలాసము: సాహిత్య లక్షణ చిత్రకవిత్వానుశీలనము' అన్న నా సిద్ధాంతగ్రంథంలో వివరించాను. 'ఆంధ్ర ప్రయోగరత్నాకరము' ప్రతులు రెండు మునుపు కాకినాడలోని ఆంధ్రసాహిత్యపరిషత్తు వారి గ్రంథాలయ (నేటి ఆంధ్రసాహిత్యపరిషత్తు ప్రభుత్వ పురావస్తుసంగ్రహాలయం, పరిశోధన సంస్థ) సంచయంలో ఉండేవి. 1960 దశకంలో అదృశ్యమైపోయాయట. ఇప్పుడు లేవు. తంజావూరులో ఉన్న వ్రాతప్రతులకు మైక్రోఫిల్ములు హైదరాబాదులోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రాచ్య పరిశోధన సంస్థ వారి లిఖితపుస్తక భాండాగారంలో ఉన్నాయి. వాటి స్థితి అంత సముచితంగా లేదు. ఆంధ్రవిశ్వకళాపరిషత్తు వారి గ్రంథాలయంలో తంజావూరులోని ప్రతులకే కాగితపు ప్రత్యంతరాలు మంచి స్థితిలో ఉన్నాయి. తంజావూరులో ఉన్న 'ఆంధ్ర ప్రయోగరత్నాకరము' మంచి స్థితిలో ఉంది.

తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ ప్రాచ్య పరిశోధనసంస్థలో D7284 సంఖ్య గల 'ఆంధ్ర ప్రయోగరత్నాకరము' కాగితం ప్రతి ఒకటున్నది. ఇది తంజావూరు ప్రతికంటె కొంత భిన్నమైనది కాని, చాలా విలువైన ప్రతి. ఇందులోనూ 'కళావిలాసము' నుంచి – తంజావూరులోని 'ఆంధ్ర ప్రయోగరత్నాకరము' ప్రతిలో ఉన్నవే – ఆ రెండు పద్యాలే ఉన్నాయి.

మొత్తంమీద రామకృష్ణకవిగారు చెప్పిన 1) కవిసంజీవని, 2) రత్నాకరము, 3) అథర్వణచ్ఛందము, 4) గణపవరపు వేంకటకవి లక్షణశిరోమణి అన్న నాలుగు గ్రంథాలలో పెదపాటి జగన్నాథకవి 'ప్రబంధరత్నాకరము' లోనూ, గణపవరపు వేంకటకవి రచించిన 'సర్వలక్షణశిరోమణి'లోని ఉల్లాసమైన 'ఆంధ్ర ప్రయోగరత్నాకరము'లోనూ మాత్రమే 'నన్నెచోడ కళావిలాసము'లో నుంచి పద్యాలు ఉన్నాయన్నమాట. ఈ పట్టికనుంచి అలభ్యాలైన 'కవిసంజీవని', 'అథర్వణచ్ఛందము' అన్న రెండు పేర్లను తొలగిస్తే 'కళావిలాసము' కావ్యం క్రీస్తుశకం 10-వ శతాబ్ది నాటిది కావచ్చునన్న పౌర్వికతకు ముప్పు వాటిల్లితుందన్నమాట.

⌖ 3 ⌖

## 'కళావిలాసము': ఉపలబ్ధ పద్యావళి

గణపవరపు వేంకటకవి తన 'ఆంధ్ర ప్రయోగరత్నాకరము'లో ఉదాహరించిన పద్యాలివి:

**“వ. ఇందుకే నన్నెచోడ కళావిలాసం –**

**క. పాథోనిధిగాంభీర్యుస్, రాధాకాముకపదాబ్జరాజత్సేవా**

**మేధాధుర్యతపోరా, గాధేయుని మునివతంసగాధేయు వనిస్.**

*(తంజావూరు మహారాజా సర్ఫోజీ సరస్వతీమహల్ గ్రంథాలయంలో D. 695 సంఖ్య గల తాళపత్ర ప్రతి: (18-b) పద్దెనిమిదవ ఆకు వెనుక వైపున)*

**“వ. ఇందుకే నన్నెచోడ కళావిలాసం –**

**క. నగజాత నారదు నుడి వి, నఁగలే కాగ్రహముఁ జెందినఁ గని హరుఁడు లే**

**నగవు సెలవి నిగుడఁగఁ ది, న్నగఁ బలికెస్ సతికి మునికి నాయము దోఁపస్.**

*(అదే ప్రతి: (24-b) ఇర్వైనాలుగవ ఆకు వెనుకవైపున)*

వీటిలో మొదటి పద్యాన్ని వేంకటకవి ప్రాస ప్రకరణంలో ‘థ’ – ‘ధ’ ల వర్గప్రాసకు ఉదాహరణగా పేర్కొన్నాడు. రెండవదానిని అర్థబిందు ప్రాసకు ఉదాహరణగా పేర్కొన్నాడు.

పెదపాటి జగన్నాథకవి సంధానించిన ‘ప్రబంధరత్నాకరము’లో ‘కళావిలాసము’ నుంచి ఉదాహరించిన పద్యాలివి.

**౧) (మదనస్తుతి –) కళావిలాసము**

**సీ. పృథుల విశ్వంభరారథమున కెదురుగాఁ బూన్పించె నెవ్వాఁడు పువ్వుఁదేరుఁ**

**గాంచనాచలకార్ముకమునకు సాటిగాఁ జేపట్టె నెవ్వండు చెఱకువిల్లు**

**నవిహతపాశుపతాస్త్రమ్మునకు వాఁడి మిగిలించె నెవ్వాఁడు చిగురుఁదూపు**

**నతులితామరదానవాది(?)బలంబుల గెలిపించె నెవ్వఁ డ య్యళి(?)బలంబు(?)**

**నట్టి జగజెట్టి మన్మథుం డఖిలలోక**

**ములకు వెఱగొంగ, జీవుల మూలకంద**

**మతని యిలునొచ్చి వెడలనియతఁడు గలఁడె?**

**యతని యమ్ములఁ బడకున్న యతఁడు గలఁడె.**

*(తంజావూరు మహారాజా సర్ఫోజీ సరస్వతీమహల్ గ్రంథాలయంలో D. 189 సంఖ్య కలిగిన తాళపత్రప్రతి: (108/b) నూటఎనిమిదవ ఆకు వెనుకవైపున)*

**౨) (తాంబూలానకు –) కళావిలాసము**

**క. తలపోయఁగ రుచు లాఱును, గలుగును; వాతంబుఁ గ్రిమియుఁ గఫముం జెడు; నాఁ**

కలివుట్టు; దగయుఁ జెడుఁ ద, మ్ముల‌ము పదార్థంబు రాగమూలము ధరణిన్.*(142/b)*

## ౩) (విటలక్షణము –) కళావిలాసము

క. శ్రీమంతుఁడు గుణవంతుఁడు, ధీమంతుఁడు రూపయుతుఁడు ధీరుండుఁ గళా

ధాముండును గావలయును, దా మహిఁ గాముండు కామతంత్రవివేకీ.*(142/b)*

## ४) (భద్ర దత్త కూచిమార పాంచాలులు -) కళావిలాసము

చ. ... ... ... ... ... ... ...

... ... ... ... ... ... ...

... ... ... ..ట్టి యతం డరుదేరఁ గాంచియుం

దడవకయుండ నెప్పటి విధంబని కౌఁగిటఁ జేర్చ నంతటన్.*(144/b)*

చ. తొడవులు పెట్టు, సంభ్రమముతోఁ దిలకించు, మడుంగు గట్టు, పైఁ

బడఁ దడవోప, దిం పెఱిఁగి పట్టుడు నేర్పులు గట్టిపెట్టుఁ, బ

ల్కెడునెడఁ దొట్రుపా టొదవుఁ, గింకకు జేగుఱు మై జెమర్పఁగాఁ

జిడిముడిఁ బొందుఁ గాంత పతి చేరినఁ గూరిమి గల్గెనేనియున్.*(145a/b)*

## ౫) (భద్ర దత్త కూచిమార పాంచాలులు -)

చ. లలనలు గొందఱాత్మవరులం దమకూడిన చెయ్వులన్నియున్

దలఁచి సఖీజనంబులకుఁ దప్పక చెప్పెడువారు పుణ్యజీ

వులు చెలియా మదీశుని కవుంగిలి డాయుడు నాకు వల్పురే

ల్దొలఁగు టెఱుంగఁబోలు నటఁ దీఁపవు మీఁద రతిప్రయోగముల్.*(145b)*

'ప్రబంధరత్నాకరము'లో 'కళావిలాసము' నుంచి ఐదారు పద్యాలను స్వీకరించినా, జగన్నాథకవి 'నన్నెచోడుని కళావిలాసము" అని శీర్షికాకృతంగా కవి పేరును జోడించి చెప్పలేదు. అయితే గణపవరపు వేంకటకవి 'ఆంధ్ర ప్రయోగరత్నాకరము'లో "నన్నెచోడ కళావిలాసం" అని ఉన్నందువల్ల ఆ రెండూ భిన్నకావ్యాలు కావని; 'ప్రబంధరత్నాకరము'లోని 'కళావిలాసము', 'ఆంధ్ర ప్రయోగరత్నాకరము'లోని 'కళావిలాసము' ఏకకర్తృకాలని రామకృష్ణకవిగారు భావించి, 'కుమారసంభవము' పీఠికలో ఉదాహరించటం జరిగిందన్నమాట.

1918లో వేటూరి ప్రభాకరశాస్త్రి గారు 'ప్రబంధరత్నావళి'ని రూపొందించినప్పుడు అందులో నన్నిచోడని 'కళావిలాసము' లోనివిగా 1) "తలపోయఁగ రుచు లాఱును", 2) "తొడవులు పెట్టి సంభ్రమముతో", 3) "పృథుల విశ్వంభరారథమున

కెదురుగా", 4) "శ్రీమంతుఁడు గుణవంతుఁడు" అన్న నాలుగింటిని మాత్రమే స్వీకరించారు. రామకృష్ణకవిగారు చూపిన "లలనలు కొందఱాత్మపతులన్" అన్న పద్యాన్ని గ్రహింపలేదు.

జగన్నాథకవి ఉదాహరించిన 'కళావిలాసము' లోనిదిగా ఉదాహరించిన "శ్రీమంతుఁడు గుణవంతుఁడు" అన్న పద్యాన్ని రామకృష్ణకవిగారు ఎందుకో గ్రహింపలేదు. గణపవరపు వేంకటకవి 'సర్వలక్షణశిరోమణి'లో 'కళావిలాసము'ను ఉదాహరించాడని చెప్పినప్పటికీ, అందులోని ఆ పద్యాలను ఆయన ఉదాహరింపలేదు.

పైని రామకృష్ణకవిగారు ఉదాహరించిన "లలనలు గొందఱాత్మవరులం దమకూడిన" అన్న పద్యం జగన్నాథకవి 'ప్రబంధరత్నాకరము'లో ఉన్నది కాని, అక్కడి శీర్షికలో 'కళావిలాసము' అన్న కృతినిర్దేశిక లేదు. దానికి పైనున్న "తొడవులు పెట్టు, సంభ్రమముతోఁ దిలకించు" అన్న పద్యానికి మాత్రమే 'కళావిలాసము' అన్న నిర్దేశం ఉన్నది. దానికి తర్వాత ఏ నిర్దేశమూ లేకుండా ఉన్న "లలనలు గొందఱాత్మవరులం దమకూడిన" అన్న పద్యాన్ని ఆయన 'కళావిలాసము' లోనిదిగా ఉదాహరించారు.

రామకృష్ణకవిగారు చూపిన పాఠం ఇది:

**చ. లలనలు కొందఱాత్మపతులం దగఁగూడినచెయ్వులన్నియుం**
**దలఁచి సఖీజనంబులకుఁ దప్పకచెప్పెడు వారు పుణ్యజీ**
**వులు చెలి యామినీశుని కవుంగిలి డాయుటె కాక తాల్మికీ**
**ల్దొలఁగిన తీరుగీరు నటదోపవు నాకు రతిప్రయోగముల్.**

'ప్రబంధరత్నాకరము' వ్రాతప్రతిలో ఉన్న ఆ పద్యపాఠం ఇది:

**చ. లలనలు గొందఱాత్మవరులం దమకూడిన చెయ్వులన్నియున్**
**దలఁచి సఖీజనంబులకుఁ దప్పక చెప్పెడువారు పుణ్యజీ**
**వులు చెలియా మదీశుని కవుంగిలి డాయుడు నాకు వల్పురే**
**ల్దొలఁగు టెఱుంగఁబోలు నటఁ దోఁపవు మీఁద రతిప్రయోగముల్.**

చిత్రమేమంటే, ఆంధ్రవిశ్వకళాపరిషత్తు వారి గ్రంథాలయంలో D. 705 (M. 326) సంఖ్యతో 'ఛందోగ్రంథము' అన్న పేరిట ఉన్న వ్రాతప్రతిలో ఇది 'కళావిలాసము' లోనిదిగా కాక, భాస్కర ప్రెగ్గడ రచించిన 'రసాలంకారము' లోనిదిగా ఉదాహరింపబడింది. అక్కడి పాఠం ఇది:

**చ. లలనలు గొందఱాత్మవరులం దమకూడిన చెయ్వులన్నియున్**
**దలఁచి సఖీజనంబులకుఁ దప్పక చెప్పెడువారు పుణ్యజీ**
**వులు చెలి యామినీశుని కవుంగిలి డాయుడు నాకు వల్పురే**

**ల్డొలఁగు టెఱుంగఁబోలు నటఁ దోఁపవు మీఁద రతిప్రయోగముల్.**

1989లో ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తి గారు ప్రకటించిన 'ప్రబంధరత్నాకరము' ప్రత్యంతరంలో ఇదే పద్యం భాస్కరుని 'శృంగార రత్నాకరము' లోనిదిగా ఉదాహృతమై ఉన్నది. అక్కడి పాఠం ఇది:

**చ. లలనలు గొంద ఱాత్మవరులస్ దమకూడిన చెయ్వు లన్నియుస్**
**దలఁచి సఖీజనంబులకుఁ దప్పక చెప్పెడువారు పుణ్యజీ**
**వులు చెలియా మదీశుని కవుంగిలి డాయుడు నాకు వల్పురే**
**ల్డొలఁగు టెఱుంగఁబోలు నటఁ దోఁపవు మీఁద రతిప్రయోగముల్.**

పెదపాటి జగన్నాథకవి 'ప్రబంధరత్నాకరము'లో 'కళావిలాసము' లోనిదిగా ఉదాహరించిన

**క. శ్రీమంతుఁడు గుణవంతుఁడు, ధీమంతుఁడు రూపయుతుఁడు ధీరుండుఁ గళా**
**ధాముండును గావలయును, దా మహిఁ గాముండు కామతంత్రవివేకీ.**

అన్న పద్యమే శ్రీరామమూర్తి గారు ప్రకటించిన 'ప్రబంధరత్నాకరము' ప్రత్యంతరంలో ఈ విధంగా ఉన్నది:

**క. శ్రీమంతుఁడు గుణవంతుఁడు, ధీమంతుఁడు రూపయుతుఁడు ధీరుండుఁ గళా**
**ధాముండును గావలయును, దా మహిఁ గాముకుఁడు కామతంత్రవివేకీ.(పద్యసంఖ్య. 1)**

ఇదిగాక శ్రీరామమూర్తిగారి ప్రత్యంతరంలో "విటలక్షణము – కళావిలాసము" అన్న శీర్షికతో మరి మూడు పద్యాలు, "విటశృంగారము" అన్న శీర్షికతో రెండు పద్యాలు, "కుటిలవేశ్య లక్షణము" అన్న శీర్షికతో ఒక పద్యం, "వేశ్యమాత" అన్న శీర్షికతో ఒక పద్యం, "భద్ర దత్త కూచిమార పాంచాలురు" అన్న శీర్షికతో ఒక పద్యం, "చిత్తిని", "హస్తిని", శంఖిని", "పద్మిని" అన్న శీర్షికలతో ఒక్కొక్కటి వంతున మొత్తం నాలుగు పద్యాలు, "బాలకు", "యౌవనకు", "ప్రౌఢకు" అన్న శీర్షికలతో రెండేసి వంతున మొత్తం ఆరు పద్యాలు, "లోలకు" అన్న శీర్షిక క్రింద ఒక పద్యం 'కళావిలాసము' నుంచి ఉన్నాయి. ఇవి మొత్తం ఇరవై పద్యాలు. చివరిగా "కూర్మి" అన్న శీర్షికతో ఇందాక ఉదాహరించిన "తొడవులు పెట్టు, సంభ్రమముతోఁ దిలకించు" అన్న పద్యం ప్రత్యంతరంలో ఈ క్రింది రూపంలో ఉన్నది:

**చ. తొడవులు పెట్టి సంభ్రమముతోఁ దిలకించు, మడుంగు గట్టుఁ బైఁ**
**బడఁ దడ వోర్చుఁ దెం పెఱిఁగి పట్టదు నేర్పులు గట్టిపెట్టుఁ బ**
**ల్కెడునెడఁ దొట్రుపా టొదవుఁ, గింకకు బెగ్గిల మై చెమర్పఁగాఁ**
**జిడుముడిఁ బొందుఁ గాంత పతిఁ చేరిన కూరిమి గల్గెనేనియుస్.**

ఈ ప్రకారం లెక్కవేస్తే - గణపవరపు వేంకటకవి 'ఆంధ్ర ప్రయోగరత్నాకరము'లో "నన్నెచోడ కళావిలాసము' నుంచి ఉదాహరించినవి రెండు, పెదపాటి జగన్నాథకవి 'ప్రబంధరత్నాకరము'లో 'కళావిలాసము' అన్న శీర్షికతో ఉదాహరించినవి నాలుగు, 'ప్రబంధరత్నాకరము'లోనే రామకృష్ణకవిగారు 'కళావిలాసము' లోనిదిగా ఊహించినదొకటి, 'ప్రబంధరత్నాకరము ప్రత్యంతరము' లోనివి పందొమ్మిది – మొత్తం 'కళావిలాసము' నుంచి మనకు లభించినవి ఇరవైఆరు పద్యాలన్న మాట.

❖ 3 ❖

## గతానుగతికోక్తులు

కర్తృత్వకాలాదుల విశదిమకు అతీతుడైన కవిసంజీవనికారుడు, అసలు ఉనికే భద్రంగా లేని అథర్వణుడు నన్నెచోడుని కుమారసంభవ - కళావిలాస కావ్యపద్యాలను లక్ష్యీకరించారని రామకృష్ణకవిగారు నిర్విచికిత్సంగా చెప్పిన విషయం ఇప్పుడు అధికరింపబడుతున్నది.

చరిత్రకాథికులు నన్నయాథర్వణులిద్దరూ సమసామయికులని భావించిన రోజులవి. 1895లో కవిగారే 'ఆంధ్రభాషను గూర్చిన యుపన్యాసము' అన్న వ్యాసంలో –

"నన్నయభట్టు మహాభారతముఁ దెనిఁగింపఁ బ్రారంభించినప్పుడే యథర్వణాచార్యులును దెనింగింపఁ దొడంగియుండును. వాగనుశాసనుఁ డారణ్యపర్వమున విడువఁగా నథర్వణాచార్యుఁడు కర్ణపర్వమున వదలెను. కాలముసెల్లఁగాఁ దిక్కనసోమయాజి దానును భారతము మొదటినుండి వ్రాయుటకంటె వీరిద్దరి పొత్తములలో నేదానినైన పూర్తిచేయుటయ భావ్యమని యూహించి రేఫఱకారసంకరమును లక్షణదోషములును లేని నన్నయ భట్టారకుని భారతమే పరిసమాప్తి నొందించుటకుఁ దలఁచెనని తోఁచుచున్నది."

- (మానవల్లికవి రచనలు: పు.456)

అని ఆనాటి తమ ఊహను ప్రకటించారు. నన్నయకు సమకాలికుడైన అథర్వణుడు రచించిన ఛందస్సులో 'కళావిలాసము'లోని పద్యాలున్నాయన్న ప్రతిపాదన వల్ల నన్నెచోడుడు క్రీస్తుశకం 11-వ శతాబ్ది కంటె మునుపటివాడని సాధించటం జరుగుతుంది. కాని, సంస్కృతమహాకవులలో అగ్రేసరభాసమానుడైన క్షేమేంద్రుని 'కలావిలాసం' ఆంధ్ర కళావిలాసానికి మూలమే గనుక అయితే, క్రీ.శ. 1029 – '64ల మధ్య కాశ్మీరాన్ని పరిపాలించిన అనంత నరేంద్రుని ఆస్థానంలో ఉన్న ఆ మహాకవికంటె నన్నెచోడుడు కనీసం ఒక శతాబ్దికి తర్వాతివాడు కాకతప్పదు. ఈ వైషమ్యాన్ని గుర్తెరిగినందువల్లనే రామకృష్ణకవిగారు రెండు కావ్యాలను సరిపోల్చి, వాటికి వస్తుసామ్యం లేదని నిర్ధారించుకోవలసి వచ్చింది. నన్నెచోడుడు నిజంగా క్షేమేంద్రానువాదకుడే అయితే, ఆయన నన్నయ్యగారికి పూర్వతరుడన్న వినిర్ణయానికి ఆ రోజుల్లోనే మూలచ్ఛేదం కలిగేది.

ఇంతకీ సంస్కృత 'కలావిలాసం' కథాకావ్యం అవునా? కాదా? అంటే, క్షేమేంద్రుడే స్వయంగా అన్న మాటలివి -

**కేలీమయః స్మితవిలాసకలాభిరామః, సర్వాశ్రయాన్తర కలా ప్రకటప్రదీపః**
**లోకోపదేశవిషయః సుకథావిచిత్రో, భూయాత్ సతాం దయితఏష కలావిలాసః.(10-42)**

(నానావిధాల మనోజ్ఞకేళీకలాపాలను ఏకరువుపెట్టేది, విలాసజీవనులు ఏ విధంగా సౌఖ్యానుభవాన్ని పొందుతున్నారో వివరించేది, ఎల్లవారు ఆశ్రయింపదగిన రసిక కళలను వెలుగులోకి తెచ్చేది, లోకానికి విధినిషేధపూర్వకంగా మంచిచెడ్డలను బోధించేది, యోగ్యులు వ్యవహరింపవలసిన తీరుతెన్నులను నేర్పే ఆసక్తికరమైన కథలతో వింతగొలిపేది అయిన ఈ సర్వకళావిలాసకథనం సజ్జనులకు ప్రీతిని కూర్చే మంచి స్నేహితుని వంటిది అగుగాక!)

క్షేమేంద్రుడు ఇంత స్పష్టంగా తన కావ్యంలో హితబోధరూపమైన కథాంశ విద్యమానతను గుఱించి అనుఘటించినా, రామకృష్ణకవిగారు తెలుగు 'కళావిలాసము'లో మాత్రమే కథాభాగం ఉన్నదని,

*"… సంస్కృతమున దానిలోఁ గథాంశములు లేకుండుటయు …"*

అని వ్రాయటానికి కారణం ఏమిటో తెలియదు. కవిగారి ఈ నిర్దేశాన్ని విమర్శకులు, వాఙ్మయచరిత్రాసక్తులు ప్రామాణ్యభావంతో ఔదలదాల్చటమే గాని – తామై స్వయంగా పరిశోధించినట్లు కనబడదు. చాగంటి శేషయ్య గారు 1946 నాటి 'ఆంధ్రకవితరంగిణి' మొదటి సంపుటం (పు.173)లో, "క్షేమేంద్రుఁడు కళావిలాస మను పది సర్గల కావ్యమును సంస్కృతమున రచించియున్నాఁడు. కాని యిది యా గ్రంథమున కాంధ్రీకరణమైనట్లు గన్పట్టదు. క్షేమేంద్రుఁడు క్రీ.శ. ౧౦౨౦-౧౦౬౦ కాలమువాఁడు." అని వ్రాశారు. అనంతరీయ చరిత్రకారులు, విమర్శకులు ఇంతకంటె ఈ విషయాన్ని అధికరించి తథ్యమిథ్యావివేచన చేయలేదు. ఆచార్య రవ్వా శ్రీహరి గారు 'అలబ్ధకావ్యపద్యముక్తావళి' (పు.49)లో, "క్షేమేంద్రుడు సంస్కృతంలో రచించిన కళావిలాసమనే గ్రంథం ఒకటి ఉన్నది. కాని అందులో కథాంశమేమీ కానరాదు. నన్నెచోడుని కళావిలాసంలో మాత్రం కథాభాగం కనిపిస్తుంది. అందువల్ల నన్నెచోడుని గ్రంథం క్షేమేంద్రుని గ్రంథానికి అనువాదం కాదని చెప్పవచ్చు" అని వ్రాశారు. ఇవన్నీ యాతాయాతపథంలో సాగిన గాతానుగతికోక్తులు.

**⌖ 4 ⌖**

## 'కళావిలాసము' కావ్యకర్త నన్నెచోడుడు గాక బద్దె భూపాలుడు కావచ్చునా?

ఇదొక సరికొత్త సమస్య. 'కళావిలాసము' నన్నెచోడుని రచనమే గాని, ఆ నన్నెచోడుడు సుప్రసిద్ధమైన కుమారసంభవ కావ్యకర్త గాక 'సుమతి శతకము' రచయిత అయిన బద్దెన కావచ్చునని ఒక అభిప్రాయం. 'సుమతి శతకము' బద్దెన కృతి కాదన్న వాదం ఉండనే ఉన్నది. 1910లో బద్దె భూపాలుని 'నీతిశాస్త్రముక్తావళి'ని, 1923లో మడికి సింగన 'సకలనీతిసమ్మతము'ను ప్రకటించిన రామకృష్ణకవిగారు బద్దెన సుమతి శతకాన్ని వ్రాసి ఉండకపోవచ్చునని, అది భీమకవి కృతి కావచ్చునని, ఆ భీమన వేములవాడ భీమనా? చెదలువాడ భీమనా? అని పరిశీలింపగా దక్షవాటి

భీమన అని అనిపిస్తున్నదని, అయితే తెలంగాణంలో ఉన్న వే(లే)ములవాడతో భీమకవికి సంబంధం లేదని చెప్పటం సాధ్యం కాదని అభిప్రాయపడ్డారు. నన్నెచోడుడే బద్దెన కావచ్చునా? అని పరిశీలించి, బద్దెన రెండవ నన్నెచోడుడని, నన్నెచోడుని వంశంలో కొన్ని తరాల తర్వాత పుట్టి ఉండవచ్చునని, బెజవాడలో దొరికిన క్రీస్తుశకం 1050 నాటి ఒక శాసనంలోని 'బొద్దన నారాయణదేవుడు' బద్దెన కావచ్చునని వ్రాశారు. అంతకు మునుపే 'కుమారసంభవము' పీఠికలో క్రీస్తుశకం 902 నాటి బీచుపల్లి శాసనం నన్నెచోడుని కాలనిర్ణయానికి, బీచుపల్లికి 50 మైళ్ళ దూరంలో తుంగాతీరంలో ఉన్న అలంపురంలోని ఆధారాలు నన్నెచోడుని గురుపైన మల్లికార్జునయోగి కాలనిర్ణయానికి ఉపకరిస్తాయని వివరించారు. పరిశోధకులు పెదచెరుకూరి శాసనంపైని దృష్టిని కేంద్రీకరించి, వివాదాస్పదాలైన ఈ శాసనాల వివరాలను జాగ్రత్తగా పరిశీలింపనందువల్ల సాహిత్యంలో నన్నెచోడుని గురించి, మల్లికార్జునయోగిని గురించి ఎన్నో పొరపాటు నిర్ణయాలకు పునాది ఏర్పడింది. ఆ శాసనవివాదవిశేషాలను, మల్లికార్జునయోగి చరిత్రను మరొక వ్యాసంలో వివరిస్తాను.

బీచుపల్లి క్షేత్రచరిత్రను రచించిన శాసనపరిశోధకులు గడియారం రామకృష్ణశర్మ గారి ఆత్మకథ 'శతపత్రము'ను ఇటీవల చదువుతుండగా, ఈ మాటలు కనబడ్డాయి:

"(బీచుపల్లి) గొప్ప క్షేత్రము ... స్థలమహిమ తప్ప ఇక్కడ చారిత్రక విశేషాలుగాని, వాస్తుశిల్పవిశేషాలు గాని లేవు. అయితే ఆలయావరణలో ఒక శిలాశాసనమున్నది. అది ఎక్కడో ఉన్న రాతీర్థానికి సంబంధించినది. ఎవరో ఇక్కడ ఆ శాసనాన్ని పెట్టినారు. అందులో కళ్యాణి చాళుక్యరాజు త్రైలోక్యమల్లుని దండనాయకుడు చిద్దన చోళుడు 11-వ శతాబ్దిలో చేసిన దానవిషయమున్నది. 20-వ శతాబ్దిలో వనపర్తి సంస్థానంలో ఉన్న గొప్ప పండితులు మానవల్లి రామకృష్ణకవిగారు మొదట రాజకీయవ్యవహారాలు చూస్తుండేవారు. ఆయన గొప్ప పరిశోధకులుగా సుప్రసిద్ధులు. వనపర్తి నుండి 'విస్మృతకవులు' అనే గ్రంథమాలను ప్రారంభించి శ్రీరంగమాహాత్మ్యం, తిమ్మ భూపాలుని అనర్ఘరాఘవం మొదలైన గ్రంథాలను వెలికితీసి పరిష్కరించి ప్రకటించినారు. ఆ మాలికలోనే "నన్నెచోడుని కుమారసంభవం" అనే కావ్యాన్ని ప్రకటిస్తూ ఈ కావ్యం నన్నయకు ప్రాచీనమైనది అని వ్రాసినారు. తెలుగు పండితలోకంలో వాదోపవాదాలు చెలరేగినాయి. ఆయన తన వాదనను సమర్థించుకోవటానికి చూపిన ఉపపత్తులలో ఈ బీచుపల్లి శాసనం ముఖ్యమైనది. శాసనం 11-వ శతాబ్ది నాటిది. కాని తొమ్మిదవ శతాబ్దికి తీసుకొనిపోబడింది. శాసనకర్త చిద్దన చోడుడైతే బద్దెన చోడునిగా చెప్పబడింది. అంటే నన్నెచోడుని తండ్రి బద్దెన అని ముడిపెట్టినారు. ఆ చిద్దన చోడుని శాసనాలు చాలా ప్రకటించబడినాయి. మానవల్లి వారివంటి మహాపండితులు అట్లా చేయరాదు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో తెలుగు ప్రొఫెసర్ కోర్లపాటి శ్రీరామమూర్తి గారు కుమారసంభవాన్ని మానవల్లివారే రాసి నన్నెచోడుని పేరు పెట్టినారని ఒక గ్రంథాన్నే రాసినారు. ఇది చిత్రం కాదా!"

- శతపత్రము: పుటలు 221-2.

బహుశః జ్ఞాపకాధారితంగా వ్రాసినందువల్ల, ముద్రణదోషాల మూలాన శర్మగారి ఉద్ఘాటనలోనూ కొంత సందిగ్ధత ఉన్నది కాని, బీచుపల్లి శాసనం అన్వయవిషయంలో ఏర్పడిన వైరుద్ధ్యాలను వారు గుర్తించారన్నది స్పష్టం. బీచుపల్లి శాసనంలోని నన్నెచోడునితో బద్దె భూపాలుని చరిత్రకు సంబంధం లేదన్నది స్పష్టం.

బద్దె భూపాలునికి నన్నెచోడుడని బిరుదం ఉన్నదన్న విశ్వాసం మూలాన అటు కుమారసంభవ కర్తతోనూ, ఇటు సుమతి శతకం విషయంగానూ అన్వయం ఏర్పడి అది 'కళావిలాసము' కర్తృత్వవివాదానికి దారితీసింది. శాసనాధారాలతో పొందుపడని ఆ అన్వయం ఇతరేతరాధారాలతో సరిపడుతుందేమో చూడాలి.

'నన్నెచోడుని కుమారసంభవము ప్రాచీనగ్రంథమా?' అన్న విమర్శగ్రంథాన్ని 1983లో ప్రకటించిన ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తి గారు ఈ కళావిలాస కావ్యకర్తృత్వం విషయాన్ని కూడా చర్చించి, 'ప్రబంధరత్నాకరము'లోని 'కళావిలాసము', ప్రయోగరత్నాకరము'లోని 'కళావిలాసము' ఒకటి కావని, ఆ రెండింటి కర్తలు వేర్వేరని రెండు ముఖ్యమైన సాధ్యనిర్దేశాలను ప్రతిపాదించారు. వారి దృష్టిలో

1)పెదపాటి జగన్నాథకవి 'ప్రబంధరత్నాకరము'లో ఉదాహృతమైన 'కళావిలాసము' కథాకావ్యం కాదు. అదొక కామశాస్త్రగ్రంథం.
2)గణపవరపు వేంకటకవి 'ఆంధ్ర ప్రయోగరత్నాకరము'లో ఉదాహృతమైన 'కళావిలాసము' కామశాస్త్రగ్రంథంకాదు. అదొక "నానాపురాణకథావిలాసము" అయిన ఒక స్వతంత్రకావ్యం.

అందువల్ల పెదపాటి జగన్నాథకవి, గణపవరపు వేంకటకవి పేర్కొన్నవి రెండూ భిన్నవస్తుకాలైన భిన్నకావ్యప్రభేదాలు (పు. 244-5లు) అని వారి ప్రతిపాదన.

కామశాస్త్రమైన 'కళావిలాసము' ఎవరిదో పెదపాటి జగన్నాథకవి చెప్పలేదు. కావ్యమాత్రమైన 'కళావిలాసము' నన్నెచోడునిదని గణపవరపు వేంకటకవి చెప్పాడు. అందువల్ల ఈ కావ్య కళావిలాసం 'నన్నెచోడ నరేంద్రుడు' అన్న పర్యాయబిరుదాన్ని కలిగిన బద్దె నృపాలుని రచన కావచ్చునని శ్రీరామమూర్తి గారు ఊహించారు. మడికి సింగన 'సకలనీతిసమ్మతము'లో ఉన్న బద్దె నృపాలుని మూడు పద్యాలను, 'నీతిశాస్త్రముక్తావళి'లోని రెండు పద్యాలను తమ నిర్ణయానికి ఆధారం చేసుకొన్నారు. ఆ పద్యాలివి:

'బద్దెన నీతి' లోనివిగా మడికి సింగన 'సకలనీతిసమ్మతము'లో ఉదాహరించినవి:

**క. సాధింపఁ గడిఁది శత్రుల, సాధించిన బలిమి వృథ నిజక్షితిజనులన్**
**బాధించు కంటకులఁ బతి, శోధింపనినాఁడు నన్నిచోడనరేంద్రా!(1-113)**

**క. తనకెన్నఁ డుండియును ద, క్కని భృత్యులఁ బెరుగ మనుపఁగాఁ జనదు ప్రయో**
**జనమునకుఁ దగిన వెల యి, చ్చునది నరేశ్వరుండు నన్నిచోడనరేంద్రా!(2-420)**

**క. మనుపఁ గొఱయేని జీతము, దనియఁగ నిచ్చునది యెంత దయగల్గిన నే**
**రనివాని నెఱతనమునకుఁ, జొనుపుట దుర్నయము నన్నిచోడనరేంద్రా!(2-421)**

బద్దె భూపాలుని 'నీతిశాస్త్రముక్తావళి' లోనివిగా మడికి సింగన 'సకలనీతిసమ్మతము'లో ఉదాహరించినవి:

**క. భూపగుణ మలిగి చెఱుపఁగ, నోపుట కరుణించి మనుప నోపుట జడుఁడై**

**కోపప్రసాదగుణములు, సూపని పతి పతియె నన్నిచోడనరేంద్రా!(1-10)**

**క. సతి కంటె నబల వసుమతి, సతి పతిలేకున్నఁ జెడదు సత్యము ధాత్రీ**

**పతి లేనినాఁడు సద్య, శ్చ్యుతి వసుమతి కండ్రు నన్నిచోడనరేంద్రా!(1-48)**

ఆ రోజుల్లో "కుమారసంభవ కావ్యం మానవల్లి వారి రచన" అన్న వారి వాదధోరణిలో కొట్టుకొనిపోయిన విమర్శకలోకం వారు చేసిన ఈ ముఖ్యమైన ప్రతిపాదనను పట్టించుకోలేదు. తథ్యమిథ్యావివేచనను చేయలేదు.

⌖ 4 ⌖

## బద్దె భూపాలునికి 'నన్నిచోడుడు' అన్న బిరుదం ఉన్నదా?

'నన్ని', 'నన్నె'లను పర్యాయాలుగా స్వీకరించటం భావ్యమే కనుక 'నీతిశాస్త్రముక్తావళి' లోని నన్నిచోడుడే గణపవరపు వేంకటకవి చెప్పిన 'కళావిలాసము' కావ్యకర్త నన్నెచోడుడు కావచ్చునని శ్రీరామమూర్తి గారి ఊహ. చిత్రమేమంటే, ఈ విషయంలోని ఒక సందిగ్ధాంశాన్ని వారూ గమనించకపోవటం. ఆ విషయాన్ని వివరిస్తాను.

1923లో రామకృష్ణకవి గారు మడికి సింగన 'సకలనీతిసమ్మతము'ను ప్రకటించారు. పీఠికలో దానికి మూలమైన "కాగితపు సంపుటం" ప్రతిని అమరచింత సంస్థానం అధిపతి శ్రీమంతు రాజా ముక్కర సీతారామ భూపాల బహద్దరువారు తమకు దయచేసినట్లు చెప్పారు. అది "లేఖకదోషసహస్రపరిపూరితమై" ఉండటం వల్ల కవిగారు దానిని "సవరించి" ముద్రింపవలసివచ్చింది. ఆ 'సవరణ'లో మూలంలో లేని ఎన్నో 'పూరణ'లు వారి ముద్రణలో చోటుచేసుకొన్నాయి. తాము చేసిన పూరణలను కవిగారు తమ ముద్రణలో కుండలీకరించి చూపలేదు. వ్రాతప్రతిని చూడనివారికి ఆ పూరణలను గురించి తెలిసే అవకాశం ఉండదు. 1979లో ఆంధ్ర సాహిత్య అకాడమీ పక్షాన నిడుదవోలు వేంకటరావు గారు 'సకలనీతిసమ్మతము'ను పునర్ముద్రించినపుడు ఆ 'పూరణ'లలో వాఙ్మయచరిత్రకు ముఖ్యమైన కొన్నింటిని వివరించి చూపారు. ఒక సీసపద్యంలో ముప్పాతిక ముప్వీసం కవిగారి పూరణే. అక్కడ కుండలీకరణం జరగలేదు. అటువంటివి ఎన్నో ఉన్నాయి. కొన్నిచోట్ల పదాలు, కొన్నిచోట్ల పూర్తి పాదాలు, కొన్నిచోట్ల పద్యాలకు పద్యాలు ఉన్నాయి. "కవిగారే ఈ పూరణములను గావించిరి" అని వేంకటరావుగారు చెప్పారు. కవిగారు తాము చేసిన పూరణలను కుండలీకరించి చూపకపోవటం సరైన పరిష్కరణవిధానం కాదు" అనికూడా గట్టిగానే చెప్పారు.

అమరచింత సంస్థానం నుంచి కవిగారికి లభించిన మునుపటి ఆ కాగితపు ప్రతి ఇప్పుడేమయిందో మనకు తెలియదు. ఒకనాటి పురాతనమైన ఏదో ప్రతికి నకలుగా రూపొందినట్లున్న అమరచింత సంస్థానం వారి ఆ కాగితపు ప్రతికి రామకృష్ణకవిగారు తమ వాడుకకోసం 1901లో ఒక ప్రతిని వ్రాయించినట్లున్నది. అందుకు మూలమైన సంస్థానం వారి

ప్రతి ఆ తర్వాత ఏమయిందో మనకు తెలియదు. మూలమైన ప్రతిలోనుంచి కవిగారు ఎన్ని మార్పులను చేసి తమ ప్రతిని తయారుచేసుకొన్నారో మనకిప్పుడు తెలియదు. కవిగారికి అత్యంత సన్నిహితులైన ఆచార్య పోణంగి శ్రీరామ అప్పారావు గారు 1950లో ఆ లిఖితప్రతిని రామకృష్ణకవిగారిని అడిగి తీసుకొన్నారు. కవిగారి ముద్రితప్రతికి, ఆ కాగితపు ప్రత్యంతరానికి కూడా ఎన్నో తేడాలున్నాయి. అక్షరాల పోలికలేని సొంత మార్పులున్నాయి. ఆ కాగితపు ప్రతిని, కవిగారి ముద్రితప్రతిని సరిపోల్చి శ్రీరామ అప్పారావు గారు కొన్ని ముఖ్యమైన పాఠభేదాల పట్టిక ఒకదానిని రూపొందించారు. బహుశః దానిని మరింత పరిశోధించి ఏమైనా సాధికారమైన విమర్శను ప్రకటించాలని అనుకొన్నారేమో. శ్రీరామ అప్పారావు గారి పట్టిక, ఆ కథ నిడుదవోలు వేంకటరావు గారు ప్రకటించిన సాహిత్య అకాడమీ వారి ప్రతిలో 158 నుంచి 169 వరకు ఉన్న పన్నెండు పుటలలో ఉన్నాయి. కవిగారు చేసిన ముఖ్యమైన మార్పులను, చేర్పులను కూడా శ్రీరామ అప్పారావు గారు అందులో గుర్తించారు. తమ వద్దకు చేరిన మానవల్లి వారి 1901 నాటి ఆ ప్రతిని శ్రీరామ అప్పారావు గారు ఆంధ్రప్రదేశ్ ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారానికి ఇచ్చివేశారు. ఆసక్తి కలవారు దానినిప్పుడు అక్కడికి వెళ్ళి పునఃపరిశీలింపవచ్చును.

ఆచార్య పోణంగి శ్రీరామ అప్పారావుగారు ఎంతో శ్రమకోర్చి సమకూర్చిన ఆ పాఠభేదాల పట్టికను నిడుదవోలు వేంకటరావు గారు కాని, ఆచార్య కోర్లపాటి శ్రీరామమూర్తి గారు కాని, ఇతర విమర్శకులు కాని శ్రద్ధగా పరిశీలించినట్లు కనబడదు. ఆ పాఠభేదాలను, ఆంధ్రప్రదేశ్ ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారంలోని కాగితపు ప్రతిని ముందుంచుకొని మడికి సింగన కృతిని పునఃపరిష్కరించి, దాని వాస్తవరూపాన్ని నిర్ధారించటం సాహిత్యచరిత్రకు ఎంతో దోహదం కాగలుగుతుంది.

'సకలనీతిసమ్మతము' నుంచి పైని ఉదాహరించిన బద్దె భూపాలుని పద్యాలలో ప్రథమాశ్వాసంలోని 113-వ పద్యం, ద్వితీయాశ్వాసంలోని 420, 421 పద్యాలు అన్నింటి చివర శ్రీరామ అప్పారావు గారు తమవద్ద ఉండిన కాగితపు ప్రతితో సరిపోల్చి వ్రాసికొన్న పాఠాంతరాలు అన్నింటిలోనూ "నన్నిచోడనరేంద్రా!" అని గాక "నెన్ని చూడ నరేంద్రా!" అని ఉన్నది!

శ్రీరామ అప్పారావు గారి పట్టికను బట్టి పద్యాల యథార్థస్వరూపం ఇట్లా ఉంటుంది:

**క. సాధింపఁ గడిఁది శత్రుల, సాధించిన బలిమి వృథ నిజక్షితిజనులస్**

**బాధించు కంటకులఁ బతి, శోధింపనినాఁడు నెన్ని చూడ నరేంద్రా!(1-113)**

**క. తనకెన్నఁ డుండియును ద, క్కని భృత్యులఁ బెరుగ మనుపఁగాఁ జనదు ప్రయో**

**జనమునకుఁ దగిన వెల యి, చ్చునది నరేశ్వరుండు నెన్ని చూడ నరేంద్రా!(2-420)**

**క. మనుపఁ గొఱయేని జీతము, దనియఁగ నిచ్చునది యెంత దయగల్గిన నే**

**రనివాని నెఱతనమునకుఁ, జొనుపుట దుర్నయము నెన్ని చూడ నరేంద్రా!(2-421)**

బాహ్యదృష్టికి "నన్నిచోడనరేంద్రా!" అన్నప్పుడు ధారాశుద్ధి ఉన్నదని, "నెన్ని చూడ నరేంద్రా!" అన్నప్పుడు కొంత కుంటి నడక ఉన్నదని అనిపింపవచ్చును. జాగ్రత్తగా పరిశీలిస్తే అది సరికాదని తెలుస్తుంది. పై పద్యాల ముందువెనుకలేవో మనకు తెలియదు. ఆ పూర్వోత్తరసంహితలో వాటి అన్వయం సమర్థకంగానే ఉండి ఉంటుంది. నిజానికి "మనుపఁ గొలిచియేని జీతము, దనియఁగ నిచ్చునది యెంత దయగల్గిన నే, రనివాని నెఱతనమునకుఁ, జొనుపుట దుర్నయము నెన్ని చూడ నరేంద్రా!" అన్న పద్యమే సమంజసంగా ఉన్నది. కర్తృనామమే వివాదాస్పదం కాగల ఇంత ముఖ్యమైన మార్పును చేసినందుకు తమకు తోచిన కారణాలేమిటో రామకృష్ణకవిగారు చెప్పలేదు. ఒకచోట గాక అన్నిచోట్ల అదే విధంగా ఉన్నందువల్ల "నెన్ని చూడ నరేంద్రా" అన్నదానికి "నన్నిచోడనరేంద్రా" అన్న మార్పు యాదృచ్ఛికంగా జరిగిన మార్పు అనుకోవటానికి వీలుండదు.

'సకలనీతిసమ్మతము' వ్రాతప్రతిని బట్టి మడికి సింగన కృతిలో బద్దె భూపాలునికి అసలు "నన్నిచోడనరేంద్రా!" అన్న బిరుదసంబోధనమే లేదని, ఆ ప్రస్తావమంతా కాలాంతర కారణాంతర సంక్రాంతమైన విషయమని అర్థమవుతుంది.

పైగా, 'బద్దెన నీతి' నుంచి మడికి సింగన ఉదాహరించిన "సాధింపఁ గడఁది" అన్న ప్రథమాశ్వాసంలోని 123-వ పద్యానికి తర్వాత అదే విషయానికి కొనసాగింపుగా

**క. జనపతి తన ప్రజ భారము, తన ముఖమున నడపికొనక తక్కినఁ బొలియున్**
**దిని చెఱుతు రతని సొమ్ముౕన్, జనువారును బ్రజ నరేంద్రచతురాననుఁడా!(1-124)**

అన్న పద్యం ఉన్నది. "సాధింపఁ గడఁది శత్రుల, సాధించిన బలిమి వృథ నిజక్షితిజనులన్, బాధించు కంటకులఁ బతి, శోధింపనినాఁడు నెన్ని చూడ నరేంద్రా!" అని చెప్పిన పిమ్మట, "జనపతి తన ప్రజ భారము, తన ముఖమున నడపికొనక తక్కినఁ బొలియున్, దిని చెఱుతు రతని సొమ్ముౕన్, జనువారును బ్రజ నరేంద్రచతురాననుఁడా!" అని ఈ పద్యం ఉండటం సంగతంగా ఉన్నది. "ఎన్ని చూడ నరేంద్రా!", "నరేంద్రచతురాననుఁడా!" అన్న సంబోధనలలో ప్రాసంగికమైన ఒక పరిగతి, పరిణామక్రమం ఉన్నాయి. వ్రాతప్రతిలో లేని "నన్నిచోడనరేంద్రా!" అన్న వివాదానికి తావిచ్చే నామపాఠం సుపరిష్కృతమైన ముద్రణలో ఉండటం భావ్యం కాదు.

'సకలనీతిసమ్మతము'లో మడికి సింగన ఉదాహరించిన 'బద్దె నీతి'లోనూ, బద్దె భూపాలుని కృతిగా అచ్చయిన 'నీతిశాస్త్రముక్తావళి'లోనూ ఉన్న కొన్ని పద్యాల చివర బద్దె భూపతికి జ్ఞాపనాదిముఖంగానూ, అభిముఖీకరణార్థం గానూ ప్రయుక్తాలైన వివిధసంబోధనలున్నాయి. అవి – "ఉదారవైరోచనుఁడా!", "కావ్యచతుర్ముఖ!", "కీర్తినారాయణుఁడా!", "కొమరుర భీమా!", "దశదిశాభరణాంకా!", "నన్నగంధవారణా!", "నయతత్త్వనిధీ!", "నరేంద్రచతురాననుఁడా!", "పరపక్షభైరవా!", "భూపదిలీపా!", "యశోనిధీ!", "రాజభూషణా!", "రాజమనోజభూజా!", "రాజరాజమనోజా!", "వివేకచతురాననుఁడా!", "వివేకభూషణా!", "సర్వజ్ఞనిధీ!" మొదలైనవి. అవన్నీ ప్రభువాచకాలైన బిరుదసంజ్ఞాంకనాలని, వాటిలో "నన్నిచోడ నరేంద్రా!" అన్న తీరున వ్యక్తి పేరును గాని, వంశీయతను గాని ప్రత్యక్షంగా

సూచిస్తున్న వాచ్యార్థనిరూపణ ఒక్కటీ లేదని గుర్తిస్తే, “ఎన్ని చూడ నరేంద్రా!” అన్న పాఠం స్థానంలో అస్థానపతితమైన “నన్నిచోడ నరేంద్రా!” అన్న పాఠం ప్రవేశించిందని స్పష్టం కాకమానదు.

పైని ఉదాహరించిన ‘నీతిశాస్త్రముక్తావళి’లోని పద్యాంతాలలో “నన్నిచోడ నరేంద్రా!” అని ఉన్న పాఠాన్ని “ఎన్ని చూడ నరేంద్రా!” అని సరిదిద్ది చదువుకోవటం సాధ్యం కాదు. అక్కడ అన్వయం సరిపడదు. అయితే, వ్రాతప్రతిలో ఆ పద్యాల స్వస్థితి ఎట్లా ఉండిందో, అవి ఎన్ని మార్పులను పొందాయో వ్రాతప్రతిలోని పాఠవ్యవస్థను చూడకుండా మనమిప్పుడు చెప్పలేము.

అందువల్ల, ఆచార్య శ్రీరామమూర్తి గారు సూచించినట్లు గణపవరపు వేంకటకవి చెప్పిన నన్నెచోడుడు బద్దె భూపాలునికి పర్యాయనాముడైన నన్నెచోడుడని, ఆతడే ‘కళావిలాసము’ కావ్యకర్త అని నిశ్చయించటం ప్రకృతపరిస్థితిలో ఉపలభ్య పాఠప్రమాణాలను బట్టి సాధ్యం కాదని తాత్పర్యం.

**⌖ 5 ⌖**

## సంస్కృతంలో ‘కలావిలాసము’ అనే కామశాస్త్రగ్రంథం ఉన్నదా?

ఆచార్య కోర్లపాటి శ్రీరామమూర్తిగారు పెదపాటి జగన్నాథకవి ‘ప్రబంధరత్నాకరము’లో ఉదాహరించిన ‘కళావిలాసము’ కామశాస్త్రగ్రంథమని చేసిన ఊహాత్మకప్రతిపాదనం ఈ అధికరణలో విచారింపబడుతున్నది. అది అనువాదం కావచ్చునా? అని పరిశీలించి చూడగా - సంస్కృతంలోని కామశాస్త్రగ్రంథాల నికురుంబంలో ‘కలావిలాసము’ అన్న పేరిటి గ్రంథం లేదు. పుణ్యానందనాథుని ‘కామకలావిలాసం’ కాశ్మీర కులార్ణవ తంత్రమార్గంలో హాదివిద్యకు చెందిన శైవసమయగ్రంథమే కాని ప్రకృతపరిశీలితాల పరిధి లోనిది కాదు. సంస్కృతంలో కామశాస్త్రగ్రంథాలపై వెలసిన వ్యాఖ్యానకదంబంలోనైనా కలావిలాసమనే వ్యాఖ్య లేదు. అందువల్ల తెలుగు ‘కళావిలాసము’ ఆ పేరుగల సంస్కృతకృతికి అనువాదం కాకపోవచ్చును. తెలుగులో నారాయణదేవుని ‘మదన కళాభిరామము’నకు ‘కళావిలాసము’తో పోలిక లేదు. అందులో ‘కళావిలాసము’ను పోలిన పద్యాలు లేవు. ‘కళావిలాసము’ లోని పద్యాలు లేవు. ముద్రితమై ఉన్న ‘కళాశాస్త్రము’ అన్న కామశాస్త్ర ప్రకరణగ్రంథంలోనూ, నా వద్ద ఉన్న ‘కళాశాస్త్రము’ అన్న కామశాస్త్రనిర్వర్ణనమైన (అముద్రిత) తాళపత్రగ్రంథంలోనూ ‘కళావిలాసము’ ప్రసక్తి గాని, దానిలో నుంచి ఉదాహరింపబడిన పద్యాలు గాని లేవు.

జక్కన ‘విక్రమార్క చరిత్రము’ సప్తమాశ్వాసంలో విక్రమార్కుడు తన మంత్రవిద్యతో ఒక సువర్ణకలశానికి సచేతనత్వాన్ని కలిగించే కథ ఒకటున్నది. మాటలు వచ్చాక రాజు ఆ కలశాన్ని, “అపూర్వ కళామహోదర, శ్రీ రుచిమీఱ నొక్క కథఁ జెప్పఁగదే (8-3)” అని ఆజ్ఞాపిస్తాడు. సువర్ణకలశం పద్మావతి అనే జాణ కథను వినిపిస్తుంది. పుష్పకరండకుడు ఇష్టలీలావినోదాలకోసం తచ్చట్లాడుతూ మహాఘోషపురంలో పద్మావతి ఉంటున్న మందిరానికి వస్తాడు. ఆ మందిరాన్ని కాముకీకళామందిరంగా వర్ణిస్తూ మహాకవి జక్కన -

**ఉ. ప్రాకటహేమరత్నమయపంజరపీఠికలన్ శుకంబు ల**
**వ్యాకులలీలతో *రతిరహస్యవికాస కళావిలాస కొ***
***క్కోకము లర్థితోఁ* జదువఁ గూరిమితో వినుచున్ సురూపరే**
**ఖాకమనీయతామహిమఁ గాముని దీమముఁ బోలె ముందటన్.(8-21)**

అని వ్రాశాడు. రత్నాలు పొదిగిన బంగారు పంజరాలలోని పీటలమీద కూర్చొన్న చిలుకలు తన్మయతతో "రతిరహస్యవికాస కళావిలాస కొ, క్కోకము" లను చదువుతుంటే పద్మావతి వింటున్నదట. 'రతిరహస్యము' అంటే 13-వ శతాబ్ది నాటి కొక్కోకుడు రచించిన కామశాస్త్రప్రకరణగ్రంథం. "ఇతి శ్రీ సిద్ధపణ్డితసింహాళీయ కొక్కోకవిరచితే రతిరహస్యే" అని పుస్తకం చివర ఉన్నది. కొక్కోకుడు అన్నది కవి పేరన్నమాట. రతిరహస్యానికే 'కొక్కోకము' అని వ్యవహారనామం. నిజానికి 'కొక్కోకము' అనటమే గాని, 'రతిరహస్యము' అన్న పేరుతో వ్యవహరించేవారు తక్కువ. అష్టమాశ్వాసంలోనే గుణవతి కథను చెబుతూ సువర్ణకలశం ఆమె ఉపపతితో ప్రసంగించే సందర్భంలోనూ జక్కన –

**సీ. సేమంతికలఁ జెలరేఁగి చిలుకలు మదనశాస్త్రంబులు చదువుచుండఁ**
**గడిమికూటములఁ బికమ్ము *లనంగ నేపాళప్రబంధంబు లాలపింప* ..."**

అని వ్రాశాడు. ఇక్కడ 'నేపాళ ప్రబంధంబులు" అంటే నేపాల్ దేశంలోని ప్రబంధాలు కావు. 'నేపాళము' అంటే సింహళదేశంలోని జాఫ్నా దీవి అన్నమాట. సింహాళీయుల "యార్పాణమ్", "యార్పాళమ్" ధ్వనిసామ్యం వల్ల తెలుగులో "నేపాళం" అయింది. "అనంగ నేపాళ ప్రబంధంబులు" అంటే సింహాళీయ కొక్కోక ప్రబంధమే. చేమకూర వేంకటకవి రఘునాథనాయకుని గురించి –

**క. సుస్థిరలక్ష్మీ మహిత మ, ణిస్థగితగృహాంగణునకు నేపాళనృపా**
**లస్థాపనచణునకు ..."**

అని 'విజయవిలాసము' (1-62) లో వర్ణించిన నేపాళ రాజ్యం జాఫ్నా మండలమే. "నేపాళనృపా,లస్థాపన"మంటే క్రీస్తుశకం 1615లో రఘునాథరాయలు జాఫ్నా ప్రభువు మణ్ణన్ సింగర్ భార్యల ప్రార్థనను మన్నించి అక్కడికి వెళ్ళి శాంతిస్థాపన చేసిన కథన్నమాట. కనుక జక్కన దృష్టిలో "**కడిమికూటములఁ బికమ్ము *లనంగ నేపాళప్రబంధంబు లాలపింప***" అన్నప్పుడు పికాలు ఆలపిస్తున్నది సింహాళీయ కొక్కోకుని రతిరహస్యమే అన్నమాట స్పష్టం.

అయితే జక్కన తన పద్యంలో 'కొక్కోకములు", "నేపాళ ప్రబంధంబులు" అనటం వల్ల బహువచనాన్ని బట్టి ఆ చిలుకలు 1) 'రతిరహస్యము', 2) 'కళావిలాసము', 3) 'కొక్కోకము' అన్న మూడు పుస్తకాలను చదువుతున్నట్లు పొరపాటున అన్వయించుకొనే అవకాశం ఉన్నది. అప్పుడు 'రతిరహస్యము' అంటే 'కొక్కోకము' అని గాక వేరొక గ్రంథనామం అవుతుంది. ఆ పేరుతో తెలుగులో 'వరాహపురాణము', 'ఉత్తర నారసింహపురాణము' 'భాగవత ఏకాదశ షష్ఠ స్కంధములు' మొదలైన పెక్కు కావ్యాలను రచించిన 15-16 శతాబ్దుల నాటి మహాకవి హరిభట్టు రచించిన సంస్కృత

కృతి 'రతిరహస్యము' లేకపోలేదు. అది కామశాస్త్రగ్రంథమే. గతశతాబ్దంలో అచ్చయింది. మాడభూషి కృష్ణమాచార్యులవారు History of Classical Sanskrit Literature (పు. 892) లో ఈ 'రతిరహస్యము' విద్యాధరుని 'ఏకావళి'లో 'బిన్ద్వలఙ్కారము' కర్తగా ఉదాహృతుడైన క్రీస్తుశకం 13-వ శతాబ్ది నాటి హరిహరుడని అనుమానించారు కాని, ఆ అనుమానం సరికాదు. ఈ సంస్కృత 'రతిరహస్యము' కర్త హరిభట్టు 'చంద్ర' సంజ్ఞ కలిగిన రామపండితుని కొడుకు. అంటే, ఆంధ్రుడైన మన హరిభట్టే కాని అన్యకవి కాడు. తదనుసారం ఆ దళానికి "హరిభట్టు రచించిన రతిరహస్యం, ఎవరి రచనో మనకిప్పుడు తెలియని కళావిలాసం, కొక్కోకమనే మారుపేరు గల రతిరహస్యం అన్న మూడు గ్రంథాలను పఠిస్తున్న పంజరశుకాలు" అని అర్థం చెప్పుకోవాలి.

ఇందుకు ప్రతిబంధకమల్లా ఒక్కటే – హరిభట్టు జక్కనకు తర్వాతి కాలంలోనివాడే కాని, పూర్వుడు కాడు కదా! అందువల్ల జక్కన చెప్పిన కథానాయిక పద్మావతి ఇంటి గ్రంథాలయంలో హరిభట్టు 'రతిరహస్యము' ఉండే వీలుండదు. ఒకవేళ జక్కన కాలం కూడా వివాదగ్రస్తమే కాబట్టి, వాదనిమిత్తం జక్కన హరిభట్టుకంటె ఆధునికుడనుకొన్నా - 1) 'రతిరహస్యము', 2) 'కళావిలాసము', 3) 'కొక్కోకము' అన్న మూడు పుస్తకాల మధ్య ఎటువంటి అన్వయమూ లేని "వికాసము" అన్న నిరర్థకపదం వచ్చి చేరింది. ఆ పేరును నామాంశమాత్రంగానైనా కలిగిన గ్రంథమేదీ లేదు.

ఆ పక్షాన "రతిరహస్యవికాస కళావిలాస కొ, క్కోకములు" ఎట్లా అన్వయిస్తుంది? అంటే, 'భగవద్గీతలు', 'ఉత్తరగీతలు' అంటున్నట్లు 'కొక్కోకములు' అనటం తెలుగువారి సంప్రదాయం అన్నమాట.

**క. ధర తాళపాక అన్నయ, వరసుతుడగు తిరుమలయ్య వాచాప్రౌఢిన్**
**వెరవుగ *భగవద్గీతల*, పరమార్థము లంధ్రభాష పరగ రచించెన్."**

అని 'శ్రీ భగవద్గీత'కు తాళ్లపాక పెద తిరుమలాచార్యుల తొలి తెలుగు వచనానువాదం వ్రాతప్రతి ఒకదానిలో ఉన్న పద్యాన్ని ఆచార్య సచ్చిదానందమూర్తి గారు తమ ప్రస్తావన (పు. xv) లో ఉదాహరించారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ ప్రాచ్యపరిశోధనాలయం వారు 1978లో అచ్చువేసిన తాళ్లపాక పెద తిరుమలాచార్యుల 'శ్రీ భగవద్గీత'లో ఈ పద్యం ప్రస్తావన ఉన్నది. అందులో ఉన్నట్లు "భగవద్గీతలు' అనే తెలుగువారి సంప్రదాయం. సంస్కృతంలో అయినా "భగవద్గీతాసు" అనే బహువచనం వాడుక. జక్కన పద్యంలో "రతిరహస్యవికాస కళావిలాస కొ, క్కోకము లర్థితోఁ జదువ" అన్నదానికి మారుగా "రతిరహస్యవికాస కళావిలాస కొ, క్కోకము నర్థితోఁ జదువ" అని ఉంటే ఏ వివాదమూ ఉండేది కాదు కాని – అది తెలుగువారి వ్యవహారపద్ధతి కాదు.

'కొక్కోకములు' అంటే కొక్కోక శ్లోకాలో (విక్రమార్కుడి కాలం మాటెలా ఉన్నా కొక్కోకుడు జక్కనకు పూర్వుడే కనుక), కొక్కోక పద్యాలో అనుకోవచ్చును కాని తెలుగులో అప్పటికి ఇంకా కూచిరాజు ఎఱ్ఱన తెలుగు అనువాదం వెలువడలేదు కాబట్టి శ్లోకాలనే అన్వయించాలి.

దీనిని బట్టి జక్కన పద్యోదాహరణం 'కళావిలాసము' అనే కామశాస్త్ర గ్రంథస్థితికి ఉపస్కారకం కాదని తాత్పర్యం. ఇదంతా మనకై మనము పరిశీలిస్తున్న విషయమే కాని ఆచార్య శ్రీరామమూర్తి గారి ప్రతిపాదనకు ఇది ప్రాతిపదికం కాదు. 'ప్రబంధరత్నాకరము'లో ఉదాహృతమైన 'కళావిలాసము' పద్యాలు కామశాస్త్రవిషయాలు కాబట్టి అది కామశాస్త్రకృతి అని మాత్రమే వారి భావన.

నిజానికి శ్రీరామమూర్తిగారి ప్రత్యంతరంలో "విటలక్షణము – కళావిలాసము", "విటశృంగారము", "కుటిలవేశ్య లక్షణము", "వేశ్యమాత", "భద్ర దత్త కూచిమార పాంచాలురు", "చిత్తిని", "హస్తిని", "శంఖిని", "పద్మిని", "బాలకు", "యౌవనకు", "ప్రౌఢకు", "లోలకు", "కూర్మి" అన్న శీర్షికలను చూస్తే ఈ 'కళావిలాసము' పరిపరి శృంగారవిషయాల సంధానమే గాని కామశాస్త్రపార్యం కాదని సులభంగానే ఊహింపవచ్చును. శ్రీరామమూర్తిగారు పద్యాల పరిష్కృతపాఠాలను గాక విమర్శకుల పరిశీలనార్థం వ్రాతప్రతిలో ఉన్నవాటిని ఉన్నట్లుగా ఇవ్వటం వల్ల చదువుకొనేవారికి కొంత ఇబ్బందిగానే ఉంటుంది. వాటిని సవరించి చదుకోవలసి వస్తుంది. ఒకటి రెండు ఉదాహరణలివి:

**ఉ. బాలల రూపు చూపుకొని భద్రుఁడు మాటల (?) బెండువెట్టి పాం**
**చాలుఁడు వశ్యమంత్రజపసాధ్యచయంబులఁ గూచిమారుఁ డా**
**భీల(?)ధనాంబరావళులఁ బ్రీతులుఁ (?) జేయుచు దత్తకుండు లీ**
**లాలలితానురాగగతులన్ సుఖియింతు రనంగసౌఖ్యముల్."(పద్యం. 8)**

తన రూపరేఖలతో భద్రజాతి పురుషులు, కళాస్థానాలను కరగించి పాంచాలులు, మందుమంత్రాలతో కూచిమారుడు, అధికధనాదులతో దత్తకుడు కాంతలను లోబరచుకొంటారని కామశాస్త్రం. మొదటి పాదంలో దత్తకుడు "బాలల రూపు చూపుకొని" అన్నప్పుడు రూపానికి ధాత్వర్థఫలాశ్రయత్వం వల్ల ద్వితీయా విభక్తిసిద్ధి, తత్ఫలంగా "రూపున్" అన్నప్పుడు ద్రుతసంధి విహితమవుతాయి. "బాలల రూపుఁ జూపుకొని భద్రుఁడు" అని ఉండాలి. "బాలల" అన్నచోట బహువచనప్రయుక్తి సరసార్థసాధకం కాదు. పైగా విరసార్థబోధకం. "బాలను రూపుఁ జూపుకొని భద్రుఁడు" అని ఉండటం సమంజసం. "మాటల బెండువెట్టి" అన్నది అపపాఠం. పాంచాలుడు మాటలతో వశపరచుకోవటం అన్న నిర్వచనం శాస్త్రవిరుద్ధం. మాటులను = అంటే ఏకాంతసమావేశంలో కాంత కళాస్థానాలను; బెండువెట్టి = కరగించి వశపరచుకొనేవాడు పాంచాలుడు అని అర్థం. అందువల్ల "మాటుల బెండువెట్టి పాం, చాలుఁడు" అని ఉండాలి. 'కరగించు', 'వశపరచికొను' అన్న అర్థాలలో "బెండువెట్టు" పదబంధాన్ని నిఘంటువులు గ్రహింపలేదు. అందుకు ఈ ప్రయోగమొకటి ఆకరమై ఉండటం విశేషం. "వశ్యమంత్రజపసాధ్యచయంబుల" అంటే వశీకరణతంత్రాలలో చెప్పబడిన ఔషధాలు, సిద్ధిదాయకమంత్రజపాలు, సాధ్యములైన క్రియాభేదాలు అన్నమాట. ఇవన్నీ ఈనాడు అలభ్యంగా ఉన్న కూచిమార తంత్రంలోని ప్రయోగవిశేషాలు. తక్కిన గ్రంథాలలోనూ ఉన్నాయి. "ఆ,భీలధనాంబరావళులఁ బ్రీతులుఁ జేయుచు" అన్నదానికి అన్వయం లేదు. దత్తకుడు "ఆభీల=భయం గొలిపే" ధన+అంబర+ఆవళులను ఇచ్చి వశపరచుకొంటాడన్నది అపార్థాన్నిస్తుంది. "ఉద్వేల=మేరలేని" ధన+అంబర+ఆవళులను ఇచ్చి వశపరచుకొంటాడని సవరించుకోవాలి. "ప్రీతులున్" అన్నది వాచకదోషం. "ప్రీతలన్+చేయుచు" అని మహతీవాచకాన్ని దిద్దుకోవాలి.

“లీ,లాలలితానురాగగతులన్” అన్నప్పుడు “లలిత” శబ్దానికి 1) ఈప్సితార్థంలో “ఇష్టమైన” అని, 2) లాక్షణికార్థంలో “శృంగారానురూపములైన చేష్టావిశేషాలతో” అని భావార్థాలను చెప్పుకోవాలి. అంతే కాని, అనురాగలాలిత్యం నాయకుని ధీరలలితత్వానికి బోధకం కాదు. “సుఖియింతు రనంగసౌఖ్యముల్” అన్న దళానికి పేపరు కాయితం అన్నట్లు “సౌఖ్యాలను సుఖిస్తారు” అని గాక, “మన్మథసౌఖ్యాల భోగయుక్తి వల్ల సుఖైకసాధ్యమైన సంతృప్తిని అనుభవిస్తారు” అని అర్థాన్వయం.

అక్షరస్థితిని బట్టి పద్యం ఇట్లా ఉండాలి:

**ఉ. బాలను రూపుఁ జూపుకొని భద్రుఁడు; మాటుల బెండువెట్టి పాం**
**చాలుఁడు; వశ్యమంత్రజపసాధ్యచయంబులఁ గూచిమారుఁ; డు**
**ద్వేలధనాంబరావళులఁ బ్రీతలఁ జేయుచు దత్తకుండు లీ**
**లాలలితానురాగగతులన్ సుఖియింతు రనంగసౌఖ్యముల్.**

ఇదంతా కథాగతమైన ఏదో నిరుక్తమే గాని చతుర్విధ విటుల లక్షణనిర్వచనం వలె తోచదు. చతుర్విధ విటుల లక్షణనిర్వచనం అయితే అసలు సరిపోదు. లోల అయిన చిత్తినిని రాత్ర్యంతాన మూడవ యామంలో భద్రుడు, బాల అయిన పద్మినిని నాలుగవ జామున పాంచాలుడు, ప్రౌఢ అయిన హస్తినిని రాత్రి రెండవ జామున దత్తకుడు, ధీర అయిన శంఖినిని పూర్వయామవేళలో కూచిమారుడు వశపరచుకొంటారని కొక్కోకశాస్త్రం. ఇందులో ఆ అన్వయం సాధ్యపడదు.

కవి గొప్ప పండితుడు. ఇతరేతరపద్యచయాన్ని బట్టి ఆయనకు మల్లనాగుని వాత్స్యాయన కామసూత్రం, బాభ్రవ్యుని స్మరదర్పనం, కల్యాణమల్లుని అనంగరంగం, ప్రౌఢదేవరాయల రతిరత్నప్రదీపిక మొదలైన కోవిదుల రచనలతో, వాటిలోని అంతర్భేదాల నిర్వచనాలతో పరిచయం ఉండినదని తెలుస్తూనే ఉన్నది. పద్యం ప్రౌఢంగా ఉన్నది.

ఒక్కటే సందేహం: “బాలల రూపుఁ జూపుకొని భద్రుఁడు” అన్న ఎత్తుగడను చూడగానే పాఠకులకు “కన్నులు ద్రిప్పుచు వన్నెలు పచరించు రూపుఁ జూపుచును భద్రుండు దిరుగు” అన్న క్రీ.శ. 1525 నాటి ఎడపాటి ఎఱ్ఱన ‘శృంగార మల్హణ చరిత్రము’ ద్వితీయాశ్వాసంలోని 128-వ పద్యం గుర్తుకు వస్తుంది. ఉభయపద్యాలను సూక్ష్మంగా చదివినప్పుడు ‘కళావిలాసము’ కర్త నన్నెచోడుడు ఎడపాటి ఎఱ్ఱన పద్యాన్ని అనుకరించినట్లు కనబడుతుంది.

మరొకటి, బాలతో మన్మథాగమవేత్త అయిన పాంచాల జాతి విటుని ప్రథమసురతాన్ని వర్ణించే పద్యం:

**మ. అమితస్వచ్ఛ మచుంబితాధర మపూర్వానంగవిద్యాసురం**
**గ మదంతక్షతకంఠ మగ్రహణకక్షాస్థానయుగ్మం బనిం**
**ద్య మహేయం బవలంబనాంకురితరోమాంచంబు బాలాంగనా**

**గమసంభోగము నింపు సొంపు విటలోకప్రీతి గాకుండునే.కళా. (ప. 14)**

(మిక్కిలి నిర్మలమైనది, ఇంకా ముద్దుగొనని కెమ్మోవిని కలిగినది, అంతకు మునుపు మన్మథసుఖానుభవపరిచయం లేని రతిరాజద్వారం కలది, గ్రీవాపురోభాగాన దంతక్షతం సోకనిది, బాహుమూలయుగళాన్ని దగ్గరికి తీసికొనటం ఎరుగనిది, ఎటువంటి అపవాదుకు దారితీయనిది, ఎన్నటికి వదులుకోరానిది, తాకినంత మాత్రాన నిలువెల్లా గగుర్పొడిచేది అయిన యుక్తవయస్కురాలైన కన్యతోడి తొలిపొందు యొక్క ఆ అనురక్తి, ఆ సౌందర్యయుక్తి విటలోకానికి ప్రీతిపాత్రం కాకుండా ఉండగలదా?)

పద్యమైతే అమోఘంగా ఉన్నది. “అమితస్వచ్ఛము” అన్న పై ఉపక్రమణం యతిప్రాసలకోసం కాదు. ఆమెతోడి పొందు “రోగరహితమైనది” అని ధ్వని. “బాలా+అంగనా+ఆగమ” అనటం వల్ల ఆమె పద్మిని, అందగత్తె, యౌవనోచితమైన వపుర్విజృంభణ కలిగినది, మన్మథాగమకోవిదురాలు, అనురక్త అని భావం. “విటలోకప్రీతి” అంటే పాంచాలుడు ఆ ఇంపుసొంపులను తన సహచరులకు ప్రీతికరంగా వినిపించాడని ధ్వనితార్థం.

“విటలోకానికి ప్రీతిపాత్రం కాకుండా ఉంటుందా?” అన్న సంవాదధోరణి మూలాన ఈ పద్యంకూడా కామశాస్త్రపాఠ్యాంశంలోనిది కాదనిపిస్తుంది. కామశాస్త్రమైతే ప్రాకరణికం లేదు. అది శాస్త్రబోధసరణి కాదు. కావ్యగతమే కాగలదు.

దీనితో కొంత పోలిక కలిగిన రచన క్రీస్తుశకం 1760 నాటి అయ్యలరాజు నారాయణామాత్యుని ‘హంసవింశతి’లో గోపవనిత మంజుల జారశేఖరునితో రహస్యంగా కూడినప్పటి సన్నివేశంలో ఉన్నది:

**మ. అసమాలాప మచుంబితాధర మశయ్యాన్యోన్యవిక్రీడితం**
**బసమాలింగన మస్థిరోత్సవ మధైర్యస్తంబతాంబూలితం**
**బసుదంతాంక మనిర్భయం బమణికం బస్రస్తనీవ్యాదికం**
**బసిధారావ్రతమైన చోరరతికార్యం బప్డు సంధించినస్.(2-108)**

రెండింటిలోనూ ప్రథమపాదంలో ఒకేచోట “అచుంబితాధరము” అన్న పదబంధం సమానంగా ఉండటమూ, ప్రకరణసామ్యమూ గమనార్హాలు. అయితే, కృతకమైన నారాయణామాత్యుని చిత్రణకంటె ఆపాతరమణీయమైన ‘కళావిలాసము’లోని పద్యమే రసవంతంగా ఉన్నది.

‘కళావిలాసము’ కావ్యమే గాని కామకళాగ్రంథం కాకపోవచ్చునని ఫలితార్థం.

**⌖ 6 ⌖**

## సంస్కృత కలావిలాస కథ

జీవితప్రతిబింబమే కావ్యమని విశ్వసించి, తాదాత్మ్యభావంతో తనచుట్టూ ఉన్నవారి అనుభవపరంపరను పరిశీలించి, సారవిచారం చేసి, కవిత్వాన్ని ఉపదేశాత్మకంగా దిద్దితీర్చిన మహాకవి క్షేమేంద్రుడు. కాశ్మీరదేశంలో ధర్మవృక్షానికి చీడ పొడమి ఆగమోక్తాలైన కర్మముల అనుష్ఠానం వల్ల, అననుష్ఠానం వల్ల కలిగే సుపరీత విపరీతఫలితాలను ప్రత్యక్షంగా చూసి, పతనావస్థలో ఉన్న జాతికి జ్ఞానమూలకమైన ఔచిత్యప్రస్థానాన్ని నిర్మించిన మహానుభావుడు. మహర్షితుల్యుడైన శ్రీమదభినవగుప్తపాదుల వద్ద ఇహపరవిద్యలను అభ్యసించి మోక్షపదం వెతుకులాటలో నిర్లిప్తతను వహింపలేక లోకజ్ఞుడై, లౌకికవ్యవహారాలలో పాల్గొన్న గొప్ప ఉపదేష్ట. సమకాలిక సాంఘిక రాజకీయపరిస్థితుల సద్విమర్శతో ప్రజోపయోగం నిమిత్తం ధర్మసూక్ష్మాలను కథాముఖంగా ఆవిష్కరించాలని తహతహలాడిన సంస్కర్తృశిఖామణి. సమస్తమానవగుణాదర్శకమైన దర్శనప్రతిభ, సర్వాంగసార్థకమైన వస్తునిర్మాణకౌశలం, ధర్మధ్వనిమనోజ్ఞమైన అభివ్యక్తిసౌందర్యం ఏకోన్ముఖంగా ప్రవహించిన త్రివేణీసంగమమే క్షేమేంద్రుని కావ్యప్రమితి.

కలావిలాసం క్షేమేంద్రుని లఘుకావ్యసంచయంలో సుప్రసిద్ధమైనది. వజ్రకఠోరమైన ఆయన విమర్శవాక్కు ఇందులో కోమలహాస్యపూర్ణంగా వెల్లివిరిసింది. కావ్యసౌందర్యసమాధాయకమైన వస్తుసామగ్రి ఎక్కడ కనుపించినా దానిని వేయిభంగుల వర్ణించాలనే కుతూహలం ఉన్నవాడు. అందుకు తగిన ఇతివృత్తాన్ని కూర్చుకొన్నాడు. సంఘానికి దూరవర్తిగా ఎక్కడో విద్యారణ్యంలో తలదాచుకొన్న ఏ జితేంద్రియుణ్ణో, తపోధనుణ్ణో, గురువునో, వేదాంతప్రవక్తనో నిలిపి నీతులను బోధింపకుండా చౌర్యకళలో ఆరితేరిన ధూర్తాగ్రణిని పట్టుకొచ్చి ధర్మోపదేశానికి పరికరించుకొన్నాడు. ఆ రోజులలో అటువంటి సాహసాన్ని చేయగల ధైర్యం ఎంతమంది కవులకుంటుంది?

మూలదేవుని ప్రసక్తి ఎలాగూ వచ్చింది కాబట్టి, నాలుగు మాటలు చెప్పాలి. ఇతను చౌర్యకళను అభ్యసింపగోరే విద్యార్థులకోసం ఒక పాఠ్యగ్రంథాన్ని నిర్మించాడట. కౌటల్యుడు అర్థశాస్త్రంలో దానిపేరు 'ఖరపటము' అని చెప్పాడు. అందులో దొంగలకోసం ఆ కళాప్రయోగతంత్రమంతా ఉపకరణము, ప్రమాణము, ప్రహరణము, ప్రఘూరణము, అవధారణము అని అయిదు ప్రకరణాలలో ఉన్నదట. మహేంద్ర విక్రమవర్మ మత్తవిలాస ప్రహసనంలోనూ, భాసుని పేరిట ప్రచారంలో ఉన్న దరిద్ర చారుదత్తంలోనూ ఇతని ప్రశంసలున్నాయి. తమిళ మలయాళ దేశవాఙ్మయాలలో ఇది 'కరవడమ్' అన్న పేరిట ప్రచారంలో ఉండేదనటానికి ఆధారాలున్నాయి. తరగతి గదిలో నేర్చుకొనేటప్పుడు మంత్రము, దైవము, ఔషధము, స్థితి, ప్రయుక్తి, దేశము, కాలము, ఉపకరణము అన్న ఎనిమిది ప్రయోగాలు బోధకు వస్తాయట. శూద్రకుని మృచ్ఛకటికంలో శర్విలకుడు చారుదత్తుని ఇంటిలో గోడకు కన్నం పెట్టినప్పటి వర్ణనమంతా ఖరపటానుసారమే అని వ్యాఖ్యాతలన్నారు. తండ్రి విడిచిపేసినందున తల్లి దగ్గర పెరిగినట్లుంది. కర్ణీసుతుడని ప్రసిద్ధి. శూద్రకుని పద్మప్రాభృతకంలోనూ, బాణభట్టు కాదంబరిలోనూ, దండి దశకుమారచరిత్రలోనూ, అవంతీసుందరీ కథలోనూ ఉన్న వర్ణనలను బట్టి ఇతని కీర్తిప్రతిష్ఠలు దేశవిదేశాల వ్యాపించినట్లు గుర్తింపగలము. కలాంకురుడు అనికూడా పేరున్నదట. భగవత్పతంజలి మహాభాష్యంలోనూ, సుబంధుని వాసవదత్తా కథలోనూ, బుధస్వామి బృహత్కథాశ్లోకసంగ్రహంలోనూ ఉన్న పర్యాయ ప్రస్తావనలను బట్టి ఇతని పుస్తకం ఆ రోజుల్లో చాలా ప్రచారంలో ఉండేదని ఊహించాలి. భోజుడు శృంగారప్రకాశంలో పేర్కొన్నాడు. మాహుకుని హారమేఖలను బట్టి ఇతను గొప్ప

శృంగారపురుషుడని తెలుస్తున్నది. మాహుకుడు చతుర్విధవిటులలో ఇతను 'భద్రుడు' అనికూడా చెప్పాడు. రాజపుత్త్రుడని కొందరంటారు. నందయంతి అనే బ్రాహ్మణస్త్రీని అపహరించి, పెండ్లాడిన ఉదంతాన్ని అవంతీసుందరీ కథలో దండి చెప్పాడు. ఇంతటి మహానుభావుడిని పట్టుకొచ్చి కథానేతగా నీత్యుపదేశానికి నిలపటం క్షేమేంద్రుని గడుసుదనం కాకపోతే మరేమిటి?

సంస్కృత కలావిలాసంలో పది సర్గలున్నాయి. మొట్టమొదటిది దంభాఖ్యానసర్గం. ఇందులో 96 శ్లోకాలున్నాయి. శ్రీపతి వక్షఃస్థలం వలె లక్ష్మీనిత్యపరిష్వంగమంగళాయతనమైన విశాలపురంలో సకలకళాకోవిదుడైన మూలదేవుడనే ధూర్తశిఖామణి ఉండేవాడు. ఒకరోజు మాధ్యాహ్నిక భోజనానంతరం అతని ఆస్థానికి హిరణ్యగుప్తుడనే వ్యాపారి తన కొడుకును వెంటబెట్టుకొని దర్శనార్థమై వస్తాడు. "అయ్యా! లేకలేక కలిగిన ఒక్కగానొక్క కొడుకు. అల్లారుముద్దుగా పెరిగాడు. యుక్తవయస్సు వచ్చింది. డబ్బున్నవాళ్ళ చుట్టూ ఎటువంటి అవ్యక్తులు చేరతారో మీకు తెలియనిది కాదు కదా. ఆ దుష్టులతో, వాళ్ళ వెంబడిని వచ్చే వారకాంతలతో నెగ్గుకొనిరావటం ఎలాగో నేర్పించటం నా వల్ల కాలేదు. ఆశ్రయాన్ని కోరి వచ్చినవారికి అభయాన్ని ప్రసాదించే మీరు తండ్రి వలెనే ఈ కుమారునికి లోకజ్ఞానాన్ని కలుగజేయాలి" అని వేడుకొంటాడు. మూలదేవుడు అందుకు అంగీకరిస్తాడు.

హిరణ్యగుప్తుడు వెళ్ళిన తర్వాత సాయంకాలం వ్యతీతమై అంధకారం నిండి తారాగణోదయం కాగానే మూలదేవుడు శిష్యులందరిని కూర్చుండబెట్టుకొని, చంద్రగుప్తుని చేరబిలిచి, "నాయనా! లోకమంతా కపటోపాయపరులతో నిండి ఉన్నది. సంపన్నుల వద్దకు శ్రీవశీకరణార్థం చేరే దాంభికుల వాస్తవస్వరూపం ఏమిటో నీకు తెలియజెబుతాను" అని, అతనికి దంభస్వభావాన్ని వివరిస్తాడు. శౌచపరులమని, వేదమూర్తులమని, సాధుపుంగవులమని ప్రచారాలు చేసుకొనే మోసగాళ్ళ కలరూపును విప్పిచెబుతాడు. ఎముకలుకొరికే చలిలో కూడా లోలోపల చీదరించుకొంటూనే, స్నానసంధ్యలు కానిచ్చి, నిలువుబొట్లు పెట్టుకొని మహాపూజలు నిర్వహిస్తున్నట్లు నటిస్తూ భక్తులమని జనాలను చేర్చే దొంగవేషగాళ్ళను దూరంగా ఉంచాలంటాడు. బ్రాహ్మణ్యంలో కుత్సితుల మోసాలను విప్పిచెబుతాడు.

పూర్వం బ్రహ్మదేవుడు చరాచరభూతసృష్టిని కావించిన పిమ్మట ఒకరోజు దివ్యదృష్టితో భూలోకవాసుల స్థితిగతులేమిటో ఆలోచించి, మానవులు ఋజువర్తనులై ధనార్జనాసక్తులుగా లేరని, భోగపరాఙ్ముఖత వల్ల ప్రజాతంతువృద్ధి నిలిచిపోయే ప్రమాదం ఉన్నదని గుర్తించి – ఈ దాంభికతను సృజించాడట. పూర్వం దేవతలకు కంటకంగా మారిన జంభాసురుడే దంభుడై మానవలోకంలో జన్మించి జీవకోటిని తన శక్తిమూలాన వశపరచుకొన్నాడు. అచిరకాలంలో ఆ శక్తి అందరినీ ఆవహించింది. ఒక్కొక్కళ్ళు ఆ వృత్తి, ఈ వృత్తి అనిలేక ఎట్లా మోసగాళ్ళయ్యారో, ఆ మోసాలెటువంటివో, వాళ్ళచేతి పనిముట్లేమిటో చెబుతాడు. ఒకప్పుడు ఋషివేషాన్ని ధరించి బ్రహ్మసభలోకి అడుగుపెట్టిన దంభుణ్ణి చూసి దేవర్షులే చకితులయ్యారట. చివరకు సాక్షాత్తు శ్రీమహావిష్ణువు కూడా అందుకు అతీతుడు కాదట.

**దమ్భవికారః పురతో వఞ్చకచక్రస్య కల్పవృక్షోఽయమ్**

**వామనదమ్భేన పురా హరిణా త్రైలోక్య మాక్రాన్తమ్.(1-96)**

(కపటోపాయమనే చిత్తవికారం కలిగిన మోసగాళ్ళందరికి ముంగిటి కల్పవృక్షం అయిన శ్రీహరి మునుపు వామనరూపాన్ని ధరించి మూడడుగుల నెపంతో మూడు లోకాలను ఆక్రమించాడు.)

అని బలిచక్రవర్తిని వంచించిన వామనుని మాట తెస్తాడు.

రెండవది లోభవర్ణనసర్గం. ఇందులో 89 శ్లోకాలున్నాయి. కిరాటుల (వర్తకుల) లోభగుణం పాపానికి ఎలా దారితీస్తుందో వర్ణింపబడింది. వంచన లన్నిటికి మూలం లోభగుణమే. ఒక అమాయకుడు తనవద్ద దాచుకొన్న పెద్దమొత్తాన్ని సొంతం చేసికొని అతను వచ్చి అడిగినప్పుడు లేదని మొండిచెయ్యి చూపిన పురపతి అనే సెట్టి కథను మూలదేవుడు చెబుతాడు. ఒకప్పుడు శుక్రాచార్యుడు బాలసఖుడైన కుబేరుణ్ణి కొంత ధనం అడిగాడట. కుబేరుడు ఉన్నా ఇవ్వనంటాడు. శుక్రునికి కోపం వచ్చి కపటోపాయంతో అతని సర్వస్వాన్నీ హరిస్తాడు. కుబేరుడు హరుని ప్రార్థిస్తాడు. హరుడు శుక్రాచార్యునికి నచ్చజెబుతాడు. ఎంతకీ తన మాట వినటం లేదని ఆగ్రహించి అతనిని పొట్టన బెట్టుకొంటాడు. శుక్రుడు గౌరిని సన్నుతింపగా ఆమె కరుణించి శుక్రుని బ్రతికిస్తుంది.

మూడవది కామవర్ణనాసర్గం. ఇందులో 76 శ్లోకాలున్నాయి. స్త్రీలు చేసే వంచనకృత్యాలు, ముగ్ధా ప్రౌఢాదుల స్వభావాలు, సముద్రదత్తుడనే వ్యాపారి పరపురుషాసక్త అయిన భార్యవల్ల ఎలా మోసపోయినదీ వివరింపబడింది.

నాలుగవది వేశ్యావృత్తం. ఇందులో 40 శ్లోకాలున్నాయి. మూలదేవుడు వేశ్యకాంతల కుటిలానురాగాన్ని వివరిస్తాడు. విక్రమసింహుడనే రాజుకు వేశ్యలంటే అమితాభిమానం. మంత్రికి వేశ్యలంటే సద్భావం లేదు. రాజు తన మంత్రికి ప్రత్యుదాహరణను చూపగోరి, విలాసవతి అనే అందగత్తెను రాణివాసానికి తెచ్చి, ఆమెను భోగభాగ్యాలలో ముంచెత్తుతాడు. కొంతకాలానికి ఆమె, "రాజా! విదర్భదేశంలో ఉన్న నా ప్రియునిపై చౌర్యాపనింద పడింది. అతనిని విడిపింపగలవని నీకు వశవర్తినిగా ఉన్నాను" అంటుంది. రాజు నివ్వెరపోయి, విదర్భపై దండెత్తి, ఆమె కోరికను నెరవేర్చి, వేశ్యావిముఖుడై వారి వర్తనలను గర్హించటం ఇక్కడి ఘట్టితాంశం. ఆ కాలంలో వేశ్యకాంతలు అభ్యసించే చతుష్షష్టి కుటిలకళల వివరాలు ఈ సర్గంలో ఉన్నాయి.

అయిదవది కాయస్థచరితసర్గం. ఇందులో 46 శ్లోకాలున్నాయి. మోహగుణపు స్వభావం, కాయస్థుల (గణకవృత్తిలో ఉన్నవారు) దుర్మోహం నిరసింపబడ్డాయి. కూటస్థులు (కొలువులో కాయస్థులకు తోడుగా మధ్యవర్తిత్వానికి కూర్చొన్న తీర్పరులు), కాయస్థులు సదా 'నకార'మనే సిద్ధమంత్రాన్ని (ఏదడిగినా, "అందుకు వీలులేదు, ఇందుకు నియమాలు ఒప్పుకోవు, ఇది సాధ్యం కాదు, అది రాజాజ్ఞకు వ్యతిరేకం" అని లాకేత్వమిచ్చి చెబుతుండటం) జపిస్తుంటారట. వారు చేసే మోసాల పట్టిక ఒకటున్నది.

ఉజ్జయినిలోని మహాకాళేశ్వర మందిరం వద్ద ధూర్తుడొకడు స్నానం చేసి, ఏమీ తోచక, నిర్మానుష్యంగా ఉన్న ఆ గుడిలో కూర్చొని శివునికి ఫలపుష్పాదులతో పూజచేస్తాడు. ఈశ్వరుడు దయతలిచి అతనికి వరమివ్వబోతాడు. ఆయన మెడలోని కపాలమాలికలోని ఒక పుర్రె అందుకు అడ్డుపడుతుంది. ఇంతలో ధూర్తుడు పూజవల్ల అలిసిపోయి మళ్ళీ

స్నానానికి వెళ్తాడు. అడ్డుపడిన పుర్రె శివునికి ఆ ధూర్తుని దుర్వర్తనను వివరిస్తుంది. శివుడు ఇవన్నీ నీకెలా తెలుసునని అడుగుతాడు. పూర్వం నేను మగధలో కాయస్థునిగా జన్మించి, మీ యందలి భక్తిఫలంగా మీ గళసీమ సన్నిధిసేవలో ఉన్నానని పుర్రె చెబుతుంది. ఏమి కులమో ఏమిటో! చచ్చి కైలాసానికి వచ్చినా పుట్టుకతో వచ్చిన బుద్ధి మాత్రం మారలేదని శివుడు నవ్వుకొంటాడు.

ఆరవది మదవర్ణనసర్గం. ఇందులో 33 శ్లోకాలున్నాయి. కృతయుగంలో ఇంద్రియజయాన్ని సాధించిన మహాత్ముల 'దమము' అనే శక్తి అక్షరాలు తిరగబడి 'మదము'గా మారి కలియుగంలో జనులను ఆవేశించిందట. మదవశుల దుర్వర్తనలు, మద్యలోలుర దుశ్చేష్టలు అన్నీ ఇన్నీ కావు. చ్యవన మహర్షి ఆశ్వినులకు సోమపానార్హతను కల్పించాడని తెలిసి, ఇంద్రుడందుకు నిరాకరిస్తాడు. ఋషికి కోపంవచ్చి ఇంద్రుని భుజాన్ని స్తంభింపజేసి కృత్యాజ్వరాన్ని ప్రయోగిస్తాడు. ఇంద్రుడు భయంతో కాళ్ళబేరానికి దిగాక చ్యవనుడు అతనికి పూర్వస్థితినిచ్చి, కృత్యను మదరూపంలో లోకులను ఆవేశించేందుకు వదిలిపేస్తాడు. ఆ మదమత్తుల మదాశ్రయస్థానాలు వివరింపబడ్డాయి.

ఏడవది గాయనవర్ణనసర్గం. ఇందులో 26 శ్లోకాలున్నాయి. గాయనీగాయనులంటే – ఆ రోజులలో నటవిటాదుల కోవలోనివాళ్ళు కదా – వట్టి దొంగలట. దొంగలు రాత్రిపూట రహస్యంగా దోస్తే ఈ కళాకారులు పట్టపగలే దోచుకొంటారట. కళ పేరిటి వారి నానా చిత్తవికారాలూ వర్ణింపబడ్డాయి. ఇంద్రుడు నారద మహర్షిని భూలోకంలోని విశేషాలేమిటని అడుగుతాడు. రాజులు ఇంద్రపదవి కోసం శతక్రతువులు చేసే ప్రయత్నాలలో ఉన్నారని నారదుడు చెబుతాడు. ఇంద్రుడు మండిపడి, యజ్ఞానికి  కావలసిన సాధనాలు లేకుండా వాళ్ళ మైమరపించి సంపదలను కొల్లగొట్టమని గాయన పిశాచాలను సృష్టించాడట.

రసజ్ఞుల హృత్తాపహారులనుకొనే కళాకారులను వట్టి విత్తాపహారులు గాను, సంగీత గాత్ర వాద్యకళలను కార్యాచరణపరుల "దృష్టి మరల్చే తంత్రాలు" గాను నిరూపించటం ఈ చిత్రణలోని గడుసుతనం.

ఎనిమిదవది సువర్ణకారోత్పత్తి సర్గం. ఇందులో 29 శ్లోకాలున్నాయి. కంసాలులు చేసే మోసాలన్నీ ఏకరువుకు వస్తాయి. పూర్వం మేరుపర్వతం ఎలుకల బాధ ఎక్కువై దేవతలకు మొరపెట్టుకొన్నదట. దేవతలు మేరుపర్వత బిలాలను మంత్రధూమంతో మూసి, ఎలుకలన్నింటినీ కాల్చివేశారు. ఆనాటి మూషిక జీవాత్మలే స్వర్ణకారులుగా జన్మించాయట.

తొమ్మిదవది నానా ధూర్తవర్ణన సర్గం. ఇందులో 73 శ్లోకాలున్నాయి. ధూర్తులు కనుకట్టు చేసి లోకులను వంచించే తీరుతెన్నులన్నీ ప్రస్తావనకు వచ్చాయి. జ్యోతిష్కులమని, రసవాదులమని, వశీకరణ విద్యలు తెలిసినవాళ్ళమని నమ్మినవాళ్ళను లోబరచుకొనే నీచుల నయవంచక మాయాకృత్యాలు ఎన్నెన్నో. వేలకొద్దీ ఉండే ఆ మాయలలోనూ అరవైనాలుగు ముఖ్యకళ లున్నాయట. వాటి వివరాలు చెప్పబడ్డాయి.

పదవది సకలకళానిరూపణ సర్గం. ఇందులో 43 శ్లోకాలున్నాయి. ధర్మపరులు అర్థకామాలను మోక్షాభిముఖంగా అనుష్ఠించి, జీవితాన్ని అందమైన కళగా ఎలా మలుచుకోవచ్చునో ప్రబోధించే ఉత్తమాధ్యాయమిది.

ఈ విధంగా లోకంలోని శుభాశుభావర్తనుల వాస్తవస్వరూపాన్ని శిష్యునికి విశదీకరించి, మూలదేవుడు ఇంటిలోనికి వెళ్ళిపోతాడు.

'కలావిలాసం' క్షేమేంద్రునికి అభిమానపాత్రమైన కావ్యం.

**కలావిలాసః క్షేమేన్ద్రప్రతిభామ్భోధినిర్గతః**
**శశీవ మనసానన్దం కరోతు సతతం సతామ్.(10-43)**

(క్షేమేంద్ర మహాకవి ప్రతిభ అనే పాలకడలి నుంచి వెలువడిన 'కలావిలాసం' షోడశకళాపూర్ణుడైన చంద్రుని వలె సతతం సత్పురుషులకు హృదయానందాన్ని కలిగిస్తుంది గాక!)

అని సగర్వంగా చెప్పుకొన్నాడు. ఆయన లోకవృత్తపరిశీలనం, వ్యవహారజ్ఞత, మానవవ్యక్తిత్వం లోని బాహ్యాభ్యంతరాల వైరుద్ధ్యదర్శనం, సర్వాంతర్వర్తనీయమైన దృష్టివైశిత్యం, సందర్భోచిత పదగుంఫన చామీకరత్వం ప్రశంసనీయమైనవి. అందువల్లనే 'కలావిలాసం' రుచిరహాస్యప్రియులు, పదకొండవ శతాబ్ది నాటి సంస్కారప్రియుల సంఘవిమర్శ భంగీభణితి ఏ ప్రకారం వెలసి విలసిల్లిందో తెలుసుకొనగోరేవారు తప్పక చదివి తీరవలసిన గ్రంథమని విమర్శకులు నిర్ణయించారు.

⌖ 7 ⌖

## ఆంధ్రకవులపై క్షేమేంద్రుని కలావిలాస ప్రభావం

ఎందుకో గాని, కలావిలాసం క్షేమేంద్రుని లఘుకృతులలో సమయమాతృకా దేశోపదేశ చతుర్వర్గసంగ్రహ దర్పదలన నర్మమాలాదుల వలె అంతగా ప్రసిద్ధికి రాలేదు. చారుచర్య తెలుగులో భాస్కర శతకాదుల లాగా మనస్సులకు హత్తుకొనిపోయే కేవలానుభవనీయమైన ఆకర్షణీయ దృష్టాంతావళితో కూర్పబడిన అద్భుతావహ రచనం. నిత్యకృత్యప్రబోధకంగా వెలువడిన భోజరాజేంద్రుని చారుచర్యా గ్రంథానికంటె ఇది కవితాపరిణతి మూలాన, లోకరీతీప్రకాశన మూలాన వేయిరెట్లు మెరుగు. పల్లెపట్టుల నుంచి ప్రజలు పట్నవాసాలకు తరలివచ్చి నాగరికతాలౌల్యానికి క్రేళ్ళురికిన రోజులలో అప్పనకవి తెలుగు పద్యానువాదం భోజరాజు కృతిని పాఠకలోకానికి మరింత సన్నిహితం చేసింది. అటువంటి అనువాదమొకటి అవతరింపనందువల్ల ఆ వెలుగులో క్షేమేంద్రుని కవిత సాయంకాలపు నీడవలె అంతర్హితమైపోయింది.

క్షేమేంద్రుని దశావతార చరిత్ర భారతమంజరీ రామాయణాలపై ఔత్తరాహకృతుల పరిచయం కలిగిన శ్రీనాథాదుల దృగంశువులు ప్రసరించాయి. లక్షణగ్రంథాలలో ఆయన ఔచిత్యవిచారచర్చా సువృత్తతిలక కవికంఠాభరణాలు మాత్రం దేశమంతటా పఠనపాఠనరూఢి కెక్కినట్లు తోస్తుంది. సనాతనమైన వేదధర్మానికి, అనూచానమైన శైవాచారానికి కాణాచి అయిన కాశ్మీరదేశంలో పరమ మాహేశ్వరస్వరూపుడైన అభినవగుప్తపాదుల వద్ద విద్యలను నేర్చి పండితకోటిలో

నిరుపమానకీర్తిని గడించిన ఆ మహావిద్వాంసుడు, ఆ మహాకవితల్లజుడు మతాభిప్రాయాల సంకుచితోపదేశాలకు లోగక విశాలహృదయంతో బౌద్ధవాఙ్మయం వైపుకు దృష్టిసారించి బౌద్ధావదానకల్పలతాదులను రచించి ఉండటం వల్ల నిన్నమొన్నటి వరకు అన్యప్రాంతాలలో వలె మన ఆంధ్రదేశంలోనూ సనాతన ధర్మపరులమనుకొనేవారు క్షేమేంద్ర కావ్యాధ్యయనాన్ని కొంత చిన్నచూపుతో చూడటం జరిగింది. ఆ సంకోచం తెలుగుసీమలో నిన్నమొన్నటిదాకా ఉండేదనుకొంటాను. ప్రత్యక్షంగా అనువాదకృత్యానికి పూనుకొనకపోయినా పూర్వకవుల బహుళ విద్యాధ్యయనానికి మాత్రం ఈ ప్రతిబంధకాలు అడ్డురాలేదేమో. క్షేమేంద్ర పారాయణికులలో అగ్రణీయుడైన మహాకవి శ్రీనాథుడు ఈ కవితాధర్మాన్ని పుణికిపుచ్చుకొనటమే గాక యథోచితంగా తత్తత్కృతులలోని భావభంగిని ఆంధ్రావళికి పరిచయం చేశాడు.

**పూర్ణాః కదర్యవణిజాః నిస్సమ్భోగా నిధానధనకుమ్భా**
**సీదన్తి కుచతటా ఇవ దుఃఖఫలా బాలవిధవానామ్.**

(లోభులైన దుష్టవర్తకులు భావిప్రయోజనంకోసం వంచనచేసి కూడబెట్టిన సంపదలు బాలవితంతువుల చన్నులవలె ఎందుకూ పనికిరాక కాలాంతరంలో అణగారిపోతాయి.)

అన్న కలావిలాస (2-18) శ్లోకార్థమే కాశీఖండం(3-8)లో,

**తే. అప్రయోజన మభివృద్ధి నతిశయిల్లు,**
**నప్రయోజన మడఁగు గాలాంతరమున,**
**నకట! యీర్ష్యాగ్రహగ్రస్తుఁ డైనయట్టి,**
**ఖలుని సంపద విధవ చన్నులునుబోలె.**

అని రూపాంతరితమయింది. "భగవన్! భవత శ్శాసన మమరేన్ద్రకిరీటకోటివిశ్రాన్తమ్" అన్న కలావిలాస (2-73) శ్లోకార్థమే శృంగారనైషధంలోని "దేవతాకోటికిరీటసంఘటితకోమలపాదసరోజ (1-3)" యుగార్చనకు ప్రత్యక్షమూలం కాకపోయినా, శబ్దసామ్యం అనుభవనీయమే. కలావిలాసం ద్వితీయసర్గంలోని "జానామి ***బాలమిత్రం*** త్వా మత్యన్తసంభృతస్నేహమ్" అన్న 44-వ శ్లోకస్థ శుక్రోదితాన్ని వింటున్నప్పుడు శ్రోతలకు శ్రీనాథుని హరవిలాసంలోని

**సీ. కమలనాభుని పౌత్రుఁ గవితామహారాజ్యభద్రాసనారూఢుఁ బరమపుణ్యుఁ**
**బాత్రు నాపస్తంబసూత్రు భారద్వాజగోత్రు సజ్జనమిత్రుఁ గులపవిత్రు**
**భీమాంబికా మారనామాత్య నందను నఖిలపురాణవిద్యాప్రవీణు**
**నధ్వర్యు వేదశాఖాధీతినిష్ణాతు నంధ్రభాషానైషధాబ్జభవుని**

**నుభయభాషాకవిత్వప్రయోగకుశలు**

**బాలసఖు గారవించి, తాత్పర్య మొప్ప**
**నవచిదేవయ త్రిపురారి యక్షరాజు**
**హితమితోక్తులు వెలయఁగ నిట్టు లనియె.హర. (1-8)**

**తే. ఆగమజ్ఞాననిధివి తత్త్వార్థఖనివి**
**బహుపురాణజ్ఞుఁడవు శుభభవ్యమతివి**
**బాలసఖుఁడవు శైవప్రబంధ మొకటి**
**యవధరింపుము నా పేర నంకితముగ.హర. (1-12)**

వంటి పంక్తులు స్మృతివిహాయసంలో తటిల్లతల వలె మెరుస్తాయి. “బాలమిత్రుడు” అంటే – “బాల్యమిత్రుడు” అని కాదు అర్థం. శుక్రాచార్యుడు వయస్సులో పెద్దవాడైనప్పటికీ, తనకంటె ఎంతో చిన్నవాడైన కుబేరుడితో స్నేహం చేశాడన్నమాట. “జానామి బాలమిత్రం త్వామ్” అంటే “నువ్వు పిల్లవాడిగా ఉన్నప్పటినుంచి స్నేహితుడివిగా ఎరుగుదును కదా, నిన్ను” అని భావం. “బాలసఖుఁడవు” అంటే హరవిలాస కృతిపతి అవచి తిప్పయ్య సెట్టి, కవిసార్వభౌముడు శ్రీనాథుడు చిన్నప్పటి నుంచి ఒక కంచంలో తిని ఒక మంచంమీద పడుకొన్న జిగిరీ దోస్తులని అర్థం కాదు. అవచి తిప్పయ్య సెట్టి వయస్సులో పదిహేను – ఇరవై యేళ్ళు పెద్దవాడైనప్పటికీ, తనకంటె ఎంతో చిన్నవాడైన శ్రీనాథునితో సమస్కంధునిగా స్నేహం చేశాడన్నమాట. క్షేమేంద్రప్రయోగమే శ్రీనాథునికి మార్గదీపకమని సులభంగానే ఊహింపగలము. క్షేమేంద్రుని కథానాయకుడు మూలదేవుడు ధూర్తశిఖామణి. మోసగాడు, జూదరి, విటుడు అన్నమాట. అయితేనేమి, మనసున్న మంచివాడు. క్షేమేంద్రునికి ఆభిమానికమైన ఈ “ధూర్త” శబ్దప్రయోగం శ్రీనాథుని గుండెలకు హత్తుకొన్నది. ఎన్నిమార్లు వాడుకొన్నాడో!

**ఉ. వాలికమోము మత్తవనబర్హికిశోరకలాస్యలీలఁ బై**
**వాలిచి పచ్చకప్పురపు వాసనతోడి ముఖారవిందతాం**
**బూలపు మోవి మోవిపయి మోపుచు రాధకు నిచ్చు *ధూర్తగో***
***పాలుఁడు ప్రోచుఁ గావుత* మపారకృపామతి మంత్రి యన్ననిన్.**

అని ‘భీమేశ్వర పురాణము’ (1-3). ఒక్క గోపాలుడేనా? పాపం, శ్రీదేవికి సైతం ఆ విశేషణం తప్పలేదు.

**గీ. *మందరాచల కందరా మధ్యమాన***
***దుగ్ధపాథోధిలహరికా ధూర్త యైన***
***లలిత సాహిత్య సాహిత్య లక్ష్మి* నొసఁగు**
**వరదయై మాకు వినతగీర్వాణి వాణి.**

అని కూడా 'భీమేశ్వర పురాణము' (1-3)లో అన్నాడు. పరీక్షగా చూసినవారికి ఇటువంటివి ఆంతరతమ్యాలు సంఖ్యాతీతంగా అగపడతాయి. "అర్థిభి రుపజీవ్యమానవిభవానామ్" అని కలావిలాసం (2-41). "అర్థిజనంబులకు నర్థంబులు గుప్పించియు" అని శ్రీనాథుని హరవిలాస (1-5) విలసితం.

కలావిలాసం ద్వితీయసర్గంలో కిరాటనిబర్హణం ఉన్నది. కిరాటుల లోభగుణం చెడునడతకు, పాపవర్తనకు ఎట్లా దారితీస్తుందో మూలదేవుడు చంద్రగుప్తుడికి వివరిస్తాడు. "త్రికరణశుద్ధిగా చిత్తవృత్తుల సంచారాన్ని నిగ్రహించిన తపస్వుల చేత, సత్త్వసంపన్నుల చేత, విధినిషేధరూపాలయిన శాస్త్రవిధులను గుర్తెరిగిన అనుష్ఠానపరుల చేత విడిచివేయబడిన లోభగుణం వెళ్ళి దుష్టులైన ఈ పాపవర్తకుల బుర్రల్లోకి దూరి కూర్చుంది. ఎంత కుటిలమనస్కులో వీళ్ళు" - "సత్త్వప్రశమతపోభిః సత్త్వధనైః శాస్త్రవేదిభి ర్వర్జితః, లోభోఽవటం ప్రవిష్టః కుటిలం హృదయం కిరాటానామ్" (2-3) అంటాడు. అత్యంత ప్రభావశీలమైన ఈ కిరాట నిందాప్రకరణాన్ని చదువుతుంటే పాఠకులకు బమ్మెర పోతన్నగారి కళంకిత కిరాటప్రభు నిందావాచనం గుర్తుకు వస్తుంది.

అసలు కథలో ఏమి జరిగిందో కాని, తన కృతిని రాజుకు సమర్పింపమని అడిగినప్పుడు పోతన్నగారి గుండెకు ఆ పలుకులు ములుకులై సోకాయట. ఒకరోజు పోతన్నగారి ఇంటికి వచ్చి శ్రీనాథుడు ఎక్కడ చూసినా దరిద్రదేవత ఇనుపగజ్జెలతో తాండవిస్తుంటే దిగులుపడి, "ఏమయ్యా, నీకు రాజదర్శనం చేయించి కృతిసమర్పణకు ఏర్పాట్లు చేయిస్తాను. సమస్త భోగభాగ్యాలు చేకూరుతాయి" అన్నాడని జనశ్రుతి. కాదు, రాజే స్వయంగా భాగవతకావ్యాన్ని తనకు ఇమ్మన్నాడని ఒక కథ. ఏమైతేనేమి, ఆ మాటను వినగానే పోతన్నగారికి తన ఉపాస్యదేవత కళ్ళముందు మూర్తికట్టినట్లయిందట. ఆమె కన్నులలో చిప్పిల్లుతున్న అశ్రువులను చూసి దుఃఖం పట్టలేకపోయాడట.

**ఉ. కాటుక కంటినీరు చనుకట్టు పయింబడ నేల యేడ్చెదో**
**కైటభదైత్యమర్దనుని గాదిలి కోడల! యో మదంబ! యో**
**హాటకగర్భు రాణి! నిను నాఁకటికిం గొనిపోయి యల్ల క**
**ర్ణాట కిరాట కీచకుల కమ్మఁ,ద్రిశుద్ధికి నమ్ము భారతీ!**

అని ఆ తల్లికి మాటయిచ్చాడు. "**నిను నాఁకటికిం గొనిపోయి యల్ల క, ర్ణాట కిరాట కీచకుల కమ్మఁ; ద్రిశుద్ధికి నమ్ము**" అన్న పాఠానికి మారుగా "నిను నాఁకటికిం గొనిపోయి హీన ద్ర, వ్యాట కిరాట కీచకుల కమ్మఁ; ద్రిశుద్ధికి నమ్ము భారతీ" అన్న పాఠాంతరం కూడా ఉన్నది. అది కలావిలాసానికి సన్నిహితంగా, భావయుక్తంగానే ఉన్నది కాని, "హీన+ద్రవ్యాట" అని కవికి అభిమతం కాని గురులఘువుల లేనిపోని కిట్టింపుతో సరిపెట్టుకోవాలి. "అల్ల క, ర్ణాట కిరాట కీచకులకు నిన్ను అమ్మను తల్లీ" అనటం ఆశుగతిలోని ధారాశుద్ధికి అనురూపంగా ఉన్నది.

కాటుక దిద్దిన సోగకన్నులనుంచి కన్నీరు చిప్పిల్లి ఆమె చనుగొండల మీదికి ఉరుకుతుంటే కవికి పర్వతసీమపై జలధారను వర్షిస్తున్న నీలమేఘం స్ఫురణకు వచ్చింది. "చనుకట్టు" అనక "చనుగట్టు" అని ఉన్నట్లయితే "పాలిండ్లనెడి ఎత్తైన పర్వతము" అని స్పష్టంగా ఉండేది కాని, రూపణలోని వ్యంగ్యవైభవం భగ్నమైపోయేది. "పాలిండ్లనెడి ఎత్తైన

పర్వతము" అన్న రూపణం వాచ్యమైనాక "నయనాంబుదం" అనికూడా మేఘయుక్తిని స్పష్టీకరింపక తప్పేది కాదు. అప్పుడు "కాటుక కంటినీరు" అన్న ప్రకాశ్యార్థానికి తావుండేది కాదు. మహాకవి కదా. రెండింటినీ వ్యంజింపజేశాడు. "మధుకైటభాసురులను మట్టుపెట్టిన మహావిష్ణువు కోడలివి" అనటమూ సాభిప్రాయమైన విశేషణమే. రూపకానుప్రాణితమైన పరికరాలంకారం. కిరాట కీచకుల సంహారశక్తి ఆమెయందు ఆరోపితమై, కవి శరణాగతికి స్ఫోరకత్వం సిద్ధించింది. ఆ కైటభదైత్యమర్దనుని నాభికమలమనే బంగారు కడుపున పుట్టినవానికి హృదయరాజ్ఞి ఆమె. తనకు మాతృమూర్తి. ఆమె దయకు నోచుకొన్న తనకిక సొమ్ములకేమి కొదవ! ఉదరపోషణ నిమిత్తం ఆ తల్లి స్వరూపమైన భారతీ వాక్కును కిరాటులకు కట్టబెట్టవలసిన అగత్యం తనకేమిటి? "నిను ఆఁకటికిన్ కొనిపోయి అల్ల క, ర్ణాట కిరాట కీచకులకు అమ్మను" అని సాకూతంగా అన్నాడు.

"అల్ల" అంటే, ఎక్కడో దూరాన ఉన్నవాళ్ళు. పద్యం  చెప్పినది భాగవత రచన కొనసాగుతున్నప్పుడో, కొసదాకా వచ్చినప్పుడో. క్రీస్తుశకం 1478-1480 ప్రాంతాల నాటి కథ. అప్పుడు విజయనగర రాజు విరూపాక్షరాయలు. ఓరుగల్లుకు విజయనగరం దూరదేశమే. విరూపాక్షరాయలు 1478 దాకా ఉన్నాడు. పరమనీచుడు. ఆ తర్వాత అతని కొడుకు నాలుగవ ప్రౌఢదేవరాయలు 1485 దాకా ఉన్నాడు. ఆ తండ్రీ ఈ కొడుకూ ఇద్దరూ కర్ణాటకీచకులు.

కిరాటులు అంటే మ్లేచ్ఛులు అని నైఘంటికార్థం. బహుమనీ సుల్తానులన్నమాట. కిరాతులు అన్నా మ్లేచ్ఛులనే భావం ఉన్నది కాని, "కర్ణాట కిరాట కీచకులు" అన్నప్పటి అనుప్రాసకు లోపం. "కిరాతో మ్లేచ్ఛభేదే స్యా ద్భూనిమ్బేఽల్పతనావపి" అని మేదినీ కోశం. కిరాతుడు అంటే మ్లేచ్ఛుడు, అల్పశరీరుడు, నేలవేము – అని. కిరాట శబ్దాన్ని నిఘంటువులు కొంత ఆలస్యంగా గుర్తించాయి. "ద్వే తు కిరాటః స్యా న్మ్లేచ్ఛే వణిజి చాపి" అని నానార్థార్ణవసంక్షేపం. కిరాటుడు అంటే మ్లేచ్ఛుడు అని, వ్యాపారి అని అర్థాలు. కిరాటకీచకులు అంటే బహుమనీ సుల్తానులు.

దుష్టత్వం కర్ణాటకీచకులకు, కిరాటకీచకులకు సమానధర్మం. నీవిచ్చిన ప్రసాదాన్ని ఆ దుష్టులకు తీసికొనివెళ్ళి అమ్మను – అని కవి వాగ్దానం. భాగవతంలో "ఇమ్మనుజేశ్వరాధములు" అన్నది కూడా ఈ కర్ణాట కిరాట కీచకులనే. పోతనగారి మనస్సులో నిలిచిన కిరాటకీచకులు క్షేమేంద్రుడు సాహిత్యంలో ప్రవేశపెట్టిన కుటిలకిరాటులే అన్నమాట మాత్రం స్పష్టం. "కీచక" శబ్దాన్ని బహుళ నిందావాచకంగా ప్రచారంలోకి తెచ్చినవాడు కూడా క్షేమేంద్రుడే. ఆ చందాన స్మృతినిక్షిప్తమైన శబ్దశిల్పాన్ని పోతన్న తన పద్యంలో సందర్భవిదర్భంగా సంయోజించాడు. క్షేమేంద్ర పారాయణికుడని చెప్పటానికి ఇంకేమి విశదిమ కావాలి!

క్షేమేంద్రుని కలావిలాసం ప్రథమసర్గంలో సుదీర్ఘమైన చంద్రోదయవర్ణనం ఉన్నది. క్షేమేంద్రుని ప్రకృతిదృశ్యదర్శనానికి, వర్ణననైపుణికి ఆస్కారం లభించిన సన్నివేశం అది. ఆహ్లాదకరమైన ఆ సమయంలోని కొన్ని రూపణలివి:

**గగనాఙ్గణకమలవనే సన్ధ్యారాగే గతే శనైః క్వాపి**

**అప్రాప్తస్థితివికలం బభ్రామ భ్రమరవిభ్రమం తిమిరమ్.(1-27)**

(సాయంకాలం గడిచి సంధ్యారుణకాంతులు సన్నగిల్లుతుంటే ఆకాశమండలంలోని కలువకొలనిలో నల్లతుమ్మెదలు దిక్కుతోచక నలుదెసలకు పరుగులుతీసినట్లు చిమ్మచీకటులు వ్యాపింపసాగాయి.)

**రజనీ రరాజ సితతరతారకముక్తాకలాపకృతశోభా.(1-29)**

(కాముకులకు రాగాతిశయాన్ని కలిగించే ఆ రజనీసమయం తెల్లని ముత్యాలదండల వంటి తారకాసముదాయంతో రంజకంగా రాజిల్లసాగింది.)

**మన్మథసితాతపత్రం దిగ్వనితాస్ఫటికదర్పణో విమలః.(1-31)**

(మదనుని తెల్లగొడుగువలె, అపరదిక్కు అనే వనిత చేతనున్న స్ఫటికపు అద్దం లాగానూ ...)

**గగనతటినీతటాన్తే రజనికరో రాజహంస ఇవ.(1-32)**

(ఆకాశగంగానదిలో నడయాడుతున్న రాజహంస వలె కానవచ్చాడు చంద్రుడు.)

ఈ చిత్రకల్పనలను యథాతథంగా స్వీకరించిన మహాకవి ధూర్జటి 'కాళహస్తి మాహాత్మ్యము' ద్వితీయాశ్వాసంలో గజరాజు శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో కొండమీది శివలింగం వద్ద తాను సమర్పించిన పూజాద్రవ్యాలను ప్రతినిత్యం నాశనం చేస్తున్న గూఢశత్రువును ఎదుర్కొనటంకోసం - ఎప్పుడు తెల్లవారుతుందా, ఎప్పుడు నేనక్కడికి చేరుకొంటానా - అని నిద్రాహారాలు లేక వేచి ఉన్న తరుణంలో కావించిన వర్ణనమిది:

**శా. తారాలోకమునం బ్రకాశమొక చందంబై ప్రసాదింప సం**
**ధ్యారాగావృతమై తమఃపటలసంతానంబు గప్పంగ ..."(2-129)**

**మ. గగనాహార్యమృగేంద్రశాబకము నక్షత్రాంబుజారణ్యమ**
**ధ్యగహంసంబు నిశావధూకరతలోద్యన్మల్లికాగుచ్ఛ మ**
**ధ్వగబాధావహచిత్తభూకటకయాత్రామౌక్తికచ్ఛత్త్ర మొ**
**ప్పు గతిం జంద్రుఁడు తోఁచె ..."(2-134)**

"సన్ధ్యారాగే గతే శనైః క్వాపి, అప్రాప్తస్థితివికలం బభ్రామ భ్రమరవిభ్రమం తిమిరమ్" అన్నదే, ఉన్నదున్నట్లుగా "తారాలోకమునం బ్రకాశమొక చందంబై ప్రసాదింప సం, ధ్యారాగావృతమై తమఃపటలసంతానంబు గప్పంగ ..." అని తెలుగులోకి వచ్చింది. "గగనాఙ్గణకమలవనే ... రజనికరో రాజహంస ఇవ" అన్నదే "నక్షత్రాంబుజారణ్యమ, ధ్యగహంసంబు" అయింది. "దిగ్వనితా ... మన్మథసితాతపత్రం" అన్న ప్రసిద్ధకల్పనను కార్యకారణానువర్తితంగా ధూర్జటి కవి "నిశావధూకరతలోద్యన్మల్లికాగుచ్ఛ మ, ధ్వగబాధావహచిత్తభూకటకయాత్రామౌక్తికచ్ఛత్త్ర మొ, ప్పు గతిన్" అని వ్రాశాడు. ధూర్జటి కరకమలాలలో క్షేమేంద్రకృతిప్రసూనం ఉన్న మాటను కాదనగలమా.

కలావిలాసమే గాక దేశోపదేశ నర్మమాలా సమయమాతృకాదుల నిత్యానుశీలనఫలితం ఆంధ్ర క్రీడాభిరామానికి వన్నెతెచ్చింది. మరి రావిపాటి త్రిపురాంతకుని ప్రేమాభిరామమే తత్ప్రభావితమేమో! అనటం గతజలసేతుబంధనమే అవుతుంది. "విటానాం కేలిపటహం తప్తతామ్రఘటోపమమ్, దధానం రోమమాలాన్తం స్థూలఖల్వాటకర్పరమ్ (సమయ. 1-10)", "మృజ్యమానస్య వైమల్యం తామ్రసఞ్జస్య నాన్యథా (సమయ. 5-23)" అన్నవి క్షేమేంద్రుని చిత్రకల్పిత సంకేతాలు. ఇవి ఇతరకవులు నిరూపించినవి కావు. రోమాలను తొలగించిన తర్వాత మదవతి మదనమందిరానికి తప్తతామ్రఘటం తోడి పోలిక క్షేమేంద్రునిది. అది చదువుకొన్న వల్లభరాయలు దానికి మెరుగులు దిద్ది, "కసటువోవఁగఁ దోమి కడిగి బోరగిలంగఁ బెట్టిన తామ్రంపు బిందెవోలె (క్రీడాభి. ప.80)" అని క్రీడాభిరామంలో 'సుసరభేత్' అన్న రోమసంహారిణి మందు ప్రభావనిరూపణకు ఉపస్కరించుకొన్నాడు. క్షేమేంద్రుని నర్మమాలా సమయమాతృకలనే చదువుకొన్న మరొక కవి కళావతీ శతక కావ్యకర్త తెళ్ళపూడి కసవరాజు. "పరస్పరప్రార్థనయా సుముణ్డితభగధ్వజౌ, భూకమ్పకారిణౌ, రాత్రౌ తౌ రణ్డాబ్రహ్మచారిణౌ (నర్మమాల. 3-39)" అని మొదలయ్యే శ్లోకాలలోని అశ్లీలవాచ్యతాదోషాన్ని తన కాలానుసారం సంస్కరించి, ఆ ప్రాకృతకాముకుల వర్ణనకు అప్రకృతవర్ణనతో ప్రకృతార్థాన్ని కవిప్రౌఢోక్తిసిద్ధంగా చమత్కరించి కసవరాజు, "ఆ కంజానన యుపరతి, కాకాశము వడఁకెఁ దార లటునిటు వడియెన్, జోకైన గిరులు గదలెను, భీకరమగు తమము చంద్రబింబముఁ గప్పెన్" అని రూపకాతిశయోక్తిని అభినందనీయంగా నిర్వహించాడు. కసవరాజు పద్యానికి ఇతరశ్లోకమూలాలు కూడా లేకపోలేదు కాని, ఆయన రూపించిన కళావతీ వృత్తాంతం సమయమాతృకాంతర్గతమని గుర్తింపనందువల్ల పరిష్కర్తలు, వాఙ్మయచరిత్రకాథికులు ఆ రచనలోని "గురుకుచకుంభముల్ గదలఁ గ్రొమ్ముడి వీడఁగ రాలఁ గ్రొవ్విరుల్, కరమణికంకణక్వణన కాచనగ (?) ధ్వను లుల్లసిల్లఁగా" మొదలైన పంక్తులలో ప్రశ్నార్థకాలను నిలుపవలసివచ్చింది. 'కాచము' అంటే గాజు. "ధాతువిశేషో వలయాది ర్యేన రచ్యతే" అని అమరకోశంలోని "కాచాః శిక్యమృద్భేదదృగ్రుజః" అన్న (3-3-28) శ్లోకానికి కృష్ణమిశ్రుని టీక. ఉపపతితో సంయోగవేళ నాయిక కళావతి చేతి గాజులు మహానగాలు ఊటాడుతున్నట్లు చప్పుడు చేశాయని భావం. ఇది సామాన్యార్థం. సమయమాతృకకు ప్రామాణికాలైన వ్యాఖ్యలేవీ ఆ రోజులలో వెలువడనందువల్ల అందులోని పెక్కు పదాలు నిఘంటువులలోని కెక్కకపోవడమూ, సుప్రమాతాలు కాకపోవడమూ సంభవించింది. "స్వభావభిదురః కాచసంజ్ఞ శ్చలనిరీక్షకః, శైలోఽపి గౌరవస్థాయీ హృదయాభావనీరసః" అని సమయమాతృక (5-26). అక్కడ క్షేమేంద్రుడు చెప్పిన ఎనభై రాగభేదాల స్వరూపం, ఈ కాచరాగస్వరూపం నాకు సరిగా బోధపడలేదు. సంగీత లక్షణగ్రంథాలలో కనబడలేదు. దానిని అన్వయించికొని కళావతీ శతకపద్యం అంతరార్థాన్ని పునఃపరిశీలించాలి. ఆ విధంగా కలావిలాసం ప్రతీతి, ప్రథిమ మనకు బోధపడతాయి. సమాజంలోని లోపజాతాన్ని తీవ్రమైన కంఠస్వరంతో విమర్శించిన ఆ దేశోపదేశ నర్మమాలాది కృతులతో పోలిస్తే కలావిలాసం కొంత వెలవెలపోయేమాట నిజమే. ఏమైతేనేమి, ఒకప్పుడు మధ్యయుగీనాంధ్రకవులకు అధీతిబోధల వల్ల సువిదితమైనప్పటికీ, ఆధునికకాలంలో మాత్రం ఉపేక్షా రాహుగ్రస్తమైన చంద్రబింబం వలె మరుగునపడిపోయింది.

1937లో క్రొత్తపల్లి సూర్యారావు గారు కలావిలాసానికి గుజరాతీ హిందీ భాషలలో వెలువడిన అనువాదాలను పరికించాక, సంస్కృతవిధేయంగా చక్కటి శైలిలో తెలుగులోకి వచనీకరించారు. 1968లో శ్రీ నరేంద్రనాథ సాహిత్యమండలి

వారు తణుకు నుంచి ప్రచురించిన ముళ్ళపూడి తిమ్మరాజు అభినందన సంపుటి 'సాహితీవాల్లభ్యము'లో సుగృహీతనామధేయులు ఈయుణ్ణి వేంకట వీరరాఘవాచార్యుల వారు 'మహాకవి క్షేమేంద్రకర్ణపూరము' అన్న పేరుతో సర్వార్థసమాకలనపూర్వకంగా ఒక మంచి వ్యాసాన్ని వ్రాశారు.

ఇంతమందిని ప్రభావితం చేసి, ఇన్ని విధాల మహనీయమైన క్షేమేంద్రకృతిని నన్నెచోడుడో మరొకరో తెలుగు చేయాలనుకోవటం సహజమే.

⌖ 8 ⌖

## నన్నెచోడుని ఆంధ్రీకరణ పైదగ్ధి

'కళావిలాసము' లోనిదిగా పెదపాటి జగన్నాథకవి 'ప్రబంధరత్నాకరము'లో "క. శ్రీమంతుఁడు గుణవంతుఁడు, ధీమంతుఁడు రూపయుతుఁడు ధీరుండుఁ గళా, ధాముండును గావలయును, దా మహిఁ గాముండు కామతంత్రవివేకీ" అని; శ్రీరామమూర్తిగారి ప్రత్యంతరంలో "క. శ్రీమంతుఁడు గుణవంతుఁడు, ధీమంతుఁడు రూపయుతుఁడు ధీరుండుఁ గళా, ధాముండును గావలయును, దా మహిఁ గాముకుఁడు కామతంత్రవివేకీ" అని ఉన్న పద్యానికి మూలం క్షేమేంద్రకృతిలోని లోభవర్ణనసర్గంలో కనబడుతుంది. కుబేరుడు తాను అడిగిన ధనాన్ని ఇవ్వలేదని ఆగ్రహించిన శుక్రాచార్యుడు మాయాప్రభావంతో అతని సర్వస్వాన్నీ హరిస్తాడు. ధూర్తుడైన శుక్రుడు మోసంచేశాడు. ఇల్లు గుల్లయింది. నేనిప్పుడు ఎవరితో చెప్పుకోవాలి? ఎక్కడికని తిరిగేది? ఏమి చేసేది? అని కుబేరుడు వాపోతాడు.

**ధనరహితం త్యజతి జనో జనరహితం పరిభవాః సమాయాన్తి**
**పరిభూతస్య శరీరే వ్యసనవికారో మహాభారః.**

(డబ్బులేనివాణ్ణి జనం వద్దువద్దని విడిచిపెడతారు. జనం తోడులేనివాడికి అవమానాలు వచ్చిపడతాయి. అవమానం పాలైనవాడికి దుఃఖభారం భరింపలేనిదవుతుంది.)

**దయితేషు శరీరవతాం బత ధర్మలతాలవాలేషు**
**ద్రవిణేషు జీవితేషు చ సర్వం యాతి ప్రయాతేషు.**

(శరీరధారులకు ధర్మమే మోక్షమూలం. ఆ ధర్మము అనే తీగెకు ఆలవాలమైనది డబ్బు. ఆ డబ్బును పోగొట్టుకొన్నాక జీవితంలో అన్నీ ఉన్నా ఏదీ లేనట్లే.)

**విద్వాన్ సుభగో మానీ విశ్రుతకర్మా కులోన్నతః శూరః**
**విత్తేన భవతి సర్వో విత్తవిహీనస్తు సద్గుణోఽప్యగుణః."(2: 54-7)**

(తెలివి కలవాడు, అందరికీ ఇష్టమైనవాడు, అభిమానవంతుడు, మంచి పనుల వల్ల పేరొందినవాడు, ఉత్తమకులంలో పుట్టినవాడు, గొప్ప పరాక్రమం కలవాడు – డబ్బున్నట్లయితే ఇవన్నీ అవుతాడు. డబ్బులేకపోతే ఎన్ని మంచి గుణాలున్నా ఏమీ లేనివాడే.)

అని గోడుగోడుమంటాడు. ఈ శ్లోకభావాలను మూడవదైన కామవర్ణనసర్గంలోనికి తీసికొనివెళ్ళి కామతంత్రంలో యుక్తాయుక్తాలు తెలిసిన వివేకవంతులు ఏ విధంగా వ్యవహరించాలో మూలదేవుడు శిష్యునికి బోధించిన సందర్భంలో కవి పరికరింపజేసికొన్నట్లు కనబడుతుంది. విత్తవాన్ = శ్రీమంతుడు, సద్గుణః = గుణవంతుడు, విద్వాన్ = ధీమంతుడు, సుభగః = రూపయుతుడు, శూరః = ధీరుడు మొదలైన శబ్దానువాదాలు అందుకు అనురూపంగానే ఉన్నాయి. “కాముండు” (మన్మథుడు) అన్న పాఠానికంటె “కాముకుఁడు” అన్న పాఠం మేలు. అయితే, కాముకుడైనవాడు శ్రీమంతుడు, గుణవంతుడు, ధీశాలి, రూపసి, ధైర్యవంతుడు, కళాకోవిదుడు కావాలని వక్త ఎవరో “కామతంత్రవివేకి” అయిన శ్రోతకు చెప్పటం సముచితంగా లేదు.  ఇవన్నీ ఉండటం వల్ల కాముకుడు సాఫల్యాన్ని పొందగలడన్న భావమూ అర్థవంతం కాదు. శ్రీమంతుడు కాని గుణవంతుడు, రూపవంతుడు కాని ధీరుడు కాముకులైతే సంభవించే సాధ్యాసాధ్యపరిణామాలను వక్త ఊహించలేదని తెలుస్తూనే ఉన్నది. ఇది ప్రబోధలక్షణం కాదు. ఇంతకంటె, మూలానుసారం

**క. శ్రీమంతుఁడు గుణవంతుఁడు, ధీమంతుఁడు, రూపయుతుఁడు, ధీరుండుఁ, గళా**
**ధాముండును గా వెలయును, దా మహిఁ గాముకుఁడు కామతంత్రవివేకీ.**

అని చదువుకొంటే - శ్రీమంతుడైనవాడికి తక్కిన ఆ గుణాలన్నీ స్వయంగానే సమకూడుతాయన్న అర్థం వస్తుంది. “కాన్ వెలయును” అంటే గుణవంతుడు కాకపోయినా గుణవంతుని గానూ, ధీశాలి కాకపోయినా ధీశాలి గానూ భాసిల్లగలడని ఉద్దేశం. మూలంలో రెండవ సర్గంలో కుబేరుడు శంఖాది నిధులతో ఈ మాటలన్నట్లుగా ఉన్నది. కామలోభాదియుక్తుడు శ్రీమంతుడైతే చాలు; అన్నీ ఉన్నట్లే. శ్రీ లేకపోతే ఏమీ లేనట్లే – అని కుబేరుని దుఃఖాలాపంగా కవి ఈ ప్రసంగాన్ని మలిచి ఉంటాడు. మూడవదైన కామవర్ణన సర్గంలోనూ కవి దీనిని సందర్భోచితంగా ప్రవేశపెట్టి ఉండవచ్చును. అందువల్ల ఇది ‘కళావిలాసము’లోని పద్యమే అని మనము నిశ్చయింపవచ్చును.

‘కళావిలాసము’లో ఈ పద్యాన్ని జక్కన చూశాడో, లేక జక్కన రచననే మన కవి చూశాడో కాని, సర్వశః దీనికి పర్యాయకృతమైన పద్యం ఒకటి జక్కన ‘విక్రమార్కచరిత్రము’లో ఉన్నది:

**క. శ్రీమంతుఁడు కులవంతుఁడు, శ్రీమంతుఁడె సుభగరూపజితకంతుఁడు సూ**
**శ్రీమంతుఁడె గుణవంతుఁడు, శ్రీమంతుఁడె సిద్ధశేముషీమంతుండుస్.(2-175)**

నిజానికి జక్కన పద్యం క్షేమేంద్రుని శ్లోకానికి అచ్చపు అనువాదంలా అమరింది. తెలుగులో ఎవరి రచన  ఎవరికి ఆధారమో అన్నట్లుగా రెండు పద్యాలూ ఉన్నాయి.

@ ... @

ఇక, రామకృష్ణకవిగారు 'ప్రబంధరత్నాకరము'లో నుంచి 'కళావిలాసము' లోనిదిగా ఉదాహరించిన -

**క. తలపోయఁగ రుచు లాఋను, గలుగును; వాతంబుఁ గ్రిమియుఁ గఫముం జెడు; నాఁ**

**కలివుట్టు; దగయుఁ జెడుఁ ద, మ్ములము పదార్థంబు రాగమూలము ధరణిన్."**

అన్న పద్యం విషయం మరింత ఆసక్తిదాయకం. 'కలావిలాసం' మూడవ సర్గంలో సముద్రదత్తుడనే వ్యాపారి పరపురుషాసక్త అయిన భార్య వసుమతి వల్ల మోసపోయిన కథ ఉన్నది. భర్త నిద్రించే దాకా వేచి ఉండి, అనుకొన్న సమయానికంటె ఆలస్యంగా వసుమతి ఉపపతికోసం ఉద్యానవనానికి బయలుదేరుతుంది. ఒక దొంగవాడు ఆమె ధరించిన ఆభరణాలపై కన్నువేసి ఆమెను వెంబడిస్తాడు. తోటలో ప్రియుడు ఆమె ఇక రాదని నిరాశచెంది చెట్టుతీగలతో ఉరిపోసుకొని ఆత్మహత్య చేసుకొంటాడు. ఆమె అక్కడికి వచ్చి జరిగినదంతా గ్రహించి, అతని శవాన్ని దగ్గరకు తీసికొని ముఖాన్ని తొడపై పెట్టుకొని, తాంబూలపు రక్తిమ నిండిన పెదవులతో అతని నోట్లో నోరుపెట్టి ఊపిరిపోసే ప్రయత్నం చేస్తుంది. ఆ శరీరగంధానికి ఆకర్షితుడై చెట్టుమీది బేతాళుడు అతని శరీరంలోకి ప్రవేశించి ఆమె ముక్కు కొరుకుతాడు. నెత్తురోడుతున్న ముఖంతో ఆమె ఇంటికి వెళ్ళి, భర్త తనపై చెయ్యిచేసుకొన్నాడని ఇంట్లోవాళ్ళకు చెబుతుంది. కుటుంబపెద్దలు రాజుకు ఫిర్యాదు చేస్తారు. సముద్రదత్తుడికి శిక్ష పడుతుంది. ఇదంతా చూస్తూ ఉన్న దొంగ ముందుకు వచ్చి, జరిగిన కథను వివరించి, ఘటనాస్థలంలో బేతాళుడు కొరికిన ముక్కును చూపించి, అమాయకుడైన భర్తను విడిపింపజేస్తాడు. ఆ సన్నివేశంలో క్షేమేంద్రుడు వ్రాసిన శ్లోకం ఇది:

**సా తస్య వదనకమలం నిజవదనే మోహితా కృత్వా**

**తామ్బూలగర్భ మకరోత్ ప్రకటితసాకారరాగేవ.(3-68)**

(ఆమె మోహవివశురాలై అతని ముఖపద్మాన్ని తన మోముదమ్మి చెంతకు చేర్చి, తన మనసులో నిండిన అనురాగం వెల్లడయేట్లు తాంబూలపు రక్తిమ నిండిన పెదవులతో ముద్దుపెట్టుకొని ఊపిరులద్దే ప్రయత్నం చేయసాగింది.)

చౌర్యరతాసక్త అయిన కాముకి ప్రేమను, నిస్సహాయతను, కర్తవ్యవిమూఢతను, భయాందోళనను చిత్రీకరింపవలసిన ఈ సన్నివేశంలో ఆంధ్రీకర్త తాంబూల లక్షణాలను వివరించే వస్తుగుణదీపిక వంటి పద్యాన్ని ప్రవేశపెట్టడం ఔచిత్యభంజకమని సందేహించేవారు ఇది రసవదర్థప్రకాశకమైన కావ్యార్థం కాదని గుర్తుంచుకోవాలి. సాక్షాత్తు ఔచిత్యసిద్ధాంతనిర్మాత రచనను అనువాదం చేస్తున్న కవికి ఆ మాత్రం తెలియదని ఊహించలేము. కనుక ఇది ఉద్దేశపూర్వకంగా నివిష్టమే అని, "ప్రకటితసాకారరాగేవ" – "త, మ్ములము పదార్థంబు రాగమూలము ధరణిన్" అన్న తుల్యశబ్దసందర్భాన్ని బట్టి గ్రహించాలి.

ఇంతకీ, 'కళావిలాసము' కావ్యార్థం మాటెలా ఉన్నా - ఈ పద్యానికి కవి స్వీకరించిన ఈ మూలాన్ని పరిశీలింపవలసి ఉన్నది:

**తామ్బూలం కటుతిక్త ముష్ణమధురం క్షారం కషాయాన్వితం**
**వాతఘ్నం కృ(క్రి)మినాశనం కఫహరం దుర్గన్ధినిర్ణాశనమ్**
**వక్త్రస్యాభరణం విశుద్ధికరణం కామాగ్నిసన్దీపనం**
**తామ్బూలస్య సఖే! త్రయోదశగుణాః స్వర్గేపి తే దుర్లభాః.**

ఇది క్రీస్తుశకం 18-వ శతాబ్ది నాటి 'తాంబూలమంజరి' అన్న సంకలనగ్రంథం లోనిది. తాంబూలంలోని ద్రవ్యనికరపు గుణాలేమిటో అభివర్ణింపబడుతున్నది. 1) కటువు (కారం), 2) తిక్తము (చేదు), 3) ఉష్ణము (వేడిమి), 4) మధురము (తీపి), 5) క్షారము (ఉప్పన), 6) కషాయము (వగరు) అన్న ఆరు రుచులతో అన్వితమైనది; 7) వాతఘ్నము (వాయురోగాన్ని పోగొట్టేది), 8) కృమినాశనం (కడుపులోని పురుగులను తొలగించేది), 9) కఫహరము (శ్లేష్మాన్ని హరించేది), 10) దుర్గంధినిర్ణాశనం (చెడువాసన లేకుండా చేసేది), 11) వక్త్రస్య ఆభరణం (ముఖానికి అలంకారప్రాయమైనది), 12) విశుద్ధికరణం (ముఖములోని, శరీరంలోని మలినాలను కడిగివేసేది), 13) కామాగ్నిసందీపనం (వాజీకరణశక్తి మూలాన ఆకలిని, భోగశక్తిని వర్ధిల్లజేసేది) అన్న త్రయోదశ (పదమూడు) సద్గుణాలను కలిగిన తాంబూలంలోని గుణాల వంటి గుణాలున్నాయే, ఓయి మిత్రమా! స్వర్గానికి వెళ్ళినా దొరికేవి కావు సుమా – అని భావం. ఆ సంధాత దీనిని ధన్వంతరి శ్లోకమని ఉదాహరించాడు. ఇదే శ్లోకం తత్తత్సందర్భోచితంగా ఇతర సంకలనాలలోనూ కొద్దిపాటి వ్యత్యాసంతో కనబడుతుంది.

**తామ్బూలం కటుతిక్త ముష్ణమధురం క్షారం కషాయాన్వితం**
**వాతఘ్నం కృమినాశనం కఫహరం దుర్గన్ధినిర్ణాశనమ్**
**వక్త్రస్యాభరణం విశుద్ధికరణం కామాగ్నిసన్దీపనం**
**తామ్బూలస్య సఖే త్రయోదశగుణాః స్వర్గేపి తే దుర్లభాః.**

అని క్రీస్తుశకం 1746 కి మునుపటిదైన ప్రముఖ ఆయుర్వేదగ్రంథం 'యోగరత్నాకరము'లోనూ, 1557 నాటి పురుషోత్తమ హరిదాసు 'ప్రస్తావరత్నాకరము'లోనూ, ఉన్న పాఠం. ఇదే,

**తామ్బూలం కటుతిక్త ముష్ణమధురం క్షారం కషాయాన్వితం**
**వాతఘ్నం కృమినాశనం కఫహరం కామాగ్నిసన్దీపనమ్**
**వక్త్రస్యాభరణం విశుద్ధికరణం దుర్గన్ధినిర్ణాశనం**
**తామ్బూలస్య సఖే త్రయోదశగుణాః స్వర్గేపి తే దుర్లభాః.**

అన్న స్వల్పభేదంతో 1524కు మునుపటిదైన శివదాసుని 'జ్యోతిర్నిబంధము'లో ఉన్నది. ఈ శ్లోకమే,

**తామ్బూలం కటుతిక్త ముష్ణమధురం క్షారం కషాయాన్వితం**
**వాతఘ్నం కఫనాశనం కృమిహరం దుర్గన్ధినిర్ణాశనమ్**
**వక్త్రస్యాభరణం విశుద్ధికరణం కామాగ్నిసన్దీపనం**
**తామ్బూలస్య సఖే త్రయోదశగుణాః స్వర్గేపి తే దుర్లభాః.**

అన్న రూపంతో క్రీస్తుశకం 1683కు కొంత మునుపటిదైన 'ధన్వంతరి నిఘంటువు'లోనూ, 1450 నాటి నరహరి కృతమైన 'రాజనిఘంటువు'లోనూ ఉన్నది.

క్రీస్తుశకం 1258 నాటి జల్హణుని 'సూక్తిముక్తావళి'లో ఈ శ్లోకమే,

**తామ్బూలం కటుతిక్త ముష్ణమధురం క్షారం కషాయాన్వితం**
**వాతఘ్నం కఫనాశనం కృమిహరం దుర్గన్ధినిర్ణాశకమ్**
**స్త్రీసంభాషణభూషణం రుచికరం శోకస్య విచ్ఛేదకం**
**తామ్బూలస్య సఖే త్రయోదశగుణాః స్వర్గేపి తే దుర్లభాః.**

అన్న పాఠంతో కనుపిస్తుంది. జల్హణుని శ్లోకం తాంబూల గుణపంక్తిలో స్త్రీ సంభాషణ వేళ సాలంకృతిని, ఔషధయుక్తికి రుచిని, తన్మూలకంగా శోకవినాశనాన్ని నిరూపిస్తున్నది. ఆ తర్వాతి రోజులలో తాంబూల సేవనం పురుషులకే గాక స్త్రీలకు కూడా విధాయకమైనందున స్త్రీపురుషులకు ఉభయతారకంగా "స్త్రీసంభాషణభూషణం" అన్న పాఠం ఉన్న చోట "వక్త్రస్యాభరణం" అన్న విస్తృతార్థం ఏర్పడి ఉండటం సహజమే. నిజానికి "శోకస్య విచ్ఛేదకం" అన్న కవితాత్మకత, సందర్భోచితి రెండూ లేని విశేషణయుక్తి కంటె "కామాగ్నిసన్దీపనం" అన్న పాఠం తర్వాతి రోజులలో చేరిన మేలిరూపమని సులభంగానే ఊహింపగలము.

వీటన్నిటినీ పరికించినప్పుడు కళావిలాస కర్తకు జల్హణుని ప్రాచీన పాఠశ్లోకంతో పరిచయం లేదని, క్రీస్తుశకం 15-16 శతాబ్దుల నడిమి కాలంలో వెలసిన శ్లోకపాఠమే పరిచితమని స్పష్ట మవుతుంది. విమర్శకులు ఇది జల్హణుని శ్లోకం కావచ్చునేమో అనికూడా సందేహించారు. జల్హణునిది అయినా, కాకపోయినా శ్లోకపాఠం కళావిలాస కర్తకు ఆధారకల్పం కాదన్న మాట స్పష్టమే. జల్హణుని తర్వాతి కాలంలో ఈ శ్లోకం రూపాంతరాన్ని సంతరించుకొని ఆయుర్వేద ప్రకరణ గ్రంథాలకెక్కింది. ఆయుర్వేద గ్రంథకర్తలలో పెక్కుమంది దీనిని ధన్వంతరి నిఘంటు కర్త రచించిన శ్లోకమనే భావించారు. ఆయుర్వేద ప్రకరణ గ్రంథాలలోని ఈ శ్లోకమే కళావిలాస కర్తకు ఆంధ్రీకరణవేళ ఉపకరించింది. కాకపోతే "స్త్రీసంభాషణభూషణం, శోకస్య విచ్ఛేదకం" అన్న ఉపయుజ్యాలను తప్పక వాడుకొనేవాడే. సంస్కృతంలోని "1) కటు 2) తిక్తం 3) ఉష్ణ 4) మధురం 5) క్షారం 6) కషాయాన్వితం" అన్న పంక్తిని సంక్షేపించి, "తలపోయఁగ రుచు లాఱును, గలుగును" అని వ్రాశాడు. "వాతఘ్నం కృమినాశనం కఫహరం" అన్న 16-వ శతాబ్దికి పూర్వతరం కాని ఆధునిక పాఠమే, "వాతంబుఁ గ్రిమియుఁ గఫముం జెడు" అని తెలుగులోకి వచ్చింది. ఆ వెంటనే ఉన్న "కామాగ్నిసన్దీపనం" అన్న పాఠం రాగమూలకతతోడి వ్యంగ్యాన్ని సంతరించికొని "ఆఁకలి వుట్టు" అయింది. వాజీకరణాన్ని, శరీరవిశుద్ధికారకత్వాన్ని

బోధించే "విశుద్ధికరణం" అన్న దళానికి యథాతథంగా "దగయుఁ జెడు" అని భావవ్యక్తిని కూర్చాడు. "తామ్బూలం ... కామాగ్నిసన్దీపనం" అన్న దళాలకు ఉపక్రమించి, "తమ్ములము రాగమూలము" అని తెలుగుచేశాడు. భోజరాజు 'చారుచర్య'లో నిర్దేశించిన

**మనసో హర్షణం శ్రేష్ఠం రతిదం మదకారణమ్**
**ముఖరోగహరం హృద్యం దీపనం వస్తిశోధనం**
**ముఖశుద్ధి (?) కృమిహరం తామ్బూలం శ్రీకరం పరమ్.**

మొదలైన లక్షణాలు అప్పన మంత్రి తెలుగుసేత మూలాన పాఠకులకు సుపరిచితాలే కనుక వాటి చర్చను ఇక్కడ ప్రసక్తించటం లేదు. కళావిలాస కర్తకు భోజరాజు రచన ఆదర్శకం కాదని చెప్పటం మాత్రమే ఇక్కడి విషయం. ఈ శ్లోకాలన్నింటికి మూలమైన వరాహమిహిరుని 'బృహత్సంహిత' గంధయుక్తి ప్రకరణంలోని "కామం ప్రదీపయతి రూప మభివ్యనక్తి, వక్త్రసుగన్ధితా చ, ఊర్జం కరోతి కఫజాంశ్చ నిహన్తి రోగాన్, తామ్బూల మేవ మపరాంశ్చ గుణాన్ కరోతి" అన్న శ్లోకం కూడా కళావిలాస కర్తకు ఆధారం కాదన్నమాట.

## @ ... @

ఇక, పెదపాటి జగన్నాథకవి "భద్ర దత్త కూచిమార పాంచాలులు" అన్న శీర్షికతో 'కళావిలాసము' నుండి ఉదాహరించిన

**చ. ... ... ... ... ... ... ...**
**... ... ... ... ... ... ...**
**... ... ... ..ట్టి యతం డరుదేరఁ గాంచియుం**
**దడవకయుండ నెప్పటి విధంబని కౌఁగిటఁ జేర్చ నంతటన్.**

అన్న పద్యానికి మూలం క్షేమేంద్రుని కలావిలాసంలో పైని ఉదాహరించిన "తలపోయఁగ రుచు లాఋను, గలుగును" అన్న పద్యానికి మూలమైన కామవర్ణనసర్గంలోనే ఉన్నది. సముద్రదత్తుడు వివాహానంతరం కొంతకాలం అత్తవారింట విందులందుకొని అక్కడినుంచి వ్యాపారనిమిత్తం ద్వీపాంతరానికి వెళ్లాడు. భార్య వసుమతి కట్టుతప్పి ఒక నవయువకునితో ఇష్టభోగాలను అనుభవిస్తుంటుంది. కొన్నాళ్ళకు సముద్రదత్తుడు భార్యను చూడాలన్న ఉత్కంఠతో ఇంటికి తిరిగి వచ్చి ఎప్పటి వలె అనుకొని ఆమెను దగ్గరకు తీసికొంటాడు. ఆమె ప్రియునిమీది వలపు మూలాన పెడమొహంతో ఉంటుంది. ఆ సందర్భంలో క్షేమేంద్రుడు –

**తత్ర స మధుమదవిలులితలోచనకమలాం ప్రియాం సమాలిఙ్గ్య**(3-46)

(మధువు త్రాగినప్పటి మత్తువల్ల తేలిపోతున్న కనుదమ్ములు గల ప్రియురాలిని అతడు కౌగిట హత్తుకొన్నాడు.)

అని వ్రాసినదే, తెలుగులో "అతండు (సముద్రదత్తుడు), అరుదేరన్ = చెంతకు రాగా, కాంచియున్ = ఆ వసుమతి అతనిని చూసికూడా, తడవక+ఉండన్ = స్పృశింపక పెడమోముతో ఉండగా, ఎప్పటి విధంబు+అని = తమ తొలిపొందు నాడు సిగ్గుపడినట్లుగానే జంకుతో ఉన్నదని, కౌఁగిటన్ చేర్పన్ = కౌగిలిలో హత్తుకొనగా, అంతటన్ = అప్పుడు (తర్వాతి పద్యంతో అన్వయం)" అన్న యథాతథమైన రూపాన్ని పొందింది. ఆ సమయంలోనే ఆంధ్రీకర్త పతియందు అనుక్తురాలైన ప్రియకాంత వర్తనగా ఈ క్రింది పద్యాన్ని నిలిపి ఉంటాడు:

**చ. తొడవులు పెట్టు, సంభ్రమముతోఁ దిలకించు, మడుంగు గట్టు, పైఁ**
**బడఁ దడవోప, దిం పెఱిఁగి పట్టుడు నేర్పులు గట్టిపెట్టుఁ, బ**
**ల్కెడునెడఁ దొట్రుపా టొదవుఁ, గింకకు జేగుఱు మై జెమర్పఁగాఁ**
**జిడిముడిఁ బొందుఁ గాంత పతి చేరినఁ గూరిమి గల్గె నేనియున్.**

ప్రియానురక్త అయిన కాంత పతి సన్నిధిలో ఉన్నప్పటి భావలక్షణాన్ని వర్ణిస్తున్న పద్యమిది. ఇవి రెండూ 'కళావిలాసము' లోనివే. "భద్ర దత్త కూచిమార పాంచాలులు" అన్న శీర్షికను తొలగించి చదువుకోవాలి.

ఆంధ్రవిశ్వకళాపరిషత్తు వారి గ్రంథాలయంలో D. 705 (M. 326) సంఖ్యతో 'ఛందోగ్రంథము' అన్న పేరిట ఉన్న వ్రాతప్రతిలో క్షేమేంద్రుడనే నామాంతరం కలిగిన తెలుగు కవి లక్కాభట్టు రచించిన 'శతపక్షిసంవాదము' లోనిదిగా ఈ పద్యం ఉన్నది:

**శా. నీవీబంధము వీడు; మోవి యదరున్; నేత్రంబు లల్లాడుఁ; జన్**
**గ్రేవల్ గానఁగవచ్చుఁ; గ్రొమ్ముడి విరుల్ పృథ్వీస్థలిం జెందు; స**
**ద్భావాగారము లోను చెమ్మగిలుఁ; జిత్తం బుత్తలం బొందు; నా**
**నావిభ్రాంతులు పుట్టు నింతులకుఁ జెంతన్ వింతవా రుండినన్.**

పైని ఉదాహరించిన "తొడవులు పెట్టు, సంభ్రమముతోఁ దిలకించు" అన్న కళావిలాస కర్త పద్యమూ, ఈ శతపక్షిసంవాద కావ్యకర్త పద్యమూ ఆత్మీయసన్నిధిలో అనురక్తుల దేహమనోగతులు, బాహ్యాభ్యంతరాల సంచారిభావాల అభివర్ణనలే అయినా, ధారాశుద్ధి మూలాన నన్నెచోడుని రచనకంటె లక్కాభట్టు రచన కొంత ఆకర్షణీయంగా అమరిన మాట నిజం. నన్నెచోడుని రచనలోని సూచ్యార్థసూచకత్వం మరింత ధ్వనిబంధురతను సంతరించికొని గంభీరంగా అలరారుతున్నది.

@ … @

'ప్రబంధరత్నాకరము'లో పెదపాటి జగన్నాథకవి 'కళావిలాసము' లోనిదిగా ఉదాహరించిన మన్మథస్తుతిపరకమైన పద్యం ఇది:

**సీ. పృథుల విశ్వంభరారథమున కెదురుగాఁ బూన్పించె నెవ్వాఁడు పువ్వుఁదేరు**
**కాంచనాచల కార్ముకమునకు సాటిగాఁ జేపట్టె నెవ్వాఁడు చెఱకువిల్లు**
**నవిరళ పాశుపతాస్త్రమునకు వాఁడి మిగిలించె నెవ్వాఁడు చిగురుఁదూపు**
**నతులితామర దానవాదిబలంబుల గెలిపించె నెవ్వఁ డ య్యళిబలంబు**

**నట్టి జగజెట్టి మన్మథుం డఖిలలోక**
**ములకు వెఱగొంగ జీవుల మూలకండ**
**యతని యిలుఁ జొచ్చి వెడలనియతఁడు గలఁడె**
**యతని యమ్ములఁ బడకున్నయదియుఁ గలదె.**

తెలుగు సాహిత్యంలో అద్భుతావహమైన రచనగా పలువురు విమర్శకులచేత పరిపరి ప్రశంసలను పొంది ప్రసిద్ధికెక్కిన పద్యం ఇది. ఇంతకంటె 'ప్రబంధరత్నాకరము' వ్రాతప్రతిలో ఉన్న పాఠం మేలైనదిగా అగుపిస్తుంది. కవిగారు దీనిని వ్రాసుకొన్నప్పుడు కొన్ని మార్పులు వచ్చి ఉంటాయి. 'ప్రబంధరత్నాకరము'లోని పాఠం ఇది:

**సీ. పృథుల విశ్వంభరారథమున కెదురుగాఁ బూన్పించె నెవ్వాఁడు పువ్వుఁదేరుఁ**
**గాంచనాచలకార్ముకమునకు సాటిగాఁ జేపట్టె నెవ్వండు చెఱకువిల్లు**
**నవిహతపాశుపతాస్త్రమ్మునకు వాఁడి మిగిలించె నెవ్వాఁడు చిగురుఁదూపు**
**నతులితామరదానవాది(?)బలంబుల గెలిపించె నెవ్వఁ డ య్యళి(?)బలంబు(?)**

**నట్టి జగజెట్టి మన్మథుం డఖిలలోక**
**ములకు వెఱగొంగ, జీవుల మూలకంద**
**మతని యిలుసొచ్చి వెడలనియతఁడు గలఁడె?**
**యతని యమ్ములఁ బడకున్న యతఁడు గలఁడె.**

ఇందులో ఎత్తుగీతిలోని "జీవుల మూలకండ" అన్న అపపాఠం తొలగిపోయింది. సీసచరణంలో "నవిరళపాశుపతాస్త్రమ్మునకు వాఁడి మిగిలించె నెవ్వాఁడు చిగురుఁదూపు" అన్నప్పటి లోపం పరిష్కరింపబడింది. "అవిరళ" అన్నప్పుడు అర్థం లేదు. అవిహతమైన = తిరుగులేని, పాశుపతాస్త్రము అన్నది అర్థవంతం. ఎత్తుగీతి అమితస్ఫూర్తిమంతం గానూ, అమోఘం గానూ అమరింది. అయితే రెండు పాఠాలలోనూ సీసం నాలుగవ చరణంలో "అతులితామరదానవాదిబలంబుల గెలిపించె నెవ్వఁ డ య్యళిబలంబు" అన్న అపపాఠం మాత్రం అట్లాగే ఉండిపోయింది. "గెలిపించె నెవ్వఁ డ య్యళిబలంబు" అన్నప్పుడు ల – ళ లకు ప్రాసయతి ప్రాచీనం కాదని, అదీ గాక అప్రశస్తమని భావించేవారు "గెలిపించె నెవ్వఁ డ య్యలిబలంబు" అని దిద్దుకోవచ్చును. "అతులితామరదానవాదిబలంబుల" అన్నదానికి అన్వయం లేదు. అతులిత = సాటిలేని, అమర = దేవతలు, దానవాది = రాక్షసాదులైన, బలంబులన్ = బలాలను అన్న తర్వాత, "గెలిపించె నెవ్వఁ డ య్యలిబలంబు" అంటున్నాడు. దేవదానవులు యుద్ధం చేసినప్పుడు

తుమ్మెద సైన్యం ఎవరికి తోడ్పడింది? మన్మథుడు ఎవరిని గెలిపించాడు? అమరదానవాదులకు యుద్ధం జరిగినప్పుడు ఆ బలాలలో ఒకటైన అమరబలాన్ని అళిబలం గెలిపించినదన్న అన్వయం సాధ్యం కాదు.

"అతులితామరదానవాదిబలంబులన్ గెలిపించెను ఎవ్వఁడు ఆ అలిబలంబున్" అన్నది ఏ మాత్రం దిద్దటానికి వీలులేని స్థితిలో ఉన్నది. "అతులితామరదానవారిబలంబులన్ గెలిపించెను ఎవ్వఁడు ఆ అలిబలాన" అని దిద్దుకొని, అతులిత = సాటిలేని, అమర = మృత్యువు లేని, దానవారిబలంబులన్ = దేవసైన్యాలను, ఆ = ప్రసిద్ధమైన, అలిబలాన = తుమ్మెదసైన్యంతో, ఎవ్వఁడు = ఏ మన్మథుడు, గెలిపించెను = గెలిపించాడో – అని దిద్ది సరిపెట్టుకోవాలి. మృత్యువు లేని దానవారిబలాలను మన్మథుడు కాపాడవలసి రావటమూ భావ్యమైన చిత్రణ కాదు. అందువల్ల అమల (నిర్మలులైన) దానవశత్రుసైన్యాలను అని పఠించటం మేలు.

పద్యప్రతిపాదితార్థాన్ని కూడా మరికొంత విమర్శించి చూద్దాము. మన్మథుడు పృథుల విశ్వంభరా రథానికి ఎదురుగా పువ్వుతేరును ఎప్పుడు పూన్పించాడు? పరమశివుని చేతిలోని మేరుపర్వత కాంచన కార్ముకానికి సాటిగా ఇక్షుకోదండాన్ని ఎప్పుడు చేపట్టాడు? ప్రత్యామ్నాయం లేని పాశుపతాస్త్రానికి పదును తగ్గే తీరున తన పుష్పాయుధాన్ని ఎప్పుడు సంధించాడు?

సతీదేవి దక్షయజ్ఞంలో పితృతిరస్కృతయై అవమానభారంతో యోగాగ్నిదగ్ధ అయిన తర్వాత పరమేశ్వరుడు హిమగిరికి వెళ్ళి తపోదీక్షితుడై ఆత్మయోగంలో ఉన్నాడు. తారకాసుర వధ నిమిత్తం దేవతలు పార్వతీపరమేశ్వరులకు దాంపత్యాన్ని ఘటించి, వారికి కలిగే కుమారుని అమరసైన్యాధ్యక్షునిగా నిలపాలని ఉద్యమించారు. ఫాలనేత్రునికి తపోవిఘ్నాన్ని కలిగించే సాహసం ఎవరికీ లేకపోయింది. దేవేంద్రుడు మన్మథుని లోకరక్షార్థమై శివదీక్షను భగ్నం చేయమని కోరాడు. అప్పుడు మన్మథుడు తన పరివారంతో వెళ్ళి పరమశివుని ఎదుట నిలిచాడు. ఇది పద్యసందర్భం.

అంతర్ముఖుడై ఉన్న పరమశివుని మనస్సులో వికల్పాన్ని కల్పించి మన్మథుడు తన అస్త్రాలను బయటికితీశాడు. అంతే కాని సాయుధుడై ఉన్న పరమశివుని ఎదిరించలేదు. దేశౌచితి, కాలౌచితి, సమయౌచితి, సందర్భౌచితి లేని శబ్దాడంబరం తప్ప సార్థకత లేని కల్పనం ఇది. కావ్యాదిని అవతారికలో ప్రసక్తమైన మన్మథస్తుతి అయితే అనౌచిత్యాపాదకమే.

సీసం నాలుగవ చరణంలో మన్మథుడు దేవదానవ బలాలను అళిబలంతో గెలిపించిన ప్రస్తావన ఉన్నది. అళిబలంతో గెలిపించినది దేవబలాన్నే కాని దానవబలాన్ని కాదు. అమల దానవారిబలాలను అని దిద్దుకొంటే, అది పరమేశ్వరుని మన్మథుడు ఎదుర్కొన్న సన్నివేశానికి స్ఫోరకం.

పరమేశ్వరుడు విశ్వంభరా రథాన్ని అధిరోహించి, మేరుపర్వతాన్ని వింటిగా చేతబూనినది త్రిపురాసుర సంహారసమయం. ఆ తర్వాత మళ్ళీ అటువంటి ఘటన జరుగలేదు. పూర్వం ఒకనాడు ఆ మహాకార్యాన్ని నిర్వహించిన మహాదేవుడు వేరొక తరుణంలో తపోదీక్షితుడై ఉన్నవేళ మన్మథుడు ఆయన యెదుట నిలిచాడు. అప్రకృతమైన ఆ

ఘట్టితాంశాన్ని మూడు పాదాలకు సాగించి, ఆ తర్వాత ప్రకృతార్థాన్ని ప్రతిపాదించటం మహాకవిత్వలక్షణం అనుకోలేము.

ఈ పద్యశిల్పాన్ని పోలిన పద్యం ఒకటి తెనాలి రామకృష్ణకవి 'పాండురంగ మాహాత్మ్యము'లో ఉన్నది. పంచమాశ్వాసంలో శివుడు తనకు విష్ణువు సిద్ధమంత్రాన్ని ప్రసాదించాడని నారదునికి చెబుతాడు. నారదుడు ఆ మంత్రాన్ని తనకు ఇమ్మని అడుగుతాడు. శివుడు దానిని ఉపదేశించి, ఇట్లా అంటాడు:

నారదా! సర్వప్రదాయకమైన సిద్ధమంత్రం ఇది. సిద్ధేశ్వర నామంతో నువ్వు ఉంటున్న దక్షిణద్వారం వద్ద ఈ మంత్రాన్ని జపించేవారికి కోరిన కోరికలు నెరవేరుతాయి. పూర్వం బలరాముడు శ్రీకృష్ణుని ద్వారా ఈ మంత్రరహస్యాన్ని గ్రహించి అభీష్టసిద్ధులను పొందాడు. రుక్మిణీదేవి ఈ మంత్రాన్ని జపించటం వల్లనే మన్మథుని కొడుకుగా పొందగలిగింది. మన్మథుడు పూవుటమ్ములతో మూడు లోకాలను జయించటానికి ఈ మంత్రబలమే కారణం.

ఈ సందర్భంలో తెనాలి రామకృష్ణకవి వ్రాసిన పద్యాలివి:

**సీ. బలభిదారామసంభవలతాంతశ్రేణిఁ బన్నుము నాకొక్క చిన్నతేరుఁ**
**గాళి కెంగేలి చిల్కలరాజుఁ గొనితెచ్చి నా వెంట బడివాగె నడవఁ బనుపు**
**గగనచరద్రాశిగణవర్తి మకరంబు బిరుదుటెక్కెముగ వేగిర మొనర్పు**
**మదనగోపాలుండు మా తండ్రిచే నాకుఁ జెఱకుచే మలిపించు కఱకువిల్లు**

**వనజహితు వేఁడి తమ్మితూపునకుఁ దెమ్ము**
**దివ్యములఁ గాని సాధింపఁ దీర దీశు**
**నంబ! నీ వంచు రుక్మిణి నట్టునిట్టుఁ**
**దిగుచు శైశవచాపలార్థితుఁడు మరుఁడు.పాండురంగ. (5-125)**

**క. సరసిజభవ వర వాయు, స్ఫురితములై త్రిపురదహనములు త్రిజగములన్**
**బురికొని నీరస యవసాం, కుర సఖముగ నేర్చె ము న్నకుంఠితశక్తిన్.పాండురంగ. (5-127)**

రామకృష్ణకవి పద్యశిల్పం, కల్పన కళావిలాస కర్త పద్యానికి మూలాలని తెలుస్తూనే ఉన్నది. "బలభిదారామసంభవలతాంతశ్రేణిఁ బన్నుము నాకొక్క చిన్నతేరు" - "పృథుల విశ్వంభరారథమున కెదురుగాఁ బూన్పించె నెవ్వాఁడు పువ్వుఁదేరు"; "మదనగోపాలుండు మా తండ్రిచే నాకుఁ జెఱకుచే మలిపించు కఱకువిల్లు" - "కాంచనాచలకార్ముకమునకు సాటిగాఁ జేపట్టె నెవ్వండు చెఱకువిల్లు" వంటివి ఎత్తుగడలలోని సామ్యాలు. మన్మథుడు అసమర్థమైన సాధనసంపత్తితో అసాధారణమైన కార్యసాధనకు ఉపక్రమించటం అన్నది కూడా ఉభయరచనలలోనూ సమానంగానే ఉన్నది. మన్మథుడు ఈశ్వరుని ఎదుర్కొనవలసి రావటమే ఇద్దరి రచనలోనూ లక్ష్యార్థం. రామకృష్ణకవి

చిత్రణలో మరుడు శైశవచాపల్యంతో పలుకుతున్నవాడు. అయినా, దివ్యసాధనాలు ఉంటేనే గాని ఈశ్వరుని సాధించటం సాధ్యం కాదన్న అభిజ్ఞానం ఉన్నవాడు. కళావిలాస కర్త దానిని వ్యంజింపజేశాడనుకొన్నా తాద్రూప్యంతో కల్పనను కొనసాగించలేక తబ్బిబ్బుకు లోనయ్యాడు.

@ … @

ఇక, పెదపాటి జగన్నాథకవి ‘కళావిలాసము’ లోనిదిగా చెప్పకపోయినా రామకృష్ణకవిగారు నన్నెచోడుని ‘కళావిలాసము’ లోనిదిగా గ్రహించిన పద్యాన్ని గురించి కొంత చర్చింపవలసి ఉన్నది.

**చ. లలనలు కొందఱాత్మపతులం దగఁగూడినచెయ్వులన్నియుం**

**దలఁచి సఖీజనంబులకుఁ దప్పకచెప్పెడు వారు పుణ్యజీ**

**వులు చెలి యామినీశుని కవుంగిలి డాయుటె కాక తాల్మికి**

**ల్దొలఁగిన తీరుగీరు నటదోపవు నాకు రతిప్రయోగముల్.**

పైని పేర్కొన్నట్లు, ‘ప్రబంధరత్నాకరము’ వ్రాతప్రతిలో ‘కళావిలాసము’ లోనిదని, శ్రీరామమూర్తి గారి ప్రత్యంతరంలో భాస్కరుని ‘శృంగార రత్నాకరము’ లోనిదని ఉన్న పాఠం ఇది:

**చ. లలనలు గొందఱాత్మవరులం దమకూడిన చెయ్వులన్నియున్**

**దలఁచి సఖీజనంబులకుఁ దప్పక చెప్పెడువారు పుణ్యజీ**

**వులు చెలియా మదీశుని కవుంగిలి డాయుడు నాకు వల్పురే**

**ల్దొలఁగు టెఱుంగఁబోలు నటఁ దోఁపవు మీఁద రతిప్రయోగముల్.**

ఆంధ్రవిశ్వకళాపరిషత్తు వారి గ్రంథాలయంలో D. 705 (M. 326) సంఖ్యతో ‘ఛందోగ్రంథము’ అన్న పేరిట ఉన్న వ్రాతప్రతిలో ఇది ‘కళావిలాసము’ లోనిదిగా కాక, భాస్కర ప్రెగ్గడ రచించిన ‘రసాలంకారము’ లోనిదిగా ఉదాహరింపబడిన పాఠం ఇది:

**చ. లలనలు గొందఱాత్మవరులం దమకూడిన చెయ్వులన్నియున్**

**దలఁచి సఖీజనంబులకుఁ దప్పక చెప్పెడువారు పుణ్యజీ**

**వులు చెలి యామినీశుని కవుంగిలి డాయుడు నాకు వల్పురే**

**ల్దొలఁగు టెఱుంగఁబోలు నటఁ దోఁపవు మీఁద రతిప్రయోగముల్.**

వీటన్నిటిని సమన్వయించితే, పద్యరూపం ఇలా ఉంటుంది:

**చ. లలనలు గొంద ఱాత్మవరులన్ దమకూడిన చెయ్వు లన్నియున్**

**దలఁచి సఖీజనంబులకుఁ దప్పక చెప్పెదువారు పుణ్యజీ**
**వులు; చెలియా! మదీశుని కవుంగిలి డాయుడు నాకుఁ దాల్మి కీ**
**ల్దొలఁగు టెఱుంగఁబోలు; నటఁ దోఁపవు మీఁద రతిప్రయోగముల్.**

ప్రాకృతంలోని 'గాథాసప్తశతి' శ్లోకానికి అనువాదం ఇది. ప్రియవల్లభునికి తనయెడ గల రాగాతిశయాన్ని తలచుకొని పరవశిస్తున్న ఒకానొక నాయిక తన సవతులను నిందిస్తూ చెలికత్తెలతో అంటున్న మాటలివి.

**ణీసాసుక్కమ్పిఅపులహఏహిఁ జాణన్తి ణచ్చిఉ ధణ్ణా**
**అహ్మారిసీహిఁ దిట్ఠే పిఅమ్మి అప్ప వి వీసరిఅ. గాథాసప్తశతి (4-61)**

**ఛాయ: (నిఃశ్వాసోత్కమ్పితపులకితై ర్జానన్తి నర్తితుం ధన్యాః**
**అస్మాదృశీభి ర్దృష్టే ప్రియే ఆత్మాపి విస్మృతః.).**

విమర్శకులు గుర్తింపని విశేషం కాబట్టి వివరణ అవసరమవుతున్నది. ప్రియుని సన్నిధిలో సాత్త్విక భావోదయం కలిగి నిట్టూర్పులకు, గాత్రకంపానికి, గగుర్పాటుకు లోనైనప్పటికీ నర్తింపగలవాళ్ళున్నారే, ధన్యురాండ్రు సుమా! నాలాంటివాళ్ళ మాటేమిటంటావా, ఆయన కనబడితే చాలు, నన్ను నేను మైమరచిపోతాను కదా – అని గాథార్థం. తనను తాను నిందించికొంటున్న నెపంతో సపత్నులను అభిశంసిస్తున్నది నాయిక. సపత్నుల నాట్యప్రదర్శన వారి పారవశ్యలోపం వల్లనే అని, నిజంగా వారు ధన్యురాండ్రు కారని భావం. నిఃశ్వసితమూ, గాత్రవిభ్రమం, రోమాంచం వారి నాట్యప్రదర్శనలో భాగమే కాని, అనుభూతివిశేషద్యోతకం కాదని విమర్శ. వారెంతటి నర్తనకళావిశారదలు అయినా, తన ప్రేమాతిశయం ముందు వారి ప్రేమ దిగదుడుపేనని ఉత్కర్ష. తన ప్రేమకు కారణం నాథుడు తనకు వశుడై ఉండటమే అని ధ్వని. ఇది మూలంలోని గాథ విషయం.

తెలుగులో ఆ విషయం కొంత వ్యాఖ్యాతమయింది. "నర్తనము" అన్న క్రియ "వర్తనము"గా మారింది. సపత్నులు తమ వల్లభునితో జతకూడినప్పటి విశేషాలను అరమరిక లేక చెలిమికత్తెలకు మనసువిప్పి చెప్పుకుంటారు. ఓ చెలీ! నాకు నాథుని కౌగిలిలో కరిగిపోవటమే తెలుసు. ఆ పైని రతిప్రయోగాలు, సురతవిలాసాలు ఆ మైమరపులో నాకు తెలియనే తెలియవు – అని నాయిక అంటున్నది. మూలంలోని సవతులు నాథుని యెదుట నర్తించటం మాత్రమే జరిగింది. వీళ్ళు తిరిగివచ్చి సఖీజనానికి చెప్పుకొంటున్నారు. పారవశ్యలోపంతోపాటు లజ్జాపరిత్యాగం కూడా చిత్రితమయింది. తనకు "కవుంగిలి డాయుడు" = వల్లభుని సమీపించి, ఆయన కౌగిలిలోనికి హత్తుకొనే వేళకే శరీరం అదుపుతప్పింది. అంతగా తనను ప్రేమిస్తున్నాడని అతిశయాన్ని పొందింది.

సపత్నులయందు సకళంకత్వం ఆరోపింపబడుతున్నది. అందువల్ల తన కళంకరహితమైన శీలవ్యక్తి ప్రతిపాదింపబడింది. సపత్నులు సఖీజనానికి చెప్పిన విషయం తన చెవికెట్లా సోకినదీ ఆమె చెప్పలేదు. ఏ చెలియతో ఈ మాట అంటున్నదో ఆమెద్వారా శ్రుతపూర్వమని ఊహించాలి. నాథుని ప్రేమ తనకు, సవతులకు అనుభవంలోని

విషయమే అయినా, వారి మైమరపు లేమి అన్న హేతుసామాన్యం అనుపాదానమైంది. అది ఆమె ఆక్షేపానికి విషయం. సవతుల అపకర్ష నిమిత్తంగా తన ఉత్కర్షను వెల్లడిస్తున్నది. వ్యతిరేకం అపకర్ష వల్ల ప్రతిపాదితమై ఆ వైధర్మ్యం ఆమె ఉత్కర్షకు హేతువయింది. ఆక్షిప్తిరూపమయిన వ్యతిరేకాలంకారం అన్నమాట.

"అత్ర తా అధన్యా, వయం తు ధన్యా ఇతి వ్యతిరేకాలఙ్కారః వ్యఙ్గ్యః" అని గంగాధర టీక. వ్యతిరేకాలంకారం వంగ్యమని ఆయన నిరూపణ.

'గాథాసప్తశతి' లోని ఈ ప్రాకృతగాథ భోజరాజు 'శృంగారప్రకాశము'లో ఉదాహృతమై ఉన్నది. తెలుగు కవి దీనిని భోజుని రచన నుంచి కూడా గ్రహించి ఉండవచ్చును.

వల్లభదేవుని 'సుభాషితావలి'లోని ఈ క్రింది శ్లోకాన్ని చూడండి:

**సత్యం తథా న విదితః సురతోపచారః**
**సజ్జన్తి యేన పురుషా ఇహ కామినీనాం**
**దత్తః కరశ్చ దయితేన మమోపనామి**
**సఖ్యై క్షపామి యది కిఞ్చిదపి స్మరామి.(శ్లో. 2141)**

ఇది సర్వశః గాథాహృదయాన్ని ఆవిష్కరిస్తున్న కేవలానుసరణమని స్పష్టంగానే తెలుస్తున్నది. పోలికయితే ఉన్నది కాని, నిఃశ్వాసోత్కంపపులకితాదులు లేనందువల్ల ఇది తెలుగు పద్యానికి మూలం కాదు.

మమ్మటాచార్యుని 'కావ్యప్రకాశము' చతుర్థోల్లాసంలోని ఈ శ్లోకాన్ని చూడండి:

**ధన్యాసి యా కథయసి ప్రియసఙ్గమేఽపి**
**విస్రబ్ధచాటుకశతాని రతాన్తరేషు**
**నీవీం ప్రతి ప్రణిహితశ్చ కరః ప్రియేణ**
**సఖ్యై క్షపామి యది కిఞ్చిదపి స్మరామి.(శ్లో. 61)**

ఇందులోనూ పై గాథలో వలెనే వ్యతిరేకాలంకారముఖంగా విషయం సపత్నీగర్హణమే అయినప్పటికీ, నిఃశ్వాసోత్కంపపులకితాదులు లేనందువల్ల ఇది తెలుగు పద్యానికి మూలం కాదు. ఇంకా ఆసక్తి గలవారు "అత్ర వాక్యార్థేన వస్తుమాత్రరూపేణ ధనసమృద్ధిమయత్వేన మయ్యెవ భోగ్య ఇతి" అన్న సోమేశ్వర భట్టు కావ్యప్రకాశ సంకేతవ్యాఖ్యలోని అందమైన వివరణను చూడండి. ఈ "ధన్యత్వ" నిరూపణం కూడా తెలుగు కవిని ప్రభావితం చేయలేదని స్పష్టమే.

ఇంతకీ, ఈ పద్యాన్ని ఉదాహరించిన భాస్కరుని 'శృంగార రత్నాకరము', భాస్కర ప్రెగ్గడ 'రసాలంకారము' ఒకటే అవునో కాదో తెలియదు. రచనా కాలం తెలియదు. ఆ గ్రంథాలలోనూ ఇది 'కళావిలాసము' లోనిదిగా ఉదాహృతమై ఉండదు.

క్షేమేంద్రుని కలావిలాసంలో దీనికి స్థానం లేదు. 'కళావిలాసము' కామశాస్త్రగ్రంథమైతే ఈ పద్యానికి అక్కడా నివేశం ఉండదు. పెదపాటి జగన్నాథకవి దీనిని 'కళావిలాసము' లోనిదిగా చెప్పలేదు కాబట్టి దీనిని ఈ ఉపరి పరిశీలన పట్టిక నుంచి తొలగించాలి.

పై గాథకు మరొక అనువాదం మానవల్లి వారు 1910లో ప్రకటించిన 'ప్రబంధమణిభూషణము'లో ఉన్నది:

**తే. భాగ్యవతులు మున్ను ప్రాణేశ్వరునిఁ జూచి**
**వడఁకువారు నూర్పు విడుచువారు**
**పులకలొత్తువారుఁ బోలంగ ననుఁబోటి**
**తన్ను మఱచునదియుఁ దడవఁ గలదె.ప్రబంధ. (ప. 671)**

మానవల్లి వారు, నిడుదవోలు వేంకటరావుగారు ఇది శ్రీనాథుని 'గాథాసప్తశతి' లోనిది కావచ్చునని ఊహించారు. పదసార్థకతను, శైలి భణితిని, అలంకార్యతను చూస్తే దీనికంటె "లలనలు గొంద ఱాత్మవరులన్" అన్న పద్యమే శ్రీనాథుని రచన కావచ్చు ననిపిస్తున్నది. విమర్శకులు ఇంకా ఆలోచించాలి.

⯎ 9 ⯎

## 'ఆంధ్ర ప్రయోగరత్నాకరము'లోని 'కళావిలాసము' విషయం

ఇక, నన్నెచోడుని 'కళావిలాసము' లోనివిగా గణపవరపు వేంకటకవి తన 'ఆంధ్ర ప్రయోగరత్నాకరము'లో లక్ష్యాలుగా ఉదాహరించిన పద్యాలు 'కళావిలాసము' లోనివి అవునని, కాదని ఉభయతః భావించటానికి వీలయిన స్థితిలో ఉన్నాయి. వీటిలో మొదటిది - పార్వతీదేవి నారదుని మాటను వినలేక ఆగ్రహింపగా చూచి పరమేశ్వరుడు పెదవులపై చిరునవ్వు చిందిస్తూ ఈ ఇద్దరితో న్యాయయుక్తంగా అంటున్న మాటగా - కథావశాన చోటుచేసికొన్న కొంత విపర్యాసంతో క్షేమేంద్రుని రచనలోని లోభవర్ణనసర్గం లోనిది కావచ్చును:

**క. నగజాత నారదు నుడి వి, నఁగలే కాగ్రహముఁ జెందినఁ గని హరుఁడు లే**
**నగవు సెలవి నిగుడఁగఁ ది, న్నగఁ బలికెస్ సతికి మునికి నాయము దోఁపస్.**

ఈ క్రింది పద్యంలో విశ్వామిత్రుని ప్రస్తావన ఉన్నది. సముద్రమంత లోతైనవానిని, రాధామనోవల్లభుడైన శ్రీకృష్ణుని పాదపద్మములయందు సేవాభావముతో సమర్పితమైన తపశ్శక్తి కలిగినవానిని, మునిశ్రేష్ఠుడైన విశ్వామిత్రుని వనస్థలంలో దర్శించినదెవరో స్ఫుటగోచరం కాకపోయినా, కథావశాన చోటుచేసికొన్న కొంత విస్తృతితో క్షేమేంద్రుని

రచనలోని దంభవర్ణనసర్గం లోనిది కావచ్చును. దంభపురుషుని దాంభికతను చూసి తలవంచికొని నిలబడిన ఋషిలోకంలో విశ్వామిత్రుడు కూడా ఉన్నాడు. అది నిమిత్తంగా తెలుగు కవి దీనిని ప్రవేశపెట్టినట్లు ఊహింపవచ్చును.

**క. పాథోనిధిగాంభీర్యస్, రాధాకాముకపదాబ్జరాజత్సేవా**
**మేధాధుర్యతపోరా, గాధేయుని మునివతంస(సు?) గాధేయు వనిస్.**

వేటూరి ప్రభాకరశాస్త్రిగారు ఈ రెండు పద్యాలు గణపవరపు వేంకటకవి తాను నిరూపించిన లక్షణాలను వ్యవస్థీకరించుకోవటం కోసం కల్పించిన కూటసృష్టిపద్యాలని భావించారు. 'కళావిలాసము' అంటూ ఒక గ్రంథం బయటపడితే గాని ఏ సంగతీ నిర్ధారణగా చెప్పలేము. కూటసృష్టి పద్యాలు అయితే గణపవరపు వేంకటకవికి ఈ నన్నెచోడుని పేరు ఎక్కడ దొరికినదన్న ప్రశ్నకు సమాధానం చెప్పవలసివస్తుంది.

⌖ 10 ⌖

## 'కుమారసంభవము' కర్త నన్నెచోడుడు, 'కళావిలాసము' కర్త నన్నెచోడుడు ఒక్కరేనా? కాదా?

నన్నెచోడుని 'కళావిలాసము' క్షేమేంద్రుని కావ్యానికి అనువాదమేనని నిశ్చయమైనాక, వివాదాస్పదుడైన 'కుమారసంభవము' కర్త నన్నెచోడుడు, ఈ 'కళావిలాసము' కర్త ఒక్కరేనా? కాదా? అన్న జిజ్ఞాస కలగటం సహజం. ఆ సందేహనిరాసార్థం కుమారసంభవ కర్త నన్నెచోడునికి క్షేమేంద్రుని కలావిలాస కావ్యంతోనూ, క్షేమేంద్రుని ఇతర రచనలతోనూ పరిచయం ఉన్నదా? లేదా? అని కొంత పరిశీలింపగా, ఈ క్రింది పద్యం ఒకటి కనబడింది:

**మ. నలి నాత్మవ్యవసాయవాదులును గన్యావాదులుస్ మంత్రవా**
**దులు దివ్యౌషధ వశ్యధాతు రసవాదుల్ మోహులై త ద్దయా**
**కులతం బొందుదు రాశఁ బె ట్టవియ కోర్కుల్ గూర్చు ముస్ భక్తవ**
**త్సల! సర్వేశ్వర! నిన్నుఁ గొల్వ కెదలో దారిద్ర్యవిద్రావణా!(10-96)**

ఈ పద్యంలోని అనన్వితాలు, పాఠవిపర్యాసాల మాట అటుంచి, 'కుమారసంభవము' ద్వితీయ భాగం లఘుటీకలో మానవల్లి వారు వ్రాసిన మాటలను చూడండి:

"461. ఆత్మవాదులు, కపటవేదాంతులు, లేక కపటయోగులు. వ్యవసాయవాదులు = వ్యవసాయమున నపూర్వమార్గముల నుపదేశించి ఫలాధిక్యముఁ జూపుదుమనెడు కపటదేశికులు. కన్యావాదులు = కన్యలఁ దెచ్చి వివాహము చేయించి ద్రవ్యము గొనువారు. దివ్యౌషధవాదులు = రసాయనౌషధములచేఁ జిరజీవులుగాఁ జేయుదు మనువారు. ధాతువాదులు = తాళక హింగుళాది ధాతువుల రూపాంతరములఁ గల్పించువారు."

- (మానవల్లి కవి రచనలు: పుట. 55)

ఇది క్షేమేంద్రుడు తప్ప సాహిత్యంలో వేరెవరూ చేయని భావార్థనిరూపణ. కలావిలాసంలో ధాతువాదాన్ని గురించి క్షేమేంద్రుని నిర్వచితాన్ని చూడండి:

**శతవేధీ సిద్ధో మే సహస్రవేధీ రసోఽపి నిర్యాతః**
**ఇతి వదతి ధాతువాదీ నగ్నో మలినః కృశో రూక్షః.(9-8)**

(శతవేధినైన సిద్ధుణ్ణే కాని నేను సహస్రవేధి సిద్ధరసం ఒకదాన్ని తయారుచేశాను. దాన్ని తింటే ఆయుష్షు పెరుగుతుంది. బలం వస్తుంది. ఐశ్వర్యం కలుగుతుంది – అని చెబుతూ ధాతువాది తాను మాత్రం కట్టుబట్టలు లేక, చేత చిల్లిగవ్వ లేక, నీరసం వల్ల కోపంతో కన్నులెఱ్ఱజేసి తిరుగుతుంటాడు.)

**వివిధౌషధపరివర్తైః యోగై ర్జిజ్ఞాసయా స్వవిద్యాయాః**
**హత్వా నృణాం సహస్రం పశ్చాద్వైద్యో భవేత్ సిద్ధః.(9-4)**

"వివిధౌషధపరివర్తైః = దివ్యౌషధవాదులు = రసాయనౌషధములచేఁ జిరజీవులుగాఁ జేయుదు మనువారు", "ధాతువాదులు = తాళక హింగుళాది ధాతువుల రూపాంతరములఁ గల్పించువారు" అన్న ప్రయోగాలు క్షేమేంద్రప్రయుక్తాలకు అనుసరణలే. ఇంకా రసాయనవాదుల వర్ణనకోసం క్షేమేంద్రుని 'దేశోపదేశము'లో (8-20, 21, 48) శ్లోకాలను చూడండి. కుమారసంభవ కర్తకు క్షేమేంద్ర రచనలతో పరిచయం ఉండటమే గాక, "వ్యవసాయము" అంటే "సేద్యము" అన్న ఆధునిక వ్యవహారం కూడా తెలిసి ఉండటం మరొక విశేషం.

ఈ ఉభయుల ఐక్యవాదానికి ఉపస్కరించే ఆధారాలేవీ ఇంతవరకు బయల్పడలేదు.

ఈ చర్చానుసారం వెల్లడైన విషయాలివి:

- ❖ క్షేమేంద్రుని కలావిలాసానికి తెలుగు 'కళావిలాసము' అనువాదమే. మానవల్లి రామకృష్ణకవిగారు అందులో కథాంశాలు లేవనటం సరికాదు.
- ❖ పెదపాటి జగన్నాథకవి 'ప్రబంధరత్నాకరము'లో ఉదాహరించిన 'కళావిలాసము', గణపవరపు వేంకటకవి 'ఆంధ్ర ప్రయోగరత్నాకరము'లో ఉదాహరించిన నన్నెచోడుని 'కళావిలాసము', ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తి గారి ప్రత్యంతరంలోని 'కళావిలాసము' ఒకటే కావచ్చును. అవి వేర్వేరు గ్రంథాలు కావు.
- ❖ 'కళావిలాసము' కావ్యమే; కామశాస్త్ర ప్రకరణగ్రంథం కాదు.
- ❖ ఆచార్య శ్రీరామమూర్తిగారు ఊహించినట్లు 'కళావిలాసము' కర్త నన్నెచోడుడు, మడికి సింగన 'సకలనీతిసమ్మతము'లో ఉదాహృతుడైన 'నీతిశాస్త్రముక్తావళి', 'బద్దె నీతి' కృతుల కర్త అయిన బద్దె

నృపాలుడు, "బద్దె నన్నిచోడుడు" ఒకరు కారు. అసలు "బద్దెన నన్నిచోడుడు" లేదా "బద్దె నన్నిచోడుడు" అన్న వ్యక్తి లేడు. 'కళావిలాసము' కర్త "బద్దె నన్నిచోడుడు" కాడు.

- తెలుగు 'కళావిలాసము' క్రీస్తుశకం 1029-1064ల నడుమ కాశ్మీరదేశాన్ని పరిపాలించిన అనంత నరేంద్రుని ఆస్థానకవి, మహాలాక్షణికుడు, మహాకవి అయిన క్షేమేంద్రుని 'కలావిలాస' కావ్యానికి అనువాదం కాబట్టి ఆంధ్రీకర్త నన్నెచోడుడే అయితే క్షేమేంద్రునికి కనీసం ఒక శతాబ్దికి తర్వాతివాడు కావాలి. క్రీస్తుశకం 15-16 శతాబ్దుల నడిమి కాలంలో వెలసిన "తామ్బూలం కటుతిక్త ముష్ణమధురం క్షారం కషాయాన్వితం" అన్న శ్లోకానికి అనువాదం ఉండటం వల్ల, క్రీస్తుశకం 1575 ప్రాంతాల వెలసిన తెనాలి రామకృష్ణకవి 'పాండురంగమాహాత్మ్యము' ప్రభావం ఉన్నందున 'కళావిలాసము' ఆ రెండింటికి తర్వాతిది; క్రీస్తుశకం 18-వ శతాబ్ది నాటి పెదపాటి జగన్నాథకవి, గణపవరపు వేంకటకవి ఉదాహరించినందువల్ల అంతకు మునుపటిది.
- 'కుమారసంభవము' కర్త నన్నెచోడునికి క్షేమేంద్రుని రచనలతో పరిచయం ఉన్నది. అయితే, 'కుమారసంభవము' కర్త నన్నెచోడుడు, 'కళావిలాసము' కర్త నన్నెచోడుడు ఒకరో కాదో చెప్పడానికి ఇప్పుడున్న ఆధారాలు చాలవు. శబ్దసంయోజనను బట్టి ఒకరు కాకపోవచ్చునని అనిపిస్తుంది.
- 'కుమారసంభవము' కర్త నన్నెచోడుడు, 'కళావిలాసము' కర్త నన్నెచోడుడు ఒకరే అయితే మాత్రం అంతగా ప్రౌఢం కాని 'కళావిలాసము' సుపరిణతమైన నన్నెచోడుని 'కుమారసంభవము' కావ్యానికంటె మునుపటిది అన్నమాట.
- సాహితీవేత్తలు పరిశీలించి నిగ్గుతేల్పవలసిన చర్చనీయాంశాలివి.

## ఉపయుక్త గ్రంథాలు


⧫ మానవల్లి కవి రచనలు: సంస్కృతప్రాకృతాంధ్రాంగ్లాలలో, తమిళకన్నడమలయాళాలలో నిరుపమానమైన మహాపాండిత్యాన్ని గడించి, మహాకవిత్వదీక్షాకంకణాన్ని ధరించి, విపులకృషితో దేశమంతటా తాళపత్రాలలో తలదాచుకొన్న మహాగ్రంథాలకు సూర్యాలోకభాగ్యాన్ని ప్రసాదించి జాతి కృతజ్ఞతకు పాత్రులైన ధన్యజీవి శ్రీ మానవల్లి రామకృష్ణకవిగారి తెలుగు పీఠికలు, వ్యాసాలు, కవితలలో ముఖ్యమైనవాటిని విద్యారత్న నిడుదవోలు వేంకటరావు, డాక్టర్ పోణంగి శ్రీరామ అప్పారావు మహోదయులు 1972లో ఏర్చికూర్చిన బృహత్సంకలనగ్రంథం. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వారికి ఎనలేని ప్రతిష్ఠను తెచ్చిపెట్టిన గొప్ప సంపుటం. ఒక్కొక్క వ్యాసం ఒక్క లఘుసిద్ధాంతగ్రంథానికి సాటివచ్చే అనర్ఘమైన కూర్పు. శ్రీ కవిగారితో అభిప్రాయభేదాలు కలవారు సైతం ఒక్క వ్యర్థపదం లేని అమోఘమైన వారి కవితాత్మకశైలికి, అసాధారణమైన ధారణాశక్తికి, సర్వాంగీణమైన ప్రతిభకు విస్తుపోకుండా ఉండలేరు. సాహిత్యచారిత్రాసక్తి కలిగిన ప్రతివిద్యార్థికి వాచోవిధేయం కావలసిన మహనీయరచన. ఇందులో లేని వ్యాసాలను చేర్చి కవిగారి పవిత్రస్మృతికి నీరాజనగా మరొక ముద్రణను వెలయించాలి.

❖ సకలనీతిసమ్మతము: 1923లో మానవల్లి రామకృష్ణకవిగారు ప్రకటించిన మడికి సింగన సంకలనగ్రంథానికి 1970లో నిడుదవోలు వేంకటరావు గారి పునఃపరిష్కరణతో వెలువడిన ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వారి ప్రతి. నిడుదవోలు వారి అమూల్యమైన పీఠిక, అనుబంధంగా ఇచ్చిన ఆచార్య వోణంగి శ్రీరామ అప్పారావుగారి పాఠాంతరపట్టిక దీనికి చెప్పలేనంత విలువను తెచ్చిపెట్టాయి.

❖ కలావిలాసం: మహామహోపాధ్యాయ పండిత దుర్గాప్రసాద కాశినాథ - పాండురంగ పరబ్ లు కావ్యమాలా గుచ్ఛం ప్రథమసంపుటంలో పరిష్కరించి ప్రకటించిన ప్రతి, వారణాసిలో చౌఖాంబా భారతీ అకాదమీ వారి ద్వితీయ ముద్రణ 1984 (పు. 34-79లు).
(https://archive.org/stream/Kavyamala_anthology_series_of_Nirnaya_sagar_press/KavyamalaAnthologyVol.01-MahaganapatistotraOfRaghavachaitanyaEtc1929#page/n0/mode/2up)

❖ కళావిలాసము: శ్రీ క్రొత్తపల్లి సూర్యరావు, 'సరస్వతి' పత్త్రికలో ధారావాహికగా ప్రథమ ముద్రణ 1908లో కాకినాడ నుంచి. ద్వితీయముద్రణ 1937లో ఆర్య పుస్తకాలయము పక్షాన రాజమహేంద్రవరము నుంచి. ఆంధ్రసారస్వతపరిషత్తు మూలస్తంభాలలో ఒకరైన క్రొత్తపల్లి సూర్యరావుగారు సంస్కృతం రాని తెలుగువాళ్ళకోసం నెల్లూ పొల్లూ లేని సలక్షణమైన వచనంలో చేసిన అనువాదం. (https://archive.org/details/kalavilasamu020572mbp)

❖ A History of Sanskrit Literature (Vol. I): మహావిద్వాంసులు సుశీలకుమార్ దే గారు కావ్యసాహిత్యచరిత్ర ప్రకరణంలో (పు.406-10) వ్రాసిన విహంగావలోకనపూర్వక విజ్ఞవిమర్శనం. 1947లో కలకత్తా విశ్వవిద్యాలయం వారు ప్రకటించిన ఉత్తమరచన. మూలదేవుని కథానకాన్ని గురించి దేశవిదేశాలలో జరిగిన పరిశోధనపత్త్రాల, వ్యాసాల సమాచారమూ ఇందులో దొరికింది.

❖ Minor Works of Kshemendra: ఉస్మానియా యూనివర్సిటీ ప్రాంగణంలో వెలసిన సంస్కృత అకాడమీ ఆధ్వర్యవంలో ఆర్యేంద్ర శర్మ, ఈయుణ్ణి వేంకట వీరరాఘవాచార్యులు 1959లో పరిష్కరించిన చక్కటి ప్రతి. ఇటీవలే 2009లో ద్వితీయ ముద్రణ వెలువడింది.

❖ Collected Papers of Manavalli Ramakrishna Kavi: సుగృహీత నామధేయులైన మానవల్లి వారి ఆంగ్లవ్యాసాలలో కొన్నింటి సంకలనం. పి.యస్.ఆర్. అప్పారావు, ఎస్. రాధాకృష్ణమూర్తి గారల సంపాదకత్వంలో తెలుగు విశ్వవిద్యాలయం 1986లో ప్రకటించిన ప్రతి. మానవల్లి వారి విలువైన వ్యాసాలలో పెక్కింటిని సంపాదించలేకపోవటం, చెప్పలేనన్ని అచ్చుతప్పులతో అశ్రద్ధగా అచ్చువేయటం ఈ సంపుటంలోని ప్రధానలోపాలు. ఇందులోని Two Cryptic Words in the Arthasastra అన్న మేలి వ్యాసంలో (పుట.272-80లు) మూలదేవుని గురించిన ఆసక్తికరమైన సమాచారం ఉన్నది.

❖ Three Satires from Ancient Kashmir: పెంగ్విన్ బుక్స్ ఇండియా వారు 2011లో వెలువరించిన A.N.D. హక్సర్ గారి నర్మమాలా దేశోపదేశ కలావిలాస కావ్యాల మంచి అనువాదం. క్షేమేంద్రుని నిష్పక్షపాత సామాజికవిమర్శ ఖడ్గధార పదునెంతో చూడగోరినవారికి ఆధునిక భాషలో కావించిన వ్యాఖ్యానాత్మక పరిశీలనమిది.

❖ కవిజనసంజీవని: ముద్దరాజు రామన గ్రంథానికి లిఖితప్రతులలోని సర్వపాఠాలను నెమరువేసి వావిళ్ళ వారు 1930లో ప్రకటించిన విలువైన ప్రతి.

❖ తెలుగు భాషలో ఛందోరీతులు: లాక్షణికాగ్రేసరులు రావూరి దొరసామిశర్మగారు జీవితకాల పరిశోధనను సంక్షేపించి ఛందోవిజ్ఞాన సర్వాంగసమీక్షగా 1962లో వెలయించిన మహాగ్రంథం.

❖ కవిచింతామణి: వెల్లంకి తాతంభట్టు రచన. రావూరు దొరసామిశర్మగారు అత్యుత్తమపాఠాలతో తమ మహాకృషికి అనురూపంగా పరిష్కరించిన ప్రతిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారం వారు 1982లో ప్రచురించారు.

❖ నన్నెచోడుని కుమారసంభవము ప్రాచీనగ్రంథమా?: ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తిగారు నాలుగు దశాబ్దాల అధీతిబోధ ఫలితంగా 1983లో ప్రకటించిన బృహత్పరిశోధనగ్రంథం. 'కుమారసంభవము' మానవల్లి రామకృష్ణకవిగారు తామే రచించి వ్రాతప్రతిని తంజావూరు గ్రంథాలయంలో ప్రవేశపెట్టారన్న విశ్వాసం 1930 నుంచి ఉన్నప్పటికీ వాదప్రాబల్యం వల్ల అది మళ్ళీ ఈ తరం విద్యార్థుల అందుబాటులోకి వచ్చింది. వీరి ధోరణిలో కొంత అతివాదం, చక్రబంధం అన్వయంలో పొందిపొసగని దూరాన్వయలోపం ఉన్నా వివిధశాసనాలను వీరు చారిత్రికంగా అన్వయించిన తీరు ప్రామాణికం. సర్వాంగీణమైన కావ్యవిమర్శతో రూపొందించిన సాటిలేని గ్రంథం. విశ్వవిద్యాలయాలు, విమర్శకులు దీనిని ఉపేక్షించటం శోచనీయం. http://www.dli.ernet.in/ లో చూడండి.

❖ అలబ్ధకావ్యపద్యచింతామణి: సంస్కృతాంధ్రభాషామహోపాధ్యాయులు ఆచార్య రవ్వా శ్రీహరి గారు తెలుగు లక్షణగ్రంథాలు, సంకలనగ్రంథాల నుంచి సేకరించిన అలబ్ధకావ్యాలలోని పద్యాల అద్భుతావహసంచయం. 1983లో ప్రకటితమైంది. దీనిపై సమీక్షాత్మక సమగ్రవిమర్శ వెలువడాలి.

❖ సాహిత్యసంపద: 1989లో ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తి గారు ప్రచురించిన ప్రామాణిక సాహిత్యవ్యాసాల సంకలనం. ఇందులో 'ప్రబంధరత్నాకరము – తృతీయాశ్వాసము ప్రత్యంతర విశేషములు', 'ప్రబంధరత్నాకరము – చతుర్థాశ్వాసము ప్రత్యంతర విశేషములు' అని 255-315 పుటల మధ్య రెండు వ్యాసాలున్నాయి. శ్రీరామమూర్తిగారు విజయనగరంలో మేడేపల్లి వేంకటరమణాచార్యుల వారి ఇంట ఉండిన నోటుపుస్తకం 'ప్రబంధరత్నాకరము' ప్రత్యంతరమని గుర్తించి, అందులోని పద్యాల లఘువివరణలతో రచించిన వ్యాసాలివి. పద్యాల పరిష్కృతపాఠాలను గాక పరిశోధకుల పరిశీలనార్థం వ్రాతప్రతిలోని పాఠాలను యథాతథంగా ఇచ్చారు.

❖ ప్రబంధరత్నాకరము: పెదపాటి జగ్గన్న సంకలనగ్రంథం. ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తి గారి సమర్థపరిష్కరణతో ఆంధ్ర విశ్వకళాపరిషత్తు 1992లో ప్రకటించిన సుముద్రిత ప్రతి. ఇందులో పైని ఉదాహరించిన ప్రత్యంతరంలోని పద్యాలు కూడా కలిసిపోయాయి. దీనికి పద్యవ్యాఖ్యాపూర్వకమైన వివరణ వెలువడటం అవసరం.

❖ శతపత్రము: 2004లో సుపథ ప్రచురణలు పక్షాన డా. అక్కిరాజు రమాపతిరావు గారి సంపాదకత్వంలో వెలువడిన విదితవిద్వాంసులు, సత్కావ్యపరిష్కర్త గడియారం రామకృష్ణశర్మగారి ఆత్మకథ. ఇరవైయవ శతాబ్ది తొలిపాదంలో సంప్రదాయము, ఆధునికతలకు సంఘర్షణ కలిగి వినూత్నపరిణామాలు చోటుచేసికొంటున్న సంధియుగంలో సర్వాదర్శానుష్ఠానపూర్వకంగా నిఃస్వార్థమైన జీవికను గడిపి, జాతిపురోగతికై తపించి, తన్నిమిత్తం తనకాలం నాటి ప్రజోద్యమాలన్నింటిలో పాల్గొని, జీవితంలో సుఖదుఃఖాలను రాగద్వేషవిరహితంగా స్థితప్రజ్ఞతతో అనుభవించి, తన

అనుభవసారాన్ని ఇంత ప్రశాంతమైన మనస్సుతో స్తిమితంగా అరమరిక లేకుండా నెమరువేసుకొనగలవారు ఎంతో అరుదుగా ఉంటారు.

చిన్నప్పుడు వీరి 'గదాయుద్ధము' నాటకానువాదాన్ని, చదివి దర్శనం చేసుకోవాలని ఎంతగానో ఉవ్విళ్ళూరాను. 'శతపత్రము' చదివాక, ఇరవైయవ శతాబ్ది మహనీయులలో ఒకరిని కలుసులేకపోయానన్న చింతే మిగిలింది.

❖ రతిరహస్యము: కోకశాస్త్రమన్న పేరిట దేశమంతటా ప్రసిద్ధికెక్కిన క్రీస్తుశకం 12-వ శతాబ్ది నాటి కొక్కోకుని రచన. కొక్కోకుడు సింహళీయుడని దాక్షిణాత్యుల విశ్వాసం. పేరును బట్టి వంగదేశీయుడని తెలుస్తూనే ఉన్నది. క్రీ.శ. 1525 ప్రాంతాల కూచిరాజు ఎఱ్ఱన దీనిని తెలుగులోకి సమర్థంగా అనువదించాడు. పలుపర్యాయాలు అచ్చయింది.

❖ రతిరహస్యము: హరిహర కవి పేరిట 1846లో కల్చరల్ బుక్స్ వారు మద్రాసులో అచ్చువేసినది. ప్రతులు సులభంగా దొరకవు. ఈ హరిహరుడు సుప్రసిద్ధుడైన తెలుగు కవి హరిభట్టు అని ప్రకాశకులు గుర్తింపకపోవటం పొరపాటు. మహావిద్వాంసులు ఆచార్య దేవళ్ళ చిన్నికృష్ణయ్యగారు హరిభట్టు 'వరాహపురాణము'ను పరిష్కరించినప్పుడు పీఠికలో దీని కర్తృత్వవిశేషాలను లఘువుగా పరిచయం చేశారు. పూర్వోత్తరసంహితతో దీనిపై సమగ్రవిమర్శ వెలువడవలసి ఉన్నది.

❖ విక్రమార్కచరిత్రము: మహాకవి జక్కన కృతి, డాక్టర్ పల్లా దుర్గయ్యగారి సంపాదకత్వంలో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ 1968లో ప్రకటించిన నిర్దుష్టమైన ప్రతి. 1913లో వావిళ్ళ వారు బులుసు సీతారామశాస్త్రిగారి పీఠికతో ప్రకటించిన ప్రతికి ఇది పునర్ముద్రణమే కాని సరికొత్త పరిష్కరణం కాదు. పాఠాంతర సమాకలనపూర్వకంగా దీనికొక నూత్నముద్రణ వెలువడితే బాగుంటుంది.

❖ విజయవిలాసము: చేమకూరి వేంకటకవి మహనీయకృతి. నేను సంప్రతించినది వావిళ్ళ వారి 1962 నాటి ప్రతి.